ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శ్రీకాకుళం
16
మంగళవారం 22 ఆగస్టు 2017





బుజ్జాయిల చేతుల్లో.. బొజ్జ గణపయ్య

- రేపు 'ఆంధ్రజ్యోతి లిటిల్స్', ఎస్ఆర్ షాపింగ్‌మాల్ సంయుక్తంగా నిర్వహణ
- చిన్నారులతో మట్టి విగ్రహాల రూపకల్పన
- వేదిక : వైఎస్సార్ కల్యాణ మండపం

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)

చిన్నారులు ఎప్పుడెప్పుడా అని ఉత్సాహంగా ఎదురుచూసే పండుగల్లో వినాయక చవితి ఒకటి. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని.. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా 'ఆంధ్రజ్యోతి లిటిల్స్, ఎస్ఆర్ షాపింగ్‌మాల్' సంయుక్తంగా చిన్నారులను భాగస్వామ్యం చేస్తూ.. సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం

- మిగతా 14లో



సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల

అక్రమాలకు ఆశ్రమం

ఏజెన్సీలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు అక్రమాలకు అలవాలంగా మారుతున్నాయి. గిరిపుత్రులకు సరైన విద్య, వసతి కల్పించాల్సిన కొందరు అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. కంచే చేను మేసిన చందాన లేని విద్యార్థుల పేర్లను జాబితాలో చూపించి నెలనెలా నిధులు బొక్కేస్తున్నారు. ఇలా ఒకటీ రెండు కాదు 47ఆశ్రమ పాఠశాలల్లోనూ అదే పరిస్థితి. పట్టించుకునే నాథుడు లేక... పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు రాక.. ఇవన్నీ అవినీతిలో మునిగి తేలుతున్నాయి. ఆశ్రమ పాఠశాలలే కాదు.. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో సైతం ఏటా రూ.3.30కోట్ల మేర నిధులు దారి మళ్లుతున్నాయి.

- ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో అవినీతి దందా
- విద్యార్థుల బోగస్ హాజరు
- అడ్డగోలుగా బొక్కేస్తున్న వార్డెన్లు
- మరో 18 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లోనూ అదే తీరు
- ఏటా రూ.3.30 కోట్ల నిధులు పక్కదారి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, శ్రీకాకుళం)

సీతంపేట సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ.. ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలలు నిర్వహిస్తోంది. ఇవి ఏజెన్సీ మండలాల్లో 18, సబ్ ప్లాన్‌మండలాల్లో 29.. మొత్తం 47 ఉన్నాయి. ఇందులో బాలికల ఆశ్రమ పాఠశాలలు 17, బాలుర పాఠశాలలు 30 ఉన్నాయి. వీటిలో 17,896 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులోనే పిల్లలకు విద్య, వసతి ఐటీడీఏ కల్పిస్తోంది. వీరికి - మిగతా 14లో

వంశధార పూర్తి చేయాల్సిందే

- సీఎం చంద్రబాబు సుస్పష్టం
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

16లో



పోలీసుల అదుపులో గంజాయి నిల్వలతో వ్యాన్‌డ్రైవర్

దారి మార్చి... ఏమార్చి!

- లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద పోలీసులకు పట్టుబడిన వ్యాన్
- రూ.కోటి విలువైన గంజాయి స్వాధీనం

3లో

నేడు బ్యాంకుల సమ్మె

- 25 నుంచి మరో మూడు రోజులు సెలవు
- జిల్లావ్యాప్తంగా నిలిచిపోనున్న కోట్లాది లావాదేవాలు

6లో

'ఆఫ్‌షోర్'కు నిధులే నిధులు

- అదనపు స్లక్చర్లకు రూ.14.08కోట్లు మంజూరు
- వరదకాలువలో భారీ రాళ్ల పేల్చివేతకు రూ.3.26కోట్లు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

16లో



పలాసలోని శాఖాగ్రంథాలయం

గ్రంథాలయాలకు గ్రహణం

- సక్రమంగా వసూలు కాని సెస్
- జిల్లాలో రూ.3కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
- నిర్వహణ కష్టమంటున్న అధికారులు

(పలాస)

జిల్లాలో గ్రంథాలయాల నిర్వహణకు కష్టకాలం ఎదురైంది. గ్రంథాలయాల కోసం పన్నులు

- మిగతా 14లో

(ఎచ్చెర్ల)

మీరు విభిన్నంగా ఆలోచిస్తున్నారా... కొత్త ఆలోచనలు మీ బుర్రను తొలిచేస్తున్నాయా... మరెందుకు ఆలస్యం.. మీ ఆలోచనలను ఆవిష్కరణల రూపంలో పెడితే రివార్డులను కొట్టేయవచ్చు. వివిధ రంగాల్లో ఆవిష్కరణలు (ఇన్నోవేషన్స్)ను ఆహ్వానిస్తున్నారు. ఆ ఛాలెంజ్ రానే వచ్చింది. వివిధ రంగాల్లో ఆవిష్కరణలను పంపేందుకు ఈ నెల 31వ తేదీయే గడువు.

ఆలోచనలే పెట్టుబడి..

● ఆవిష్కరణలకు ఆహ్వానం ● ఈ నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ

9వ ఇండియా ఇన్నోవేషన్ ఇనీషియేటివ్ 2017లో ఏఐసీటీఈ ఆమోదిత టెక్నికల్ ఇనిస్టిట్యూషన్స్‌లో నమోదైన విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఇండియా ఇన్నోవేషన్ ఇనీషియేటివ్, టెక్నాలజీ శాఖ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీచే సంయుక్తంగా అభివృద్ధి చేసిన 9వ ఇండియా ఇన్నోవేషన్ ఇనీషియేటివ్ 2017 దరఖాస్తు లను ఆహ్వానిస్తోంది. దేశ వ్యాప్తంగా ఉత్తమ శ్రేణిలో గల ఇన్నోవేటర్ల గుర్తించి రివార్డులను ఇచ్చిన సంస్థ ఇది.

ప్రయోజనాలు- అవార్డులు..

ప్రత్యేక ఫ్రీ ఇన్‌క్యూబేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ట్రైనింగ్, ఉత్తమ శ్రేణి 20 మంది ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను జాతీయ ప్రదర్శనలో గ్రాండ్ జ్యూరీకి దాఖలు చేస్తారు. ఉత్తమ శ్రేణి ఇన్నోవేటర్లకు ఇన్‌క్యూబేషన్ సహాయం, ఇన్వెస్టర్‌తో అనుసంధానం చేస్తారు. సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్స్, ఇన్వెస్టర్స్, సీనియర్ కార్పొరేట్ నుంచి మెంటార్‌షిప్ సహాయం పొందడానికి అవకాశం, స్టార్‌ఫ్ఎ కో సిస్టమ్ నిపుణులు, ఉత్తమ శ్రేణి ప్రభుత్వ అధికారులతో వెబ్‌వర్కింగ్ నిర్వహిస్తారు.

ప్రాధాన్య రంగాల్లో అవకాశం..

వ్యయం, ఆటోమొబైల్, క్లీన్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ అండ్ ఫుడ్ టెక్నాలజీలో ఇన్నోవేషన్స్ ఆరోగ్య సంరక్షణలో (డయాగ్నస్టిక్స్, మెడికల్ ఇనుస్ట్రుమెంట్స్ ఇతర వైద్య సేవలు), ఐటీ, ఐటీ ఈఎస్(ఈ కమర్షియల్ ఎడిటెక్, ఫిన్‌టెక్, మానవ వనరులు, శిక్షణ, బయో మెట్రిక్స్, సెక్యూరిటీ, ఇతరత్రా), లైఫ్ సైన్స్ (బయోకెమిస్ట్రీ, బయోఫార్మా, బయోటెక్నాలజీ), నానో టెక్నాలజీలో ఇన్నోవేషన్స్ కోరుతున్నాయి. రోబోటెక్స్, కృత్రిమ ఇంటెలిజన్స్, పారిశుధ్యం, టెక్స్టైల్స్, రవాణా, లాజిస్టిక్స్, నీరు అంశాలపై ఇన్నోవేషన్స్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.



అర్హతలు ఇలా..

18 ఏళ్లు పూర్తయిన ఆపైన వయసు గల భారతీయ పౌరులు వ్యక్తి గతంగా లేదా బృందంగా నమోదు చేసుకొని దరఖాస్తు చేయవచ్చు. ఒక బృందానికి గరిష్ఠంగా ఐదుగురు ఉండొచ్చు. దరఖాస్తుకు కాన్సెప్ట్ లేదా ప్రోటోట్రైప్, సాఫ్ట్‌వేర్, సిమ్యూలేషన్ రుజువు ఉండాలి. దానిని సాంకేతికంగా ప్రదర్శించాలి.

అవార్డుల అర్హతా ప్రమాణాలు..

సృజనాత్మకత, మౌలికత, ఇన్నోవేషన్, టెక్నాలజీ దరఖాస్తు, వాణిజ్యీకరణ, అభివృద్ధికి సామర్థ్యం, పారిశ్రామిక, సామాజిక సమస్యల పరిష్కారానికి సామర్థ్యం కలిగి ఉండాలి. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు అనుశ్రీ గోయల్, కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ, ప్లాట్ నెంబర్ 249-ఎఫ్, ఉద్యోగి విహార్ ఫేజ్ 4, గురుగావ్, హర్యానా, 12295కు సంప్రదించాలి.

పర్యవేక్షణ మారుతోంది..

ఐసీడీఎస్‌లో మినీ సూపర్‌వైజర్ల నియామకం
సీనియర్ అంగన్వాడీ కార్యకర్తలకు అవకాశం
రూ.2500 గౌరవ వేతనం
జిల్లాలో 63 మందిని నియమించే అవకాశం



(శ్రీకాకుళం సిటీ)

జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్)లో ఇకపై మినీ సూపర్‌వైజర్లు రానున్నారు. జిల్లా వ్యాప్తంగా వీటిపై నియామకం ప్రక్రియ జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 18 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 4192 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులు పర్యవేక్షించేందుకు 169 మంది సూపర్‌వైజర్లు అవసరం కాగా ప్రస్తుతం 106 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన ఖాళీగా ఉన్న 63 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ ఖాళీల భర్తీలో అవరోధాలు తొలిగే వరకు స్థానికంగా సర్దుబాటు చేసేం దుకు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. బయటవారికి అవకాశం కల్పించకుండా ఏళ్ల తరబడి అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తూ డిగ్రీ విద్యార్హత ఉన్న వారిని నియమిం చాలని కలెక్టర్ ధనంజయరెడ్డి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. 18 ప్రాజెక్టుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. మొత్తం 272 దరఖాస్తులు రాగా పరిశీలన ప్రక్రియ పూర్తయ్యాక కలెక్టర్‌కు ఫైల్‌ను పంపి ఆమోదం తీసుకోనున్నారు.

● తాత్కాలిక పర్యవేక్షణ బాధ్యతలు..

దీర్ఘకాలికంగా జిల్లాలో 63 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో 2013లో పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేశారు. అయితే కొందరు కార్యకర్తలు తమకు అన్యాయం జరిగిందని న్యాయ స్థానానికి ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. దీంతో నియామకపు ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, కార్యకర్తలు, సహాయక సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ గాడి తప్పింది. దీనికి తోడు కేంద్రాల్లో అన్న అమృతహస్తం వంటి సరికొత్త కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కోర్టు కేసులు తేలే వరకూ ప్రత్యామ్నాయంగా అంగన్‌వాడీ కార్యకర్తలను తాత్కాలిక ప్రాతిపదికన మినీ(ఇన్‌చార్జి) సూపర్‌వైజర్లుగా నియ మించేందుకు నిర్ణయం తీసుకుని, రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

● మినీ సూపర్‌వైజర్లు ఎంపిక ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలను మినీ సూపర్‌వైజర్లుగా నియమిస్తున్నారు. సర్వీసు సీనియార్టీ, కనీస విద్యార్హత గ్రాడ్యుయేషన్, ఎక్కువ వయసు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టుల నుంచి సీడీపీవోలు ఎంపిక చేసిన జాబితా ప్రతిపాదనలను ఐసీడీఎస్ పథక సంచాలకుని కార్యాలయంలో స్వీకరించారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం జిల్లా యంత్రాంగం కలెక్టర్‌కు నివేదించనుంది. కాగా మినీ సూపర్‌వైజర్లుగా ఎంపికైన వారికి అంగన్‌వాడీ కార్యకర్త వేత నంతో పాటు అదనంగా గౌరవ వేతనంగా రూ.2,500 చెల్లిస్తారు. వాస్తవానికి ఇది చాలా తక్కువ మొత్తమే. ఓ పక్క అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తూనే మరో పక్క సూపర్‌వైజర్‌గా పనిచేయాల్సి ఉంటుంది. కనీసం 15 కేంద్రాల పని తీరును పర్యవేక్షించాలి. ఇదంతా తలకు మించిన భారమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు ఏ క్షణాన ఎలా ఉంటాయో, భవిష్యత్తులో నిర్వహించే సూపర్‌వైజర్ ఎంపిక పరీక్షలో వెయిటేజీ ఉంటుందేమో అన్న ఆశతో అధిక విద్యార్హతలున్న కార్యకర్తలు ఈ పోస్టుల్లో చేరడానికి మొగ్గు చూపుతున్నారు.

త్వరలోనే నియామకాలు ..

జిల్లాలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోస్టుల ఖాళీలు 63 ఉన్నాయి. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన కార్యకర్తల వివరాలను కలెక్టర్‌కు నివేదించాం. ఎంపిక కమిటీ నిర్ణయం మేరకు రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. విద్యార్హతలు, సీనియార్టీ ప్రాతిపదికగా త్వరలోనే నియామకాలు పూర్తి చేస్తాం. సీతంపేట, రాజాం ప్రాజెక్టుల్లో సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నా అక్కడ అర్హులు లేరు. త్వరలోనే అక్కడ కూడా రెండో విడతలో భర్తీ చేస్తాం. కేవలం సర్దుబాటు కోసమే వీరిని నియమిస్తున్నాం.

కె.లీలావతి, పథక సంచాలకులు, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ

ఆపద మొక్కులవాడు వేంకటనాథుడు



కిల్లిబుచ్చెన్నపేటలో నిర్మించిన వెంకటేశ్వరుని ఆలయం ఇదే..

(కిల్లిబుచ్చెన్నపేట (పోలాకి)

భక్తి

బెలమర పంచాయతీ కిల్లిబుచ్చెన్న పేటలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఈ ప్రాంత భక్తప్రజల ఆపదలు తీర్చేనాధుడుగా వెలుగొందుతున్నాడు. 12 ఏళ్ల క్రితం కిల్లి బుచ్చెన్నపేట గ్రామస్థుడు కిల్లి తేజోస్వామి భవన నిర్మాణ పనులకు మేస్త్రీగా పని చేసేవాడు. ఆయనకు ఓ సారి ప్రమాదం సంభవించడంతో విశాఖపట్నం నుంచి తన ఊరికి వచ్చేశాడు. ఆయన చికిత్స పొందుతున్న సమయంలో వెంకటేశ్వరస్వామి కలలోకి వచ్చి తనకు ఆలయం నిర్మిస్తే నీ బాధలన్నీ తొలగిపోయాయని స్వామి చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు ఆయన స్పందించి గ్రామంలో ఆలయ నిర్మాణానికి తగిన స్థలం కోసం అన్వేషించాడు. ఎవరూ ముందుకు రాకపోవడంతో తన సొంత భూమి 50 సెంట్లు స్వామివారి ఆలయ నిర్మాణానికి అప్పగించి నిర్మాణ పనులకు ముందడుగు వేశారు. అప్పటి నుంచి దాతలు ముందుకు వచ్చి తన వంతు విరాళాలు ఇవ్వడంతో ఆలయ నిర్మాణం పూర్తయింది. స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తేజోస్వామి ఆలయ అర్చకుడిగా స్వామి సేవ లో స్థిరపడిపోయాడు. తన సోదరుడు శ్రీరాములు కూడా శ్రీవెంకటేశ్వరుని సేవలో స్థిరంగా ఉండిపోయాడు. ఆలయ ప్రారంభోత్సవానికి చిన్నజీయర్ స్వామి విచ్చేసి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు స్వయంగా నిర్వహించారు. నాటి నుంచి నేటి వరకు ఆలయం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ప్రతి శనివారం భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు భజనలు నిర్వహిస్తున్నారు. సత్సంఘ సమావేశాలు, ప్రతి రెండో ఆదివారం భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి అన్నసమారాధన నిర్వహించడంతో సందడిగా ఉంటుంది. మంచి ఆహ్లాదకర వాతావరణంలో తిరుమల దేవస్థానాన్ని తలపించే రీతిలో ఆలయ నిర్మాణాలు చేపట్టారు. హైదరాబాద్, విశాఖపట్నం, నరసన్నపేట, కోటబోమ్మాళి, సంతబొమ్మాళి మండలాలల నుంచి ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు వేసవి కాలంలో వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు. మహిళా సంఘాల తరపున పొట్నూరు సంతోషి బృందం బాలికల కోలాటం వంటి నృత్యప్రదర్శనలు నిర్వహించి స్వామివారిపై తమకున్న భక్తిని చాటుకుంటారు.



ఆలయ అర్చకులు తేజోస్వామి, శ్రీరాములు

విద్యార్థులకు అంతిమ వీడ్కోలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజాంరూరల్: మడ్డువలస ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందిన దుప్పాడ రోహిత్‌నాయుడు, దాసరి సీతారామరాజులకు సోమవారం అంతిమ వీడ్కోలు నిర్వహించారు. సోమవారం స్థానిక సామాజిక ఆసుపత్రిలో రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దుప్పాడ రోహిత్‌నాయుడు తండ్రి రాజశేఖర్‌నాయుడు నగరపంచాయతీ పరిధి గాంధీనగర్‌లో నివాసం ఉండడంతో రాజాంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. దాసరి సీతారామరాజు స్వగ్రామం సంతకవిటి మండలం సోమన్నపేటలో అంత్యక్రియలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. రెండు కుటుంబాలలో విషాదఛాయలు అలమకున్నాయి. తల్లిదండ్రుల రోదన పలువురిని కంటతడిపెట్టించింది. సీతారామరాజు తల్లి చౌదరినాయుడు భర్త మృతి చెందిన తరువాత మతిస్థిమితం కోల్పోయింది. కుమారుడి అంత్యక్రియలు జరుగుతున్న విషయం కూడా ఆమెకు తెలియని పరిస్థితి.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ముద్దాడ(ఎచ్చెర్ల): భర్తతో తగాదా పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ముద్దాడ గ్రామానికి చెందిన పిసిని భార్గవీదేవి ఈ నెల 18న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. భర్త సత్యనారాయణతో తగాదా పడిన ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడింది. అదే రోజు రాత్రి చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా, 19న కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలు తగిలి లారీ క్లీనర్‌కు గాయాలు

బెల్లుపడ(కంచిలి): సోంపేట నుంచి మండలంలోని బెల్లుపడకు సిమెంట్ లోడుతో వస్తున్న లారీకి సోమవారం గ్రామసమీపంలో విద్యుత్ తీగలు తగిలి విజయవాడకు చెందిన లారీ క్లీనర్ రంగరాశి రాజునకు తీవ్రగాయాలయ్యాయి. లారీనకు విద్యుత్ తీగలు తగులుతున్నాయా లేదా డ్రైవర్ చూడమని చెప్పగా, రాజు పక్కకు చూసేసరికి అనుకోకుండా విద్యుత్ తీగలు తగలడంతో రెండు కాళు, నోటిభాగానికి గాయాలయ్యాయి. డ్రైవర్ 108కి ఫోన్ చేయగా సిబ్బంది వీ.గోపాలకృష్ణ, వీ.కే స్వాములు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమిచికిత్స అందించి సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు సేకరిస్తున్నామని ఎస్.ఐ సీ.హెచ్. ప్రసాద్ తెలిపారు.

దారి మార్చి... ఏమార్చి!

● లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద పోలీసులకు పట్టుబడిన వ్యాన్ ● రూ.కోటి విలువైన గంజాయి స్వాధీనం

పలాస: గంజాయి స్మగ్లర్లు రూటు మార్చారు. ఇంతవరకూ ఒడిశా నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే గంజాయి ప్రస్తుతం విశాఖ ఏజెన్సీ నుంచి ఒడిశా వెళ్తూ అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు తరలుతోందనే అనుమానానికి బలం చేకూరుతోంది. సోమవారం సాయంత్రం కాశీబుగ్గ సీఐ అ శోక్‌కుమార్, ఎస్ఐ సురేష్ తన బృందంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ బైపాస్ రోడ్డు లక్ష్మిపురం టో ల్‌ప్లాజా వద్ద మాటుకాసి వ్యాన్‌ను పట్టుకోవడంతో అసలు విషయం బయటపడింది. ఉల్లిపాయలు తరలిస్తున్న వ్యాన్‌లోవెయ్యి కేజీల బరువైన గంజాయి నిల్వలు బయటపడటంతో పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీటివిలువ జాతీయ మార్కెట్‌లో రూ.కోటి ఉండగా, అంతర్జాతీయ మార్కెట్‌లో రెండింతలు ఉంటుందని అంచనా. అనకాపల్లి మార్కెట్‌లో ఉల్లిపాయలు, బంగాళాదుంపలతో పాటు గంజాయి కూడా వ్యాన్‌లో ఎక్కించి ఇచ్ఛాపురం బోర్డరులో దింపిరావాలని డ్రైవర్ నిర్మల్‌బెహరాకు వ్యాన్ ఓనర్ పురమాయించాడు. మధ్యాహ్నం అనకాపల్లిలో బయలుదేరిన ఈ వ్యాన్ సాయంత్రం లక్ష్మిపురం టోల్‌గేట్ వద్దకు చేరుకుంది. పోలీసులకు సమాచారం రావడంతో వ్యాన్‌ను నిలుపుదల చేసి డ్రైవర్‌ను ప్రశ్నించారు. వ్యాన్‌లో ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఉన్నాయని హిందీలో పోలీసులకు వివరించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల ధర ఎక్కువగా ఉండడంతో ఒడిశాలో అమ్ముకొని రావాలని తమ ఓనర్ చెప్పడంతో డీలర్లకు ఇచ్చేందుకు తాను వెళ్తున్నానని చెప్పాడు. అయితే పోలీసులు వ్యాన్‌లో ఉన్న సరుకును సోదా చేయగా గంజాయి బస్తాలు బయటపడ్డాయి. ఒక్కో బస్తా 27.5 కిలోలుండగా, ప్యాకింగ్ పోను గంజాయి 25కిలోలు ఉంటుందని అంచనా వేశారు. దీని ప్రకారం 40 బస్తాల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ నిర్మల్‌బెహరాను అదుపులోకి తీసుకున్నారు. వాస్తవానికి గంజాయి స్మగ్లింగ్ వెనక భారీ ముఠాయే ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల గంజాయి స్మగ్లింగ్, రవాణా వ్యవహారంలో నే కాశీబుగ్గ పోలీసు కానిస్టేబుల్ రోణుకేశ్వరరావుపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. స్మగ్లర్లు ఆంధ్రా నుంచి ఒడిశా మీదుగా తరలించేందుకు పక్కా స్కెచ్‌తో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ మేరకు కాశీబుగ్గ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, డీఎస్పీ సీహెచ్.వివేకానంద, తహసీల్దార్ కళ్యాణచక్రవ ర్తి గంజాయిని పరిశీలించారు. పదేళ్ల కిందట ఇదే తరహాలో ఆయిల్‌ట్యాంకరులో గంజాయి తరలిస్తుం డగా సుమారు 800 కేజీల వరకూ పట్టుబడగా, టన్ను పట్టుబడటం జిల్లా చరిత్రలో ఇదే ప్రథమం.


గంజాయి బస్తాలను పరిశీలిస్తున్న డీఎస్పీ


గంజాయితో పట్టుబడిన వ్యాన్

అదుపు తప్పి బోల్తా పడిన లారీ

● డ్రైవర్ దుర్మరణం ● క్లీనర్‌కు తీవ్ర గాయాలు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి): జాతీయరహదారి ఎత్తురాళ్లపాడు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన డ్రైవర్ చోరగుడి సందీప్ (26) అక్కడికక్కడే మృతిచెందాడు. అదే జిల్లా పెడన గ్రామానికి చెందిన క్లీనర్ యర్ర రామలింగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. పశ్చిమబెంగాల్ నుంచి అనపర్తికి పశువుల దాణా తీసుకు వెళ్తూ ఆదివారం అర్ధరాత్రి ఎత్తురాళ్లపాడు సమీపంలోకి వచ్చేసరికి లారీ అదుపుతప్పి వంశధార వంతెనకు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనలో లారీ బోల్తాపడటంతో డ్రైవర్ సందీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ రామలింగేశ్వరరావును స్థానిక 30 పడకల సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కి 108 వాహన సహాయంతో తరలించారు,. మృతిచెందిన సందీప్‌కు ఏడాదిన్నర కిందటే వివాహం జరిగిందని, భార్య అనూష ఉన్నట్లు వారి బంధువులు తెలిపారు. ఎస్ఐ జి.నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన లారీ


తీవ్రంగా గాయపడ్డ రామలింగేశ్వరరావు

ఆకలి మంటలు తీర్చకుంటే ఆందోళన ఉధృతం

● వేతనాలు చెల్లించాలంటూ కలెక్టరేట్ ముట్టడించిన కాన్‌కాస్టు కార్మికులు ● అడ్డుకున్న పోలీసులు ● 62 మంది అరెస్టు

కలెక్టరేట్: గత ఆరునెలలుగా వేతనాలు లేక కడుపు మండుతోందని, మా ఆకలి మంటలు తీర్చకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని కాన్‌కాస్ట్ కార్మికులు హెచ్చరించారు. ఆమదాలవలస మండలం దూసి కాన్‌కాస్ట్ పరిశ్రమకు చెందిన కార్మికులకు వేతనాలు అందకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కార్మికులంతా మూకుమ్మడిగా రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆందోళనకు దిగారు. తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో 62 మందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. గోవిందరావు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందక ఆకలిమంటలతో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు తక్షణమే అందించకపోతే ప్రజా సహకారంతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అండతో యాజమాన్యం వేతన బకాయిలు చెల్లింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విరుచుకుపడ్డారు. పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపి వేతనాలు అందిస్తామని చెప్పినా చెల్లించలేదని మండిపడ్డారు. కార్మిక చట్టాన్ని ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించే వరకు ఐక్య ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రాము, రామచంద్రరావు, బి.మోహనరావు, బమ్మిడి రమణ, ధనుంజయరావు, కాళిదాసు కార్మిక సంఘ నాయకులు సీహెచ్ రాఘవ, ఎన్. శ్రీను, ఈశ్వరమ్మ, పార్థసారధి, ఎ.గోవిందరావు, ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కాన్‌కాస్ట్ కార్మికులు


సీఐటీయూ నేత గోవింద్ అరెస్ట్

వినతులు పరిష్కరించండి

మందస: రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభల్లో రైతులు అందించిన వినతులు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ పీవీశ్యామసుందరరావు వీఆర్‌వోలను ఆదేశించారు. సోమవారం వీఆర్‌వోలతో జరిగిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అడంగళ్లు అందించాలని, నీటి తీరువా వసూలుచేయాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐలు డి.అమరనాథ్, వి.సునంద, ఏఎస్‌వో బి.బోగేశ్వరరావు, సర్వేయర్ శ్రీనుబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్యామసుందరరావు


మల్లేశ్వరరావుకు కమిటీ పత్రాలను అందజేస్తున్న కుమారస్వామి

నవరత్నాలతో ప్రజలకు ప్రయోజనం

వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మెట్ట కుమారస్వామి

సిద్ధూరు(హరిపురం):వైసీపీ అధ్యక్షుడు ప్రకటించిన నవరత్నాలతో ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మెట్ట కుమారస్వామి తెలిపారు. మందస మండలంలోని సిద్ధూరు పంచాయతీలో సోమవారం బూత్ కమిటీ ఏర్పాటుచేశారు. బూత్‌కమిటీ అధ్యక్షుడిగా వెంకటరమణతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం హొన్నాళిలో సర్పంచ్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో బూత్‌కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్వరరావు, బాడ జగన్నాయకులు, అగ్గున్న సూర్యారావు, దల్లి జానకిరావు, కర్రి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యా ప్రగతికి కృషి చేయండి

మందస: విద్యార్థులు సవరణాత్మక బోధన చేసి, వారి సామర్థ్యాలపై అంచనా వేసేందుకు అక్టోబర్ 15,16 తేదీల్లో ఇంగ్లీష్, తెలుగు, విజ్ఞాన,సామాజికశాస్త్రాల సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ.రాజ్యలక్ష్మి, సర్వశిక్షాఅభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం మందసలో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు సవరణాత్మక బోధన చేసి విద్యాప్రగతికి కృషిచేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధించాలి: ఎంపీపీ


విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్న వసంతరావు

నగరంపల్లి(వజ్రపుకొత్తూరు):ఉత్తమఫలితాల సాధనకు విద్యార్థులు కృషిచేయాలని ఎంపీపీ వసంతరావు తెలిపారు. నగరంపల్లి హైస్కూల్‌లో సోమవారం భోజన ప్లేట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో పి.కృష్ణప్రసాద్, ఎంపీటీసీ ఇరోతు హేమంతరావు,టీడీపీ నాయకులు యు. ఉదయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం వీర్రాజు, ఉపసర్పంచ్ చక్రవర్తి, పల్లిసారథి మాజీ సర్పంచ్ పోతనపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.

శతశాతం మరుగుదొడ్ల నిర్మించండి

మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు:వచ్చే ఏడాది నాటికి శతశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారంవజ్రపుకొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంపై సర్వే చేయించామని తెలిపారు.వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి 12వేలుచొప్పున ప్రభుత్వం సాయంచేస్తున్న విషయాన్ని వివరించాలని కోరారు. బహిరంగ మలవిసర్జన వల్ల అనర్థాలను గుర్తించి మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజలను ఒప్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలరావు, ఏపీవో ప్రసాదరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఉత్సాహం..సందడిగా


హోరాహోరీగా తలపడుతున్న బుడంబో, భీంపురం బాలికల కబడ్డీ జట్లు

కిల్లోయిలో ముగిసిన గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడలు

కిల్లోయి(హరిపురం):మందస మండలంలోని కిల్లోయి ఆశ్రమపాఠశాల మైదానంలో గిరిజన సంక్షేమశాఖ, సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో రెండురోజులుగాఉత్సాహం, సందడిగా సాగిన ఆశ్రమ పాఠశాలల క్రీడలు సోమవారం ముగిశాయి. ఏటీడబ్ల్యూవో బల్ల అప్పారావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో హెచ్‌ఎం చలపతిరావు, హరికృష్ణ పకడ్బందీ ఏర్పాటుచేశారు. ఐటీడీఏ పరిధిలో మూడు క్లష్టర్లలో జరుగుతున్న ఈ పోటీలు క్లష్టర్-1లో రెండోరోజు ఐదు బాలికల పాఠశాలల విద్యార్థులు తలపడ్డారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీతోపాటు లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, 100, 400, 800 మీటర్లు రన్నింగ్, 400 రిలే పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఇక్కడి విజేతలకు ఫైనల్స్ సీతంపేట మైదానంలో ఈనెల 23, 24 తేదీల్లో జరుగుతాయని క్రీడల మేనేజర్ పీడీ ఆర్‌సీ రెడ్డి తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పీఈటీలు వి.ఆనందరావు, వి.మురళి, ధర్మారావు, ఎస్.జలేశ్వరరావు, ఎస్. శ్రీరాములు, జె.తవిటయ్య వ్యవహరించారు.

విజేతలు వీరే..

జూనియర్స్: (ప్రథమ, ద్వితీయ, తృతీయ)

●100 మీటర్ల రన్నింగ్: ఉమాదేవి(భీంపురం), ఎస్.లక్ష్మి(పట్టులోగాం), ఎస్.మల్లేశ్వరి(పట్టులోగాం) ● 400 మీటర్లు: ఎం.మాధవి(భీంపురం), బి.సంధ్యారాణి(భీంపురం), ఎస్.లక్ష్మి(పట్టులోగాం) ●లాంగ్ జంప్: ఎస్.లక్ష్మి(పట్టులోగాం), ఎస్.మల్లేశ్వరి(పట్టులోగాం) జి.దివ్య(భీంపురం) ●షాట్‌పుట్: ఎస్.విజయక్ష్మి(భరణికోట), ఎస్.పద్మ(చిన్నకోష్ఠ), ఎస్.సంతోషి(భరణికోట) ●100 రిలే: భీంపురం(ప్రథమ), చిన్నకోష్ఠ(ద్వితీయ), పట్టులోగాం(తృతీయ) ● కబడ్డీ : బుడంబో(ప్రథమ), పట్టులోగాం(ద్వితీయ) ●ఖోఖో: భరణికోట(ప్రథమ), బుడంబో(ద్వితీయ) ●వాలీబాల్:పట్టులోగాం(ప్రథమ), భరణికోట(ద్వితియ) ●బ్యాడ్మింటన్: పట్టులోగాం(ప్రథమ), చిన్నకోష్ఠ(ద్వితీయ) ●అర్చరీ: పట్టులోగాం

సీనియర్స్:(ప్రథమ, ద్వితీయ, తృతీయ)..

●400 మీటర్ల:బి.అమృత(భీంపురం), అనితాప్రధాన్(చిన్నకోష్ఠ), బి.కృప(భీంపురం) ●లాంగ్‌జంప్: బి.అమృత(భీంపురం), ఎస్.మాధవి(పట్టులోగాం),అనితా ప్రధాన్(చిన్నకోష్ఠ) ●షాట్‌పుట్: ఎస్.రాజేశ్వరి(భరణికోట),ఎస్.దేవాసి(పట్టులోగాం),రమ్యకృష్ణ (పట్టులోగాం) ●100రిలే:భీంపురం(ప్రథమ),చిన్నకోష్ఠ (ద్వితీయ),బుడంబో(తృతీయ) ● కబడ్డీ:భీంపురం (ప్రథమ),బుడంబో(ద్వితీయ) ●ఖోఖో:బుడంబో(ప్రథమ),భీంపురం(ద్వితీయ) ●వాలీబాల్:భీంపురం(ప్రథమ), పట్టులోగాం(ద్వితీయ) ●బ్యాడ్మింటన్: ప ట్టులోగాం, చిన్నకోష్ఠ(ప్రథమ), బుడంబో, భీంపురం(ద్వితీయ).

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష


మందసలో మాట్లాడుతున్న గౌతు శిరీష

మందస: మందస మాదిగవీధిలో తాగునీటి సమస్యను వారంరోజుల్లో పరిష్కరిస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష ప్రజలకు హామీఇచ్చారు. సోమవారం మాదిగవీధిని ఆమె సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వీధిలో పైపులను తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్‌డీ బి.రాజేశ్వరరావును, తాగునీటి గొట్టపుబావులు తవ్వించేందుకు స్థలాన్ని పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ మం డలాధ్యక్ష, కార్యదర్శులు దాసరి తాతారావు, రట్టిలింగ రాజు, మందస పట్టణ టీడీపీ అధ్యక్ష,కార్యదర్శులు డి.మార్కెండేయులు, కె.శ్రీనివాసరావు, మందస పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డొంకూరు తిరుపతి, ఎంపీటీసీ రేగు కృపారావు పాల్గొన్నారు.


మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఎస్ విధానం రద్దు చేయండి

వజ్రపుకొత్తూరు:సీపీఎస్ విధానం రద్దు చేయాలని సెప్టెంబర్ ఒకటో తేదీన విజయవాడలో తలపెట్టినమిలియన్ మార్చ్‌కు హాజరుకావాలని ఏపీసీపీఎస్ఈ ఏ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వజ్రపుకొత్తూరులో మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరించారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దు: తహసీల్దార్

వజ్రపుకొత్తూరు: రానున్న రెండురోజుల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని తహసీల్దార్ ఎస్.రమణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే వీఆర్‌వోలకు ఈ విషయం ఆదేశించామని, గ్రామాల్లో చాటింపు చేయాలని తెలిపారు.

మృతుల కుటుంబాలకు సీదిరి పరామర్శ

బహాడపల్లి(హరిపురం):మందస మండలంలోని బహాడపల్లిలో ఇటీవల అనారోగ్యాని గురై మృతిచెందిన పులారి అచ్చెమ్మ కుటుంబ సభ్యులను సోమవారం పలాస నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. అనం తరం సువర్ణాపురంలో తామాడ శాంతమ్మ, మూలిపాడులో తెలుకుల రాధాకృష్ణ కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులుదానయ్య, కృష్ణారావు, శ్రీకాంత్, గౌరహరిమహంతి, బదకల జానికరావు, బంగారు గంగాధర్, రవి, వినోద్, బంగారు కిరణ్‌కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.


బహాడపల్లిలో అచ్చెమ్మకుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అప్పలరాజు

బాధిత కుటుంబాలకు చంద్రన్న బీమా అండ

సువర్ణాపురం(హరిపురం):చంద్రన్న బీమా పథకం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఎంపీటీసీ కోనారి తులసీరావు తెలిపారు.మందస మండలంలోని సువర్ణాపురంలో సోమవారం చంద్రన్న బీమా పథకం కింద తామాడ హరిప్రసాద్‌కు రూ.ఐదువేలు అందజేశారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేసిన అనంతరం 25వేల చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. కాగా ఆదివారం హరిప్రసాద్ తల్లి శాంతమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో బీమా వర్తింపజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎంలలిత, సీసీ పీవీరమణ, మాజీ సర్పంచ్ సాలిన భీమారావు, బీమామిత్ర పుష్పకుమారి పాల్గొన్నారు.

భవన నిర్మాణసంఘం వితరణ

అంబుగాం(హరిపురం):మందస మండలంలోని అంబుగాంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన భవననిర్మాణ కార్మికుడు గుజ్జల లచ్చన్నకు నవోదయ ఆ కార్మిక సంఘం రూ.25 వేల నగదును వితరణగా అందజేసింది. ఈసందర్భంగా సోమవారం గ్రామంలో ప్రగతశీల కమిటీ జిల్లా అధ్యక్షుడు దేవాడ నారాయణ చేతులమీదుగా కుటుం బ సభ్యులకు నగదు పంపిణీచేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బల్ల మాధవరావు, మామిడి గోపాలు పాల్గొన్నారు.


లచ్చన్న కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న దేవాడ నారాయణ

ఆశ్రమ పాఠశాలకు ఫ్యాన్లు ....

లొత్తూరు(పలాస):పలాస మండలంలోని లొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలకు పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు సీలింగ్ ఫ్యాన్లను చార్టెడ్ అకౌంటెంట్ పీవీ సతీష్‌కుమార్ వితరణ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ కణితి విశ్వనాథం, లయన్స్ అధ్యక్షుడు వి.వెంకటరావు, కార్యదర్శి ఎన్.అప్పారావు, టి.సదాశివరావు, కె.బాలకృష్ణ, ఆర్.ఆనందరావు, కెవి.ప్రసాదరావు పాల్గొన్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన

పలాస: పలాస ప్రభుత్వోన్నత పాఠశాలలో పలాస, రెంటికోట పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు అక్టోబర్‌లో జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన కోసం సోమవారం ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 3,5,8 తరగతుల్లో భాష, గణితం, పరిసరాల విజ్ఞానంపై అభ్యసన ఫలితాలు అంచనా వేసేందుకు సర్వే నిర్దేశించింది. సమావేశంలో హెచ్ఎం రామారావు పాల్గొన్నారు.


టెలీకాన్ఫరెన్స్‌లో ఉపాధ్యాయులు

సైన్స్ ఉపాధ్యాయుడికి అభినందన

పలాస:కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గల సాంస్కృతిక వనరుల కేంద్రం (సీసీఆర్‌టీ)లో విద్యలో సమైక్యతసాధన అన్న అంశంపై రిఫ్రెషర్ కోర్సుకు హాజరైన బ్రాహ్మణతర్లా జడ్పీపాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావును ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల పది నుంచి 17వతేదీ వరకూ జరిగిన శిక్షణలో 14 రాష్ట్రాల నుంచి 46 మంది ఉపాధ్యాయులు హాజరుకాగా ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఇద్దరిలో శ్రీకాకుళం జిల్లా నుంచి శ్రీనివాసరావు ఒకరు కావడం విశేషం. మనం బోధించే సబ్జెక్టులో సంస్కృతి, సంప్రదాయాలను మిళితం చేసి జాతీయసమైక్యత పెంపొందించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా దేశరాజధానిలోగల నేషనల్‌మ్యూజియం, ఎర్రకోట, రాష్ట్రపతి భవన్, హుమాయూన్‌సమాధి వంటి ప్రాజెక్టులు రూపొందించినట్లు ఆయన తెలిపారు.శ్రీనివాసరావును డీఈవో ప్రభాకరరావుతో పాటు ఉపవిద్యాధికారి బి.సత్యనారాయణమూర్తి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మొరాయించిన తాళభద్ర రైల్వే గేటు

తాళభద్ర(పలాస):తాళభద్ర ఎల్‌సీ గేటు వైర్లు తెగడంతో గేటు మొరాయించింది. దీంతో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో తాళభద్ర, కాశీబుగ్గ వెళ్లే మార్గాల్లో పూర్తిగా వాహనాలతో నిండిపోయాయి. సాయంత్రం రైలు వెళ్లిన సమయంలో గేటు వేశారు. అనంతరం దానిని ఎత్తేక్రమంలో వైర్లు తెగిపడ్డాయి. దీంతో నర్సిపురం మీదుగా పలు వాహనాలు మళ్లించారు. రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గేటు సరిచేశారు.

గ్రీవెన్స్‌కు 11 వినతులు

వజ్రపుకొత్తూరు:స్థానిక ఎంపీడీవోకార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 11 వినతులు అందినట్లు ఎంపీడీవో తిరుమలరావు తెలిపారు. కార్యక్రమంలో ఎం ఈవో కృష్ణప్రసాద్, ఇంజనీర్ రవిబాబు, ఈవో కేవీ రమణ, ఏపీవో బి.ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నివార్డుల్లో సీసీ రోడ్లు,కాలువలు

మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు

పెసరపాడు(పలాస):మున్సిపాల్టీలో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేశామని, మూడు నెలల్లో అన్నివార్డుల్లో సిమెంట్‌రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్లు చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోగల పెసరపాడులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 65 లక్షలతో కాశీబుగ్గ పెట్రోల్‌బంకు నుంచి పలాస అన్నపూర్ణ థియేటర్ వరకూ సీసీ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిలర్ మోహనరావు, బల్ల శ్రీను, వల్లభ పాల్గొన్నారు.కాగా 20వవార్డులో కప్పొలక్ష్మీనారాయణ కుటుంబానికి చంద్రన్నబీమా అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ పి.జగన్మోహనరావు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపనచేస్తున్న చైర్మన్

సమాచారం

నేడు ఏపీ ఫైబర్‌గ్రిడ్ ప్రారంభం

పలాస:ఏపీ ఫైబర్‌గ్రిడ్ సేవలను మంగళవారం పలాస సోమేష్ కేబుల్‌టీవీ నెట్‌వర్క్‌లో ఎమ్మెల్యే గౌతు శివాజీ ప్రారంభిస్తున్నారని నిర్వాహకులు దుర్గాప్రసాద్‌పాత్రో ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష హాజరుకానున్నారని పేర్కొన్నారు.రూ.145కే కేబుల్ ప్రసారాలతోపాటు ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, దీన్ని జిల్లాలో ప్రథమంగా ఇక్కడ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జయకృష్ణాపురంలో కూడా ఫైబర్‌గ్రిడ్ సేవలు ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నారని నిర్వాహకుడు బి.కృష్ణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శతశాతం డిజిటల్ సేవలు జయకృష్ణాపురం గ్రామానికి అందించే లక్ష్యంతో ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పలాస: స్థానిక పెంటిభద్ర సబ్‌స్టేషన్‌లో మంగళవారం మరమ్మతు నిమిత్తం పెంటిభద్ర ఫీడర్ నుంచి వెళ్లే అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కాశీబుగ్గ ఏడీఈ బి.ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలో గల కోసంగిపురం, చినబాడం, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ అంతరా యం కలుగుతుందని పేర్కొన్నారు.

సినిమాలు

పలాస- కాశీబుగ్గ

హరిశంకర్	ఆనందో బ్రహ్మ
రవిశంకర్	ఫిదా
భాస్కరరామ	జయ జానకి నాయక
శ్రీవెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి
అన్నపూర్ణ	లై

మందస

మహేంద్ర	జయ జానాకి నాయక

సేవలే గుర్తింపునిస్తాయి

వజ్రపుకొత్తూరు తహసీల్దార్ రమణయ్య

తహసీల్దార్‌కార్యాలయం(వజ్రపుకొత్తూరు): ప్రజలకు సకాలంలో అందించిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని తహసీల్దార్ ఎస్.రమణయ్య తెలిపారు. స్వాతంత్ర్యవేడుకల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ అవార్డులకు ఎంపికైన తహసీల్దార్ రమణయ్య, ఎఫ్‌సీ గోదాము ఇన్‌చార్జి హరిశ్చంద్రరావును తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్‌డిపో డీలర్లు, వీఆర్‌వోలు సోమవారం ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో డీటీ బి.అప్పలస్వామి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్‌వో సంఘ ప్రతినిధులు లక్ష్మణరావు, కాళిదాసు, ఇందిరాప్రియదర్శిని, సర్వేయర్ తిరుపతిరావు, డీలర్ల సంఘ ప్రతినిధులు తవిటయ్య, బత్తుల అప్పారావు, సకలాభక్తుల ప్రభాకరరావు, కోనేరు కామేశ్వరరావు పాల్గొన్నారు.


తహసీల్దార్ రమణయ్యను సన్మానిస్తున్న రేషన్‌డిపో డీలర్లు

'ఉపాధి' బిల్లులు చెల్లించండి

ఎంపీడీవో చంద్రకుమారికి వినతి

మందస:మండలంలోని పితాతొలి పంచాయతీ పుచ్చపాడులో అధికారుల ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం కింద గ్రావెల్ రోడ్డు నిర్మించి నాలుగు నెలలు గడుస్తున్నా, బిల్లులు చెల్లించడంలేదని పితాతొలి సర్పంచ్ బాడ జగన్నాయకులతో పాటు శ్రీనివాసపురం, కొంకడాపుట్టి సర్పంచ్‌లు గౌరహరమహంతి, మాలతిమురళి గ్రీవెన్స్‌లో ఎంపీడీవో చంద్రకుమారికి వినతిపత్రం అందజేశారు. సిరిపురం పంచాయతీలో పారిశుధ్య పనులు జరగడంలేదని, చెత్త నిండిపోతోందని, వీధిబల్బులు వెలగడం లేదని గ్రామానికి చెందిన తెం బూరు కృష్ణారావు విన్నవించారు.కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ బి.రాజేశ్వరరావు, ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి, విద్యుత్ ఏఈ ఎం.సూర్యారావు, ఎంఈవో సీహెచ్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం ఎ.లలిత, వ్యవసాయాధికారి కిల్లిపోలారావు, ఉద్యానవనశాఖాధికారి వి.ఉమాభరణి పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

విద్యార్థులు మట్టి గణపతుల తయారీ

పలాస: స్థానిక మేధా గ్రామర్ స్కూల్ విద్యార్థులు సోమవారం పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతులను స్కూల్ డైరెక్టర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో తయారు చేసి ప్రదర్శనకు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణానికి అనుగుణంగా మట్టి గణపతులు తయారుచేయాలని, నీటిలో ఇవి పూర్తిగా కలడం వల్ల పర్యావరణానికి ఎటువంటి హానీ ఉండదని చెప్పారు.

విద్యార్థులు తయారుచేసిన మట్టి గణపతి విగ్రహాలు



ఒడిశా

మిస్ సౌత్ కెనడాగా ఒడిశా యువతి



మిస్ సౌత్ కెనడాగా నిలిచిన నిఖితా గంతాయత్

పర్లాకిమిడి: మిస్ సౌత్ కెనడాగా ఒడిశా రాష్ట్రానికి చెందిన యువతి నిఖితాగంతాయత్ విజేతగా నిలిచింది. ఈనెల ఐదో తేదీన రాస్‌బీటబ్రీమింగ్‌టన్‌లో జరిగిన ఓ షోలో భారత్,బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్,భూటాన్, మాల్దీవులకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆమె తాత బ్రజమోహన్‌గంతాయత్ పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన వారు. బ్రజ్ మోహన్ కుమారుడు సురేందుగంతాయత్ కెనడాలో నివాసం ఉంటున్నారు. నిఖితా చిన్నప్పుడే కెనడాలో స్థిరపడ్డారు. బ్రజ్ మోహన్ తమ్ముడు సబినానంద గంతాయత్ పర్లాకిమిడి రాజ వీధిలో నివాసమంటున్నారు. ఆమె మనువరాలు విజేతగా నిలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

కేబినెట్‌లో ధర్మేంద్రప్రదాన్?

పర్లాకిమిడి: కేంద్ర మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరిస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో కేంద్రపెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్‌కు నరేంద్రమోడి కేబినెట్‌లో కీలక స్థానం కల్పిస్తారని రాష్ట్రంలో ప్రధాన చర్చగామారింది. రాష్ట్రంలో బీజేపీ బలోపే తానికి చేపట్టిన చర్యల వల్ల ప్రధాని నరేంద్రమోడి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను ఆకర్షించడంలో సఫలీకృతులయ్యారు. ఇటీవల జరిగిన పం చాయతీ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించడంలో దర్మేంద్రప్రదాన్ ప్రత్యేక పాత్ర పోషించారని పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తారన్న ఊహాగానాలతో బీజేపీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తంచేస్తున్నాయి.

ఒడియా సాహిత్యంలో రాజగురు రచనలకు ఆదరణ

రాష్ట్ర మాజీ ముఖ్యకార్యదర్శి అజిత్ త్రిపాఠి

పర్లాకిమిడి: ఒడియా సాహిత్యంలో రాజగురు రచనలు ఆదరణ పొందాయని రాష్ట్ర మాజీ ముఖ్యకార్యదర్శి అజిత్‌త్రిపాఠి తెలిపారు. పర్లాకిమిడి ఉత్కళవికాసిని సమాజ్ పద్మశ్రీ డాక్టర్ సత్యనారాయణరాజ గురు 115వ జయంత్యుత్సవాన్నిఘనంగా నిర్వహించారు. అజిత్‌త్రిపాఠిని సన్మానించారు. అనంతరం రాజగురు జీవితచరిత్రను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.సూర్యారావు, జిల్లా శిశుసంరక్షణ సమితి కన్వీనర్ వినోద్‌చంద్రజెన్నా, బలరామ్, ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు.



మాజీ ముఖ్యకార్యదర్శికి సన్మానిస్తున్న దృశ్యం

పిడుగులపై అవగాహన

ప్రచార రథం ప్రారంభం

పర్లాకిమిడి: పిడుగులు సమయంలో ఏ విధంగా అప్రత్తంగా ఉండాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్రీడమ్‌స్వచ్ఛంద సంస్థ ప్రచార రథాన్ని రూపొందించింది. ఈ మేరకు ఆర్.ఉదయగిరి సమితి ఉపాధ్యక్షుడు నవీన్‌రైతో సోమవారం ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు త్రినాథ్‌బిసాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పిడుగులుపడే సమయంలో ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు.

పర్లాకిమిడిలో సాక్షరభారత్ పరీక్షలు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని పెద్దవీధిలో సాక్షరభారత్ పరీక్ష సోమవారం జరిగింది. 30మంది సీనియర్ సిటిజన్లకు పరీక్షలు రాశారు. జిల్లాలోని తొమ్మిది పంచాయతీల్లో గల పాఠశాలల్లో వయోజనులు ఈ పరీక్షలను రాశారు. కార్యక్రమంలో ఏడీఈవో ఖగేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ ఎస్.నాథ్ పాల్గొన్నారు.



పరీక్షలు రాస్తున్న వయోజనులు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటండి



మొక్క నాటుతున్న బీజేడీ నాయకులు

పర్లాకిమిడి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీజేడీ నాయకులు కోరారు.సోమవారంపర్లాకిమిడి శ్మశానం ఆవరణలో బీజేడీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేడీ నాయకులు చిట్టిబాబు, రాములమ్మ, ప్రభాకర్‌దాస్ పాల్గొన్నారు.

నేడు బ్యాంకుల సిబ్బంది సమ్మె

● నిలిచిపోనున్న రూ.కోట్లాది లావాదేవీలు

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట: బ్యాంకింగ్ సంస్కరణలు, ఎఫ్ఆర్‌డీఐ బిల్లు-2017ను నిరసిస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు మంగళవారం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ బ్యాంకుల సిబ్బంది సమ్మెబాటపట్టనున్నారు. జిల్లాలో ఏఐబీఈఏ, ఏఐబీఓసీ, ఎన్‌సీబీఈ, ఏఐబీఓఏ, బీఈఎఫ్ఐ, ఐఎన్‌బీఈఎఫ్, ఐఎన్‌బీఓసీ, ఎన్ఓబీడబ్ల్యు, ఎన్ఓబీఓ సంఘాలు సమ్మెలో పాల్గొననున్నాయి. జిల్లాలో 300కుపైగా బ్యాంకుశాఖలు ఒక్కరోజు మూసివేయడం వల్ల సుమారు 18లక్షల మంది వరకు ఖాతాదారులు ఇబ్బందులకు గురికానున్నారు. అంతే కాకుండా కోట్లాది రూపాయల లావాదేవీలు నిలిచిపోనున్నాయి. ఏటీఎంలు అధిక సంఖ్యలో ఉన్నా వివిధ కారణాల వల్ల పనిచేయకపోవడంతో నగదుకు అవస్థలు తప్పవని పలువురు చెబుతున్నారు. ఖరీఫ్ పనులు ముమ్మరం జరుగుతున్న సమయంలో పంట రుణాల కోసం బ్యాంకుల చుట్టూ రైతులు తిరుగుతున్న విష యం విదితమే. ఈ నేపథ్యంలో బ్యాంకుల సమ్మె వల్ల రైతులతోపాటు వ్యాపారులు, సామాన్యులు ఇబ్బందిపడే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశామని, ఏటీఎం సెంటర్లలో నగదు నిల్వచేశామని బ్యాంకు అధికారులు తెలిపారు.

సమ్మెలో పాల్గొనాలి :

ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించేవిధానాన్ని అడ్డుకునేందుకు నిర్వహి స్తున్న బ్యాంకుల సమ్మెలో ఉద్యోగులంతా పాల్గొవాలని యూఎఫ్‌బీయూ కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ, ఏఐబీఈఏ ప్రధానకార్యదర్శి బి శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం సూర్యమహల్ కూడలిలో గల వివేకానంద విగ్రహం వద్ద మానవహారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బ్యాంకులకు వరుస సెలవులు

బ్యాంకు ఖాతాదారులకు మరోసారి ఇక్కట్లు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ఈవారంలో కేవలం మూడు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి.ఈనెలలో 25 నుంచి 27వరకు వరుసగా మూడురోజులు సెలవులు కాగా, ఈనెల మంగళవారం ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు.25న వినాయక చవితి, 26న నాలుగో శనివారం, 27న ఆదివారం కావడంతో బ్యాంకలు మూతపడను న్నాయి.ఈనెల 12 నుంచి 15 వరకు వరుసగా నాలుగు రోజులు వివిధ కారణాల వల్ల బ్యాంకులకు సెలవులు వచ్చిన విషయం విదితమే.

మాజీ సైనికులకు పథకాలపై అవగాహన

శ్రీకాకుళం సిటీ: మాజీ సైనికోద్యోగులు ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకోవాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం సూచించారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో మాజీ సైనికులు, వితంతు మాజీ సైనికులు, వారి పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. రక్షణశాఖ మాజీ సైనికుల పిల్లలకు అందించే ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ (ఒకటో తరగతినుంచి డిగ్రీ వరకు), ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఆడపిల్లలకు రూ. 27వేలు, పురుషులకు 24వేలు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి పథకాల మంజూరుకోసం రూ.ఐదు లక్షలువరకు పావలావడ్డీ కింద బ్యాంకులు అందించే రుణాలద్వారా లబ్ధి పొందాలని సత్యానందం సూచించారు.

'భాషా పండితులను నియమించండి'

శ్రీకాకుళం సిటీ: ప్రాథమికస్థాయిలో తెలుగు, హిందీ, భాషాపండిత పోస్టులను నియమించాలని, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని భాషాపండిత పోస్టులను పాఠశాల సహాయకులుగా (స్కూల్ అసిస్టెంట్లు) ఉన్నతీకరించాలని రాష్ట్రీయపండిత పరిషత్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు గండేపల్లి మల్లేసు, కనుమెట్ట పద్మావతి డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని పండిత పరిషత్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బీఏ (ఓఎల్), బీఏలో స్పెషల్ తెలుగు అర్హత కలిగి తప్పనిసరిగా తెలుగు పండితశిక్షణ పొందిఉండాలని తెలిపారు. హిందీ విషయంలో డిగ్రీలో స్పెషల్ హిందీ, విద్వాన్‌గానీ అర్హతకలిగి హిందీలో శిక్షక్, ప్రశిక్షక్ శిక్షణను పొందిఉండాలని చెప్పారు. ఈ అర్హతలన్నీకూడా ఏకీకృత సర్వీస్‌రూల్స్‌లో పొందుపరచాలని సూచించారు.

వంశధార ప్రధాన కాలువ డివిజన్ ఈఈ బదిలీ

● డీఈఈ శేఖర్‌రావుకు అదనపు బాధ్యతలు

శ్రీకాకుళం సిటీ: వంశధార ప్రధానకాలువ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) బి.శ్రీనాథ్ బదిలీ అయ్యారు. తనను బదిలీ చేయాలని చేసుకున్న అభ్యర్థన మేరకు జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో టెక్కలి జలవనరులశాఖ స్పెషల్ ఇన్వస్టిగేషన్ డివిజన్‌లో ఉపకార్యనిర్వాహక ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి.శేఖర్‌రావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్ఐపై విచారణకు అనుమతి

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి: బూర్జ స్టేషన్‌లో గత ఏడాది లంచం తీసుకొని పట్టుబడిన ఎస్ఐను విచారించేందుకుప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి అనురాధ పేరుతో ఉత్తర్వులు సోమవారం వెలువడ్డాయి.బూర్జ ఎస్ఐ కేలంగి రవికిషోర్ గత ఏడాది అక్టోబర్‌లో సీపాన ఉమామహేశ్వరరావు నుంచి ఓ కేసు విషయంలో అరెస్ట్‌చేయకుండా ఉండేందుకు లంచం డిమాండ్‌చేశారు. దీంతో ఏసీబీని ఆయన ఆశ్రయించగా, ఎస్సై సూచన మేరకు రూ.10వేలు లంచాన్ని కానిస్టేబుల్ త్రినాథరావుకు ఉమామహేశ్వరరావు అందించారు. ఆ సమయంలో ఏసీబీ దాడిచేసి కానిస్టేబుల్‌నుంచి నగదు స్వాధీనం చేసుకుంది.ఎస్సై ఆదేశాల మేరకే తాను లంచం అందుకున్నానని కానిస్టేబుల్ వాంగ్మూలమిచ్చారు. ఈ మేరకు ఎస్సై, కానిస్టేబుల్‌పై కేసునమోదుచేశారు. ఈసంఘటనలో ఎస్ఐను విచారించేందుకు ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరుచేయాలని ఏసీబీ ప్రభుత్వానికి లేఖరాసింది. దీంతో ప్రాసిక్యూషన్‌కు అనుమతిఇస్తూ జీవో 139ను ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు విడుదలచేశారు.

గురుకులంలో ప్రవేశానికి ఇంటర్వ్యూలు

గార: వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లిలో మత్స్యకారుల పిల్లలకోసం ఏర్పాటుచేసిన బీసీ బాలుర గురుకులంలో ఐదు, ఆరు తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులకు సోమవారం గార ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అక్కుపల్లి గురుకులంలో ఐదు, ఆరు తరగతుల్లో 80 సీట్లు ఉండగా ఇంటర్వ్యూలకు 40 మంది హాజరయ్యారని గురుకులం ప్రిన్సిపాల్, కన్వీనర్ యు.గణపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కుపల్లి గురుకులం ప్రిన్సిపాల్ జి.రామినాయుడు, ఉపాధ్యాయులు ఎం.నర్సింహులు, బి.ప్రకాష్, సి.ఆదినారాయణరావు పాల్గొన్నారు.

దుస్తులు ఉతుకుతూ...

చెరువులో పడి మహిళ మృతి

పలాస: కాశీబుగ్గ కీర్తిరాయి చెరువులో దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి ఓ రజక మహిళ సోమవారం ఉదయం మృతి చెందింది. చెరువు సమీపంలో నివాసముంటున్న రాజాం పార్వతి(47) బట్టలు ఉతుకుతుండగా మూర్ఛరావడంతో నీటిలో పడిపోయింది. ఆమె ఎంతకీ ఇంటికి రాకపోయే సరికి చుట్టుపక్కల వారు చెరువు వద్దకు వెళ్లగా నీటిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు.పార్వతికి భర్త లక్ష్మయ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రాజాం పార్వతి మృతదేహం

శ్రీకాకుళం నగర ఉద్యోగులకు శుభవార్త

● 20 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేస్తూ ప్రభుత్వ నిర్ణయం
● హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
● ఉద్యోగుల్లో ఆనందం

(శ్రీకాకుళం సిటీ)

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జిల్లా కేంద్రానికి 10 కిలో మీటర్ల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. 20 శాతం హెచ్‌ఆర్‌ఏ (ఇంటి అద్దె భత్యం) మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సోమవారం సంతకం చేశారు. శ్రీకాకుళంతో పాటు, చిత్తూరు, మచిలీపట్నం (కృష్ణ జిల్లా ప్రధాన కేంద్రం)లో నివసిస్తున్న ఉద్యోగులకు ఈ హెచ్‌ఆర్‌ఏను వర్తింపచేశారు. ఇక కొద్దిరోజుల్లో క్యాబినెట్ ఆమోదంతో పూర్తిస్థాయిలో జీవో విడుదల కానుంది. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కేంద్రం లో పనిచేస్తున్న ఉద్యోగులకు 14.5 శాతం హెచ్‌ఆర్‌ఏ మాత్రమే ఉండేది. పెంచిన హెచ్‌ఆర్‌ఏతో జిల్లా కేంద్రంతో పాటు పది కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న దాదాపు 10,000 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. వాస్తవానికి నిబంధనల ప్రకారం జిల్లా కేంద్రాల్లో 2లక్షల జనాభా దాటిన నగరాలకు మాత్రమే 20 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తిస్తుంది. కానీ శ్రీకాకుళంలో ప్రస్తుతం లక్షా 34వేల జనాభా మాత్రమే ఉంది. అయినా ముఖ్యమంత్రి తన విశేష అధికారాలతో ప్రత్యేక కేసుగా పరిగణించి ఈనిర్ణయం తీసుకున్నారు.దీంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



మాట నిలబెట్టుకున్న సీఎం

శ్రీకాకుళం సమీపంలోని చిలకపాలెంలో జరిగిన ఎన్జీవో 19వ రాష్ట్ర మహాసభలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ బాబు, రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు రెండు సమస్యలు పరిష్కరించాలని కోరారు.మొదటిది చైల్డ్‌కేర్ లీవ్‌ను 60 రోజులు ఇవ్వాలని, రెండోది జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ ప్రకటించాలని కోరారు. ఈ రెండు హామీలను నెరవేర్చాలని పలుమార్లు సీఎంను, ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సీఎం సంబంధిత ఫైల్‌పై సంతకం చేశారు.సాంకేతిక సమస్యలు సైతం పక్కనపెట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు.

సమున్నత నిర్ణయం...

జిల్లాకేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 20శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడంపై ఏపీ ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు హర్షం వ్యక్తంచేశారు. ఇది సమున్నత నిర్ణయంగా అభివర్ణించారు. రెండు లక్షల జనాభా నిబంధన, సాంకేతిక సమస్యలు పక్కనపెట్టి హెచ్‌ఆర్‌ఏ పెంపుచేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, జిల్లాకార్యదర్శి చల్లా శ్రీనివాసరావు సీఎం తానిచ్చిన హామీని నిలబెట్టుకోవడం సంతోషమన్నారు. దీనికి కృషి చేసిన మంత్రులు అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు, ఎమ్మెల్యే లక్ష్మీదేవికి కృతజ్ఞతలు చెప్పారు.

ఆధునిక పద్ధతులు వినియోగించండి

నరసన్నపేట: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఆత్మ పీడీ డి.ప్రమీల అన్నారు. సోమవారం జమ్ము జంక్షన్ వద్ద ఆత్మ సౌజన్యంతో డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆత్మసౌజన్యంతో వరి, వేరుశెనగ, మొక్కజొన్న పంటల సాగులో నూతన విధానం అవలంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో వడ్డాది శ్రీనివాసరావు, సెంచురీయన్ యూనివర్సిటీ వ్యవసాయశాఖ విద్యార్థులు, ఏఈవోలు రాజ్యలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.



రైతుకు జింకు అందిస్తున్న ఆత్మ పీడీ ప్రమీల

398 వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు..

జలుమూరు: జిల్లాలో 398 వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తామని ఆత్మ పీడీ డి.ప్రమీల తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ మందులు ఉచితంగా అంస్తామన్నారు. దీనికోసం రూ.29.08 లక్షలు కేటాయించినట్టు ఆమె తెలిపారు. ఈ క్షేత్రాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల, జిల్లాస్థాయి వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు అందిస్తారన్నారు. అధునాతన వ్యవసాయంపై రైతులకు త్వరలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

●వెంకటాపురం రెవెన్యూ పరిధిలో రైతు మజ్జి పరశురాంకు చెందిన శ్రీవరిసాగు ప్రదర్శన క్షేత్రాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి డి.విజయభాస్కరరావు, ఎంపీఈవో అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కు 15 వినతులు

కలెక్టరేట్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 15 వినతులు ఫోన్ వచ్చాయి. డీఆర్‌డీఏ పీడీ కిషోర్‌కుమార్ ఫోన్‌లో వినతులు స్వీకరించారు. ● పాతపట్నం మండలం తెంబూరు నుంచి ఎస్.నాగేశ్వరరావు ఫోన్ చేస్తూ.. 2016-17 సంవత్సరానికి సంబంధించి ఎస్‌సీ, ఎస్టీ పోస్టుల మెరిట్ లిస్టు పెట్టాలని కోరారు. ● హిరమండలం రెవెన్యూ పరిధిలోని వీఆర్‌వో ఎన్.ఆనందరావుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎల్.శ్రీకృష్ణ ఫిర్యాదు చేశాడు. ● 104 అత్యవరస సేవల సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని భామిని మండలం బాలేరు నుంచి ఎం.గోవిందు కోరాడు. ● నౌపడ సర్వోదయ డైట్ కాలేజీలో చదువుతున్న తన కుమార్తెకు గత రెండేళ్లుగా ఉపకారవేతనం రావడం లేదని కాశీబుగ్గ శాంతినగర్ కాలనీకి చెందిన యు.శ్రీనివాసరావు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ● 34 పంచాయితీలలో నర్సరీలు పెడతామని చెప్పి అటవీశాఖ అధికారులు నిధులు దుర్వినియోగం చేశారని సంతబొమ్మాళి మండలం మేఘవరానికి చెందిన ఎస్.ధనరాజ్ ఫిర్యాదు చేశాడు. ● రక్షిత పథకం ట్యాంక్‌ను శుభ్రం చేయాలని జలుమూరుకు చెందిన నాయుడు రాజశేఖర్ కోరాడు. ●తప్పుడు సర్టిఫికెట్‌తో ఎం.మోహనరావు అనే వ్యక్తి ఎస్సీ కార్పొరేషన్ రుణం తీసుకున్నాడని వంగర మండలం ఎంఎస్ఆర్ పురం నుంచి పలువురు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ● తమ గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేపట్టాలని బూర్జ మండలం సింగన్నపాలెం నుంచి టి.భుజంగరావు, మరమ్మతులకు గురైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వైద్యశాలలను బాగు చేయాలని మందస మండలం హరిపురానికి చెందిన జి.మురళీకృష్ణ ఫోన్‌లో కోరారు. ● ఎంపీపీ స్కూల్‌కు ప్రహరీ నిర్మించాలని ఎచ్చెర్ల మండలం ముద్దాడపేటకు నుండి ఎం.త్రినాధరావు కోరాడు. ● పెద్దపేట, బూర్జ, కొల్లివలసలో నారాయణపురం రోడ్డు కల్వర్ట్‌ను కప్పివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని బూర్జ జడ్పీటీసీ సభ్యుడు ఎ.రామకృష్ణ ఫిర్యాదు చేశాడు. ● మెళియాపుట్టి మండలం చాపర నుంచి జె.సరోజిని ఫోన్‌చేసి ఏడు నెలలుగా ఉపాధి వేతనం అందలేదని ఫిర్యాదు చేసింది. ● తమ గ్రామానికి ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని పోలాకి మండలం అంబీరుపేటకు చెందిన డి.ప్రదీప్, తమ గ్రామంలో డీజే సౌండ్ పొల్యూషన్‌తో ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు చేపట్టాలని కొత్తూరు మండలం బలద నుంచి ఐ.ప్రభాకరరావు కోరాడు. కార్యక్రమంలో డ్వామా పీడీ హెచ్.కూర్మారావు, జడ్పీ సీఈవో నగేష్, అదనపు డీఎంహెచ్‌వో వై.వెంకటేశ్వరరావు, ఎస్సీకార్పొరేషన్ అధికారి ఆదిత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఫోన్‌లో ఫిర్యాదులు తీసుకుంటున్న దృశ్యం

'చెరువులను కబ్జా చేస్తున్నారు'

● ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు ● గ్రీవెన్స్‌లో అజ్జరాం గ్రామస్థుల ఫిర్యాదు ● వినతులు స్వీకరించిన కలెక్టర్ ధనుంజయరెడ్డి

(కలెక్టరేట్)

తమ గ్రామంలో పది చెరువులకు చెందిన వందల ఎకరాలను కొందరు కబ్జా చేశారని ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో విభాగంలో ఫిర్యాదు చేశారు. చెరువులను ఆక్రమించుకోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనులు చేసేందుకు కూలీలు వెళితే ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని, వెంటనే వారిపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.ధనుంజయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ● నగరపాలక సంస్థ పరిధిలోని మహాలక్ష్మీ నగర్ కాలనీలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారని మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు గ్రీవెన్స్ వద్ద ఆందోళన చేపట్టారు. కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి తన తండ్రి పేరుపై ఉన్న డీ పట్టాను విక్రయిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రహదారికి కేటాయించిన స్థలం కూడా విక్రయిస్తున్నాడని, అలాగే పేదలకు ఇచ్చిన 90 సెంట్ల డీ పట్టా భూమిని ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశాడన్నారు. వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ●సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కేంద్రం ప్రతిపాదించిన వేతనాలను అందించడం లేదని సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు ఫిర్యాదు చేశాడు. కేంద్రం ప్రకటించిన వేతనాలను అమలు చేయాలని కోరాడు. ● తనపేరుపై ఉన్న భూమి సర్వే నెంబర్‌ను మార్చి ఇతరుల పేరిట అడంగళ్, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారని కంచిలి మండలం గొల్లకంచిలికి చెందిన కొల్లి తులసమ్మ ఫిర్యాదు చేసింది. ● బూర్జమండలం కొల్లివలస గురుకుల పాఠశాలలో చదువుతున్న కోటబొమ్మాళి మండలం పాకివలసకు చెందిన అజయ్‌కుమార్‌ను కొట్టి గాయపరిచిన సైన్స్ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.చలపతిరావు విద్యార్థులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ● రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమానికి సంబంధించి ఉద్యోగులుగా ఎంపిక చేసి ఇంత వరకు పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వలేదని కె.కల్యాణి, కె.అశోక్, బి.లలిత, డి.అనిత, తదితరులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా మండలానికి ఇద్దరు డాక్టర్లు, ఫార్మసిస్టు, ఏఎన్ఎంతో కూడిన బృందాన్ని జిల్లాలోని 38 మండలాలకు నోటిఫికేషన్ ద్వారా ఎంపిక చేసి ఇంత వరకు పోస్టింగ్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ●సంతకవిటి మండలం గుల్లసీతారాంపురం ఓటరు జాబితాలో 80 పేర్లు బోగస్‌గా ఉన్నాయని, వాటిని తొలగించాలని గ్రామానికి చెందిన కె.తవుడు, ఎల్.తవిటినాయుడు కోరారు. ఇదే మండలం జీఎస్‌పురంలో పలువురు అనర్హులు పింఛన్లు పొందుతున్నారని జె.త్రినాథ్, ఎం.చిన్నారావు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో బి.నగేష్, డీఆర్‌డీఏ పీడీ జీసీ కిషోర్ కుమార్, డ్వామా పీడీ హెచ్.కూర్మారావు, హైసింగ్ జిల్లా మేనేజర్ వి.నర్సింగరావు, వ్యవసాయశాఖ జేడీ జి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ధనుంజయరెడ్డి, ఇతర అధికారులు

'పురసేవ' సమస్యల పరిష్కారంలో

పాలకొండ ప్రథమం

రాజాంరూరల్: మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో పురసేవ యాప్ ద్వారా సమస్యలు సేకరించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో జిల్లాలో పాలకొండ నగరపంచాయతీ ప్రథమస్థానంలో నిలిచింది. ఇంతరకు 391 ఫిర్యాదులు అందగా సోమవారం నాటికి వాటన్నింటినీ పరిష్కరించి మొదటి స్థానం పొందింది. ఆమదాలవలస మున్సిపాలిటీలో 770 ఫిర్యాదులకు 768 పరిష్కారమై రెండోస్థానంలో నిలిచింది. రాజాం నగరపంచాయతీలో 421 సమస్యలకుగాను 418, శ్రీకాకుళం నగరపాలక సంస్థలో 2,060 సమస్యలకు 1971, పలాస మున్సిపాలిటీలో 412 ఫిర్యాదులకు 375, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 314 ఫిర్యాదులకు గాను 302 ఫిర్యాదులు పరిష్కారం మయ్యాయి.



పురసేవ యాప్‌లో ఫిర్యాదులు నమోదు చేస్తున్న దృశ్యం

ఎస్పీ గ్రీవెన్స్‌కు 10 వినతులు

అరసవల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పది వినతులు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ షరీనాబేగం వినతులు స్వీకరించారు. సివిల్ తగాదాలపై ఐదు, కుటుంబ తగాదాలపై రెండు, ఇతర సమస్యలపై మూడు వినతులు అందాయి. వీటిని పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రానికి పాత ఫిర్యాదులు 17, కొత్తవి 8 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఆరింటిని రాజీ చేశారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారుడు ఆఫీసునాయుడు, పి.రాజేశ్వరావు, విజయకుమారి, టి.వరప్రసాద్, నిర్మల, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ షరీనాబేగం

సెల్‌లో వివరాలను తెలుసుకుంటున్న అన్నదాత



సాగుకు... సాంకేతికత తోడు!

● రైతులకు యాప్‌ల ద్వారా సేవలు ● నేరుగా ప్రభుత్వ సాయానికి అవకాశం ● కిసాన్, ఫార్మర్ కాల్ సెంటర్ల ద్వారా సమాచారం

నరసన్నపేట : ఆరుగాలం శ్రమించే అన్నదాత కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం గగనమవుతోంది... పెట్టిన పెట్టుబడులు రాక రైతన్న సతమతమవుతున్నాడు.. ఈ సమస్యల సుడిగుండం నుంచి లాభాల బాట పట్టించాలన్న ఆలోచనతో వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతన సాంకేతికతతో ముందుకువచ్చారు. ప్రత్యేక వెబ్‌సైట్లు, మొబైల్ ఫోన్ల ద్వారా ఉచిత కాల్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. కిసాన్ సువిధ, కృషి విజ్ఞాన్ పోర్టల్ వంటి యాప్‌ల ఆవిష్కరణతో సాగుకు సాంకేతికత జోడించారు. దీని ద్వారా సేద్యానికి సంబంధించిన ప్రతి విషయాన్ని రైతు నేరుగా తెలుసుకునేందుకు వీలుంటుంది. ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలు తదితర విషయాలు కూడా ఇట్టే తెలుసుకోవచ్చు. దీంతో పాటు కిసాన్ పోర్టల్‌లో సెల్ నెంబర్ నమోదు చేస్తే.. నేరుగా మొబైల్‌కే సంక్లిప్త సమాచారం వస్తుంది. తద్వారా తమ ప్రాంతంలోని వాతావరణం, వ్యవసాయశాఖ అందించే రాయితీలు తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

అన్నీ యాప్‌ల్లోనే..

వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల ఫోన్ నెంబర్లు ఈ యాప్‌ల్లో ఉంటాయి. రైతులు నేరుగా వారితో మాట్లాడే అవకాశం ఉంటుంది. వాతావరణ సూచనలు, చేపల పెంపకం, ఉద్యాన పంటలు తదితర వాటిపై సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. కాగా ఇందులోనే యాజమాన్య పద్ధతులను కూడా క్రోడీకరించారు. వరి, మొక్కజొన్న, అరటి, పెసర, మినప, కూరగాయలు వంటి వాటిపై యాజమాన్య పద్ధతులు, విత్తన ఎంపిక నుంచి ఫలసాయం చేతికొచ్చే వరకు ఉన్న పరిస్థితులు తెలుస్తాయి. ఆధునీక యంత్రాల వివరాలు ఇందులో పొందుపరిచారు.



ఒక్క కాల్‌తో... సందేహాలు నివృత్తి..

రైతులకు విస్తృత సేవలందించేందుకు, వారి సందేహాలను వెనువెంటనే వాడుక భాసలో సమాచారం అందించేందుకు కాల్‌సెంటర్లను ఏర్పాటు చేశారు. 1800180 1551 నెంబరుకు ఒక్క ఫోన్ చేస్తే చాలు సాగులో ఉన్న సమస్యల పై సమాధానం తెలుసుకోవచ్చు. రైతులకు నేరుగా సాంకేతిక సలహాలు అందించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖ నుంచి ఇద్దరు అధికారులు ఉంటారు. వీరి సూచనలు పొందేందుకు 1100, 1800425, 1110 నెంబర్లకు ఫోన్ చేస్తే యాజమాన్య పద్ధతులు తెలుసుకోవచ్చు.

కిసాన్ సువిధ యాప్ వినియోగం ఇలా..

ఈ యాప్ కావాలనుకుంటే ఆండ్రాయిడ్ ఫోన్ తప్పనిసరి. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలంటే మొబైల్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి కిసాన్ సువిధ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం సెల్‌ఫోన్ నెంబరు, ఈ మెయిల్ అడ్రస్ నమోదు చేయాలి. వివరాలు పొందుపరచగానే మొత్తం ఐదు అంశాలు తెరమీద ప్రత్యక్ష్యమవుతాయి. కాకపోతే ఇన్‌స్టాల్ చేసేటప్పుడు తప్పనిసరిగా ఇంటర్‌నెట్ ఉండాలి.

పొలం గణాంకాలు ఇలా..

ఈ యాప్‌లో ఏ రకమైన పంట ఎంత విస్తీర్ణంలో వేయాలి... మొక్కమొక్కకు ఎంత దూరం ఉండాలి... ఎరువులు వినియోగం, విత్తనం నాటే విధానం తదితర సమచారం వివరంగా ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలో ఉన్న ఏరువాక, కృషి విజ్ఞాన్, వరి పరిశోధనా కేంద్రాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. కాగా పంటలకు సంబంధించిన తెగుళ్ల నివారణ, అభ్యుదయ రైతుల విజయాలతో కూడిన వీడియోలు కనిపిస్తాయి. దీంతో సాగులో మరింత ముందుకు సాగేందుకు వీలుంటుంది.

రైతులకు నేరుగా సలహాలు



కిసాన్ కాల్‌సెంటర్, కిసాన్ సువిధ యాప్ ద్వారా రైతులు అనేక విషయాలపై నేరుగా సలహాలను పొందవచ్చు. విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ యాప్‌లో దొరుకుతుంది. దీని వల్ల రైతులకు సాగు మరింత తేలికకానుంది. అలాగే టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి వ్యవసాయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చు.

- వడ్డాది శ్రీనివాసరావు, ఏవో, నరసన్నపేట

(హిరమండలం)

వినాయక చవితి సమీపిస్తోంది.... వాడవాడలా ఏకదంతుని విగ్రహాల ఏర్పాటుకు చిన్నల నుంచి పెద్దల వరకు సిద్ధమవుతున్నారు. ఖర్చులకు వెనుకాడక విగ్రహాలు ప్రతిష్ఠించాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు.. సొంత ఖర్చులతో కొందరు... అందరి భాగసామ్యంతో మరి కొందరు ఉత్సవాల నిర్వహణకు పోటీపడుతున్నారు. వీధుల్లో పండగ వాతావరణం నెలకొల్పేందుకు ఉత్సాహం చూపుతున్నారు.. ఈ సంతోషంమే ఇతరులకు ఇబ్బంది తెచ్చిపెట్టనుంది. సమస్యలు తలెత్తకుండా విగ్రహం ఏర్పాటులో కనీస నియమ నిబంధనలు పాటించాలి. అప్పుడే పండగ ప్రశాంత వాతావరణంలో జరగడమే కాకుండా ఎవరూ ఇబ్బందులకు గురికారు. విగ్రహం ఏర్పాటులో ఎటువంటి నిబంధనలు పాట్టించాలో ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.



మండపాలు భళా...

● భక్తిభావం ప్రధానం

ఉత్సవాల పేరుతో అనేక మండపాల వద్ద అభ్యంతరకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అసభ్యకరమైన నృత్యాలు చేయిస్తుంటారు. చాలా వరకు దీనిని వ్యతిరేకిస్తుంటారు. ఉత్సవాలు నిర్వహించినన్ని రోజులు అధ్యాత్మికత ఉట్టిపడేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలి.

● మండపాలు ఏర్పాటు

మండపాలను ఎక్కువ శాతం వీధుల్లో ఏర్పాటు చేస్తుంటారు. దేవుడికి సంబంధించిన విషయం కావటంతో వాహనదారులు, పోలీసులు, కాలనీ వాసులు మండపాలను దారి మధ్యలో ఏర్పాటు చేసినా అభ్యందరం చెప్పరు. భారీ వాహనాలకు కాకపోయినా.. ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా తగిన స్థలం ఉంచాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, అవసరమైన వెలుతురు ఉండేలా నిర్వాహకులు చూసుకోవాలి. దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూ పద్ధతి ఏర్పాటు చేయాలి.

● అప్రమత్తతే.. శ్రీరామరక్ష

చిన్నపాటి మాటలకే ఉత్సవాల వద్ద ఘర్షనలు వస్తుంటాయి. సాయంత్రం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వందల సంఖ్యలో బారులు తీరుతుంటారు. ఆ సమయంలో కొందరు అనావసరపు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తారు. ఇలాంటివారిపై నిర్వాహకులు ఒక కన్నేసి ఉంచాలి. ఎవరిపైనన్నా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

● విద్యుత్‌తో జాగ్రత్త

మండలపాల వద్ద భారీస్థాయిలో విద్యుదీపాలంకరణలు చేస్తుంటారు. దీని కోసం చాలా వరకు అనుమతులు లేకుండానే విద్యుత్ కనెక్షన్లు తీయడం, ప్రమాదాల బారిన పడడం పరిపాటిగా మారుతోంది. ఇలాంటివి జగరకుండా చూసుకోవాలి. కరెంట్ తీగల కింద మండపాలు లేకుండా చూసుకోవాలి. విద్యుత్ దీపాలంకరణల వద్దకు చిన్నారులు వెళ్లకుండా చూడాలి.

● విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
● బలవంతపు చందాల వసూళ్లు వద్దు
● పండగ రోజున శబ్దం పెరిగినా చర్యలు

షరతులు ఇలా..

ఉత్సవాలకు సిద్ధమవుతున్న మండపం



● బలవంతం వద్దు..

వినాయక విగ్రహాల ఏర్పాటుకు బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదు. భక్తిభావంతో వారు ఇచ్చినంత తీసుకోవటం మంచిది. డబ్బులు ఇవ్వని వారిని చులకనగా మాట్లాడటం, భయపెట్టడం, వేధించడం చేయకూడదు. నిర్వాహకులు వృధా వ్యయాన్ని నియంత్రించి ఉత్సవాలను చక్కగా నిర్వహించుకోవచ్చు.

● అధిక ధ్వని మంచిది కాదు...

వినాయక మండపాల వద్ద అధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఉండాలి. భక్తిగీతాలు వినిపించాలి. సినీ గీతాలు వేయకుండా నిర్వాహకులు చూసుకోవాలి. స్పీకర్ల నుంచి వచ్చే శబ్ధాలు చుట్టుపక్కల వారిని ఇబ్బందికి గురిచేయకుండా చూసుకోవాలి. రాత్రి 10గంటల వరకే స్పీకర్లకు అనుమతి ఉంటుంది. దీని వల్ల చిన్నారులకు, వృద్ధులకు నిద్ర భంగం ఉండదు. నిమజ్జనం సమయంలో ఏర్పాటు చేస్తున్న డీజేలకు పోలీసుల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి.

● అగ్ని ప్రమాదాల నివారణకు..

వినాయక ప్రతిమల ఎదుట ఉంచే దీపాలపై నిరంతరం నిఘా ఉంచాలి. మండపాల సమీపంలో బాణాసంచా కాల్చకూడదు. పెట్రోల్, కిరోసిన్, డీజల్, గ్యాస్ సిలిండర్లు లాంటి పేలుడు పదార్థాలు దగ్గరలో ఉండకూడదు. మండపలా వద్ద 24 గంటలూ ఒకరు ఉండేలా చర్యలు తీసుకోవాలి. చిన్న పిల్లలను ఎక్కువ సమయం మండలపాల వద్ద ఉంచకూడదు. ఇసుక, నీరుతోపాటు అగ్నినిరోదక పరికరాలను సిద్ధం చేసుకోవాలి. అగ్నిమాపక, విద్యుత్, పోలీసుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.

● ఉత్సవ సమితులకు సూచనలు

గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సూచనలను ప్రతి స్థానిక సమితి కచ్చితంగా పాటించాలి. గణనాథుడుని భగవంతుని ప్రతిరూపంగానే భావించాలి. ఆ రూపంలోనే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి. సినిమాల్లోని పాత్రలు, రూపాలు వచ్చేలా విభిన్న రకాల ప్రతిమలు ఏర్పాటు చేయకూడదు. పోటీ పడి భారీ గణనాథులను కాకుండా 10 అడుగుల లోపు విగహాలను ఏర్పాటు చేయడం శ్రేయస్కరం. రోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 8 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించాలి.

నవరాత్రులకు 'నవ' నిబంధనలు

● అనుమతులు తప్పనిసరి ● ఎస్పీ త్రివిక్రమ వర్మ

శ్రీకాకుళం క్రైం : ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు ఎస్పీ త్రివిక్రమవర్మ తెలిపారు. ఆయన కార్యాలయంలో విలేఖర్లతో సోమవారం మాట్లాడారు. విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీలు ఖచ్చితంగా వారి పరిధిలోని డీఎస్పీ నుంచి ఈనెల 25లోగా అనుమతి తీసుకోవాలన్నారు. పల్లెల నుంచి కార్పొరేషన్ వరకు ఏర్పాటు చేస్తున్న ప్రతి మండపానికి ఖచ్చితంగా అనుమతి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నవ నిబంధనలు ఇవే.. ● ఉత్సవ కమిటీ వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా పరిధిలోని పోలీస్, పంచాయతీ, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అనుమతి పొందాలి. ● విగ్రహాలు నిలిపే ప్రదేశం, కమిటీ సభ్యుల వివరాలు, ఫోన్ నెంబర్లతో పాటు వివరాలు పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలి. ● మైక్‌సెట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు డీఎస్పీ నుంచి అనుమతి పొందాలి. ● నిమజ్జనం చేసే సమయం, వెళ్లేదారి, ప్రదేశం, వినియోగించే వాహనం వివరాలు తెలియజేయాలి. ● నిమజ్జనానికి ఉపయోగించే వాహనానికి ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. ● లౌడ్ స్పీకర్ల ధ్వని 10 డిసిబుల్స్‌కు మించకూడదు, అనుమతించిన సమయంలోనే మైక్‌సెట్ వినియోగించాలి. అసభ్యకర పాటలు, కార్యక్రమాలు నిర్వహించకూడదు. ● వివాదస్పద స్థలాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కగలకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి. ● అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. ● ఊరేగింపులో బాణాసంచా, సామగ్రి, కర్రలు, ఆయుదాలు, మద్యం సేవించడం లాంటి చేయకుండా కమిటీ సభ్యులే చూసుకోవాలి.



సాంకేతిక లోపాలవల్ల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో బోసిపోయిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

ఆదాయానికి గండి

● నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు ● వారం రోజులుగా ఇదే తంతు ● సాంకేతిక లోపాలే కారణం ● క్రయవిక్రయదారుల అవస్థలు

పాతపట్నం: స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వారం రోజులుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ స్థాయిలో ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ నెల 16న సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏర్పడిన సాంకేతిక లోపమే ఇందుకు కారణం. ఏటీ స్వాన్, బీఎస్ఎన్ఎల్ నెట్ సిగ్నల్స్‌లో అంతరాయం కలగడంతో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. గత వారం రోజులుగా క్రయవిక్రయదారులు ప్రతిరోజు కార్యాలయానికి వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. నకళ్లు, ఈసీలకు, మార్కెట్ వాల్యూ నిర్ధారణ పత్రాలు, రిజిస్ట్రేన్ వంటి దినసరి కార్యక్రమాలు ఆగిపోయాయి. బ్యాంకులకు దరఖాస్తు చేసుకొన్న గృహలోనుదారులు, ఇతర శాఖలపై దీని ప్రభావం పడుతోంది. సబ్ రిజిస్ట్రేషన్ అధికారి ఫిర్యాదు మేరకు టీసీఎస్ టెక్నికల్ సిబ్బంది సోమవారం వచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇంకెన్ని రోజులు పడుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు కలుగజేసుకొని సమస్యను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని క్రయవిక్రయదారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తలెత్తిన సాంకేతిక లోపంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే టెక్నికల్ సిబ్బంది సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కరించి సేవలు అందుబాటులోకి తెస్తాం.**- ఎ.వి.సురేష్, సబ్‌రిజిస్ట్రేషన్ అధికారి, పాతపట్నం**

ఆనకట్ట వద్ద నదిలోకి వృథాగా సాగునీరు



షట్టర్లు కొట్టుకుపోయాయ్!

● మళ్లీ... అదే పరిస్థితి పునరావృతం ● వృథాగా సాగునీరు ● ఆవేదనలో ఆయకట్టు రైతులు ● ఇది.. నారాయణపురం ఆనకట్ట దుస్థితి

రంగారాయపురం(సంతకవిటి): నారాయణపురం ఆనకట్ట రైతులకు సాగునీరు అందించేందుకు పాడైపోయిన షట్టర్ల స్థానంలో ఇటీవలే తాత్కాలికంగా కొత్త తలుపులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కానీ ఆ ఆశలు ఎన్ని రోజులు నిలవలేదు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు సోమవారం నీటి ఉధృతి పెరగడంతో 30 తలుపులు కొట్టుకుపోయాయి. రెండు వేల క్యూసెక్కుల నీరు వృధాగా నదిలోకి వెళ్లిపోతుంది. దీంతో ఆయకట్టు రైతులకు మళ్లీ.. అదే పరిస్థితి పునరావృతం అవుతోంది.

సాగునీరు వృథా..

ఏడు మండలాల్లోని సుమారు 37053 ఎకరాలకు ఆ ఆనకట్ట ద్వారా సాగునీరు పుష్కలంగా అందించాల్సి ఉంది. ఇటీవల ఒడిశా, ఆంధ్రా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వరద నీరు రెండు రోజులుగా నదికి పోటెత్తింది. ఆనకట్ట వద్దకు 2950 క్యూసెక్కుల నీరు వస్తుండగా, షట్టర్ల సక్రమంగా లేకపోవడంతో 200 క్యూసెక్కుల నీరు నదిలోకి వృథాగా పోతోంది. 950 క్యూసెక్కుల నీటిని మాత్రమే కుడి, ఎడమ కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. ఆనకట్ట వద్ద 6.8 మీటర్ల పొడువున నీరు వస్తున్నా పంట పొలాలకు సరిపడ నీరందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కుడి కాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు, ఎడమ కాలువ ద్వారా శ్రీకాకుళం, శ్రీకాకుళం రూరల్, గార మండలాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల ద్వారా ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడంతో శివారు గ్రామాల రైతులకు సాగునీరు అందని పరిస్థితి. దీంతో వారు వరుణుడిపైనే ఆశలు పెట్టుకోవాల్సి వస్తోంది. తలుపులు కొట్టుకుపోయిన ప్రతిసారి తూతూమంత్రంగా పనులు చేపట్టి అధికార యంత్రాంగం చేతులు దులుపుకుంటోంది. దీంతో ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు గగనంగానే కనిపిస్తోంది. ఆనకట్ట దుస్థితిపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ అధికారులు, ప్రాజెక్టు కమిటీల్లో చలనం లేదని ఆయకట్టు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు

నాగావళి నదిలో వరదనీరు ఏ స్థాయిలో వచ్చినా ఆ గ్రామాలు ప్రజలు ఆందోళన చెందుతారు. ఏ క్షణాన వరదనీరు తమ పొలాలు, గ్రామాలపైన పంజా విసురుతుందోనని కొత్తూరు రామచంద్రాపురం, రంగారాయపురం గ్రామాల ప్రజలకు భయపడుతున్నారు. కేఆర్‌పురం, రంగారాయపురం గ్రామాల మధ్య హుద్‌హద్‌సమయంలో పడిన గండి ఇప్పటికీ భయపెడుతూనే ఉంది. ఇటీవల కలెక్టర్ ఈ ప్రదేశాన్ని సందర్శించి రూ. 10లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించి రెండు నెలలు కావస్తున్నా శాశ్వత పనులు ప్రారంభం కాలేదు. ఎంపీటీ, వైస్ ఎంపీపీలు చొరవ తీసుకొని గండి ప్రదేశంలో తాత్కాలికంగా పనులు చేపట్టారు. అయితే ఇటీవల వరదలకు గండికి కుడివైపున కోతకు గురికావడంతో ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. వరదలు ఉధృతమైతే మళ్లీ గండిపడే సూచనలు ఉన్నాయని, ఇప్పటికే ఎకరాకు సుమారు రూ. 20వేల వరకు ఖర్చుచేశామని, ఏ మాత్రం గండి పడినా పొలాలు జలమయం కావడంతో పాటు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



గండి పూడ్చిన చోట నదిలోకి జారుతున్న మట్టి

India's largest trade partner?

Current Affairs & GK

1. **Justice Deepak Mishra, 45th Chief Justice of India, will assume office on…..**
1) 27 August 2017 2) 28 August 2017
3) 29 August 2017 4) 30 August 2017
5) 31 August 2017

2. **Who is the President of Kenya re-elected for second term in the August 2017 general elections?**
1) Uhuru Kenyatta
2) Muhammadu Buhari 3) Jacob Zuma
4) Robert Mugabe 5) None of these

3. **Ruth Pfau, popularly known as Pakistan's Mother Teresa has passed away. She hailed from which country?**
1) Switzerland 2) South Sudan
3) South Africa 4) Saudi Arabia
5) Germany

4. **Name the countries for first time are going to conduct Indra tri-services exercise, involving their armies, navies and the air forces in October 2017 to further ramp up military ties?**
1) India and USA 2) India and UK
3) India and Russia 4) India and China
5) India and Japan

5. **Usain Bolt announced retirement to athletics recently. He is widely considered to be the greatest sprinter of all time. He belongs to ……**
1) Jamaica 2) Kenya 3) Zimbabwe
4) Brazil 5) None of these

6. **Who was served as the Returning Officer for the 15th Presidential election held on 17 July 2017?**
1) Anoop Mishra 2) Shumsher K. Sheriff
3) Hamid Ansari 4) Sumitra Mahajan
5) None of the above

7. **Which of the following lines forms border between North Korea and South Korea?**
1) 18th Parallel north
2) 28th Parallel north
3) 38th Parallel north
4) 48th Parallel north
5) None of the above

8. **Which of the following statements correct regarding Asian Infrastructure Investment Bank (AIIB)?**
1) AIIB started operation after the agreement entered into force on 25 December 2015 and opened for business on 16 January 2016.
2) The Headquarters of AIIB is in Beijing, China.
3) Jin Liqun (China) is currently President of AIIB.
4) AIIB is an multilateral development bank that aims to support the building of infrastructure in the Asia-Pacific region.
5) All of the above

9. **Which of the following bank has introduced biometric attendance in the place of the existing system of signing attendance in the attendance register?**
1) State Bank of India
2) Punjab National Bank
3) Corporation Bank
4) Bank of India 5) None of these

10. **The Senior IAS officer from Gujarat S. Aparna is appointed as Executive Director of the …….**
1) World Bank
2) International Monetary Fund
3) World Trade Organisation
4) SAARC 5) None of these

11. **Who defeated China's Zulpikar Maimaitiali in the unified WBO Asia Pacific and Oriental Super Middle weight title?**
1) Vijender Singh 2) Manoj Kumar
3) Jitender Kumar 4) Gurcharan Singh
5) None of these


A. Ravi Prakash Reddy
Senior Faculty

12. **Match the following?**

Author	Book
A. Y.V.Reddy	(i) A Life in Science
B. C.N.R.Rao	(ii) Advice and Descent : My Life in Public Service
C. Arundhati Roy	(iii) Matoshree
D. Sumitra Mahajan	(iv) The Ministry of Utmost Happiness

	A	B	C	D
1)	(i)	(ii)	(iii)	(iv)
2)	(iv)	(iii)	(ii)	(i)
3)	(i)	(iii)	(ii)	(iv)
4)	(ii)	(i)	(iv)	(iii)
5)	(iv)	(i)	(iii)	(ii)

13. **The 75th anniversary of the Quit India Movement was observed across the country on ……**
1) 7th August 2017 2) 8th August 2017

FOR ALL COMPETITIVE EXAMS

3) 9th August 2017 4) 10th August 2017
5) None of these

14. **The Eighth Mekong-Ganga Cooperation Ministerial Meeting (8th MGCMM) was held on 7 August 2017 in..**
1) Manila, Philippines
2) Bangkok, Thailand 3) Hanoi, Vietnam
4) Phnom Penh, Cambodia
5) None of these

15. **Find the Arundhati Roy's first novel?**
1) The God of Small Things
2) The End of Imagination
3) The Cost of Living
4) The Greater Common Good
5) The Algebra of Infinite Justice

16. **Usain Bolt, greatest sprinter, belongs to …..**
1) South Africa 2) South Sudan
3) South Korea 4) Sierra Leone
5) None of these

17. **World's largest Crude Oil importer?**
1) China 2) USA 3) India 4) Japan
5) None of these

18. **World's largest Crude Oil exporter?**
1) Saudi Arabia 2) Russia 3) Iraq
4) Canada 5) None of these

19. **India's largest trade partner?**
1) China 2) USA 3) UAE
4) Saudi Arabia 5) None of these

20. **NABARD has conferred the 'best performance award' for 2016-17 to which regional rural bank?**
1) Andhra Pragathi Grameena Bank
2) Karnataka Vikas Grameena Bank
3) Telangana Grameena Bank
4) Kaveri Grameena Bank
5) None of these

21. **Who is the author of book "The Adivasi Will Not Dance"?**
1) Arundhati Roy
2) Hansda Sowvendra Shekhar
3) Chetan Bhagat 4) Amitav Ghosh
5) None of these

22. **Which state has the highest number of elephants, as per the Elephant census report 2017, released by the Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?**
1) Karnataka 2) Assam 3) Kerala
4) Tamil Nadu 5) None of these

23. **Who is the Union Minister for Environment, Forests and Climate Change?**
1) Suresh Prabhu 2) Prakash Javadekar
3) Harsh Vardhan
4) Thawar Chand Gehlot
5) Radha Mohan Singh

24. **India's Elephant population as per Elephant Census 2017 released by Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?**
1) 27,312 2) 37,312 3) 47,312
4) 57,312 5) None of these

25. **What is the nation wide campaign to protect elephants, launched by Union Ministry of Environment and Forests on the occasion of World Elephant Day observed on 12th August 2017?**
1) Project Elephant
2) Project Heritage Animal
3) Project Gaja Raja 4) Gaj Yatra
5) None of these

26. **Which of the following is the India's largest Regional Rural Bank (RRB)?**
1) Andhra Pragathi Grameena Bank
2) Prathama Bank
3) Allahabad UP Gramin Bank
4) Maharashtra Gramin Bank
5) Kerala Gramin Bank

27. **Mercosur is a sub-regional bloc between countries of which of the following continents?**
1) North America
2) South America
3) Africa 4) Asia 5) None of these

28. **McMohan Line represents boundary between which following two countries?**
1) India and Afghanistan
2) India and Pakistan 3) India and China
4) India and Bangladesh 5) None of these

29. **Which company occupies No.1 position in Fortune Global 500 list 2017, which ranks companies by their revenues in 2016?**
1) Walmart 2) State Grid
3) Sinopec Group
4) China National Petroleum
5) Toyota Motors

30. **How many Indian companies listed in Fortune Global 500 companies list?**
1) 6 2) 7 3) 8 4) 9 5) None of these

31. **SBI's rank in the Fortune Global 500 companies list?**
1) 117 2) 217 3) 317 4) 417
5) None of these

32. **Match the following?**

Company	Country
A. Toyota Motors	(i) USA
B. Berkshire Hathaway	(ii) Germany
C. Volkswagen	(iii) South Korea
D. Samsung Electronics	(iv) France
E. AXA	(v) Japan

	A	B	C	D	E
1)	(ii)	(iii)	(iv)	(v)	(i)
2)	(iii)	(iv)	(ii)	(i)	(v)
3)	(iv)	(iii)	(i)	(ii)	(v)
4)	(i)	(ii)	(iii)	(iv)	(v)
5)	(v)	(i)	(ii)	(iii)	(iv)

33. **First bank to introduce ATM in India was HSBC in…**
1) 1957 2) 1967 3) 1977 4) 1987
5) None of these

Answers

			16) 5	22) 1	28) 3
			17) 1	23) 3	29) 1
1) 2	6) 1	11) 1	18) 1	24) 1	30) 2
2) 1	7) 3	12) 4	19) 1	25) 4	31) 2
3) 5	8) 5	13) 3	20) 2	26) 5	32) 5
4) 3	9) 2	14) 1	21) 2	27) 2	33) 4
5) 1	10) 1	15) 1			

ఉద్యోగాలు

బిఇసిఐఎల్

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బిఇసిఐఎల్) - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 42

- **కంటెంట్ ఆడిటర్**

ఖాళీలు: 1
అర్హత: పీజీ డిప్లొమా(జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్) + విజువల్ మీడియా లేదా న్యూస్ ఏజెన్సీ(ఎఎన్ఐ/ పిటిఐ/ యుఎన్ఐ)ల్లో మూడేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ డిప్యూటీ డైరెక్టర్ (న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.

- **సీనియర్ మానిటర్**

ఖాళీలు: 3
అర్హత: పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం ఉత్తీర్ణత + మీడియా / న్యూస్ ఏజెన్సీల్లో రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ అసిస్టెంట్ డైరెక్టర్(న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.

- **మానిటర్**

ఖాళీలు: 38
అర్హత: గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి. పీజీ డిప్లొమా(జర్నలిజం)/డిగ్రీ(జర్నలిజం / మాస్ కమ్యూనికేషన్) పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.300
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.becil.com

సిఎస్ఐఆర్ నెట్

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్)- నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)కు ప్రకటన విడుదల చేసింది.
విభాగాలు: కెమికల్ సైన్సెస్/ ఎర్త్, అట్మాస్ఫియరిక్/ ఓషన్/ ప్లానెటరీ సైన్సెస్/ లైఫ్ సైన్సెస్/ మేథమెటికల్ సైన్సెస్/ ఫిజికల్ సైన్సెస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ / తత్సమాన పరీక్ష/ ఇంటిగ్రేటెడ్ బిఎస్- ఎంఎస్/ నాలుగేళ్ల బిఇ/ బిటెక్/ బిఫార్మసీ/ ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జెఆర్ఎఫ్‌లకు జూలై 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. లెక్చరర్‌షిప్‌నకు వయోపరిమితి నిబంధన లేదు.
సిఎస్ఐఆర్ - యుజిసి టెస్ట్ జరిగే తేదీ: డిసెంబరు 17
పరీక్ష కేంద్రాలు: గుంటూరు, హైదరాబాద్
పరీక్ష ఫీజు: రూ.1000(ఒబిసిలకు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.)
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఫీజు డిపాజిట్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
ఆన్‌లైన్ దరఖాస్తునకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 16
ఆన్‌లైన్ దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 23
వెబ్‌సైట్: www.csirhrdg.res.in

పీజెటిఎస్ఎయు

హైదరాబాద్, రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజెటిఎస్ఎయు)- **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 224
విభాగాలు: అగ్రికల్చర్ 186(6 పోస్టులను లైబ్రరీ సైన్స్‌కు కేటాయించారు), అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 22, హోం సైన్స్ 16
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 20
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 29
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?

విద్యుత్

1. విద్యుత్ ప్రవాహం ------
ఎ) సదిశ రాశి బి) అదిశ రాశి
సి) ఎ, బి డి) ఎ, బి లు కావు

2. ఓం, వెబ్ ఓంల మధ్య సంబంధం?
ఎ) $1\ \Omega = 10^{10}$ ab Ω బి) $1\ \Omega = 10^{8}$ ab Ω
సి) $1\ \Omega = 10^{9}$ ab Ω డి) $1\ \Omega = 10^{7}$ ab Ω

3. మూడు నిరోధాలను శ్రేణిలో కలిపితే ఫలిత నిరోధం R_1, సమాంతరంగా కలిపితే ఫలిత నిరోధం R_2 అయితే R_1 / R_2 విలువ?
ఎ) 3 బి) 9 సి) 1/9 డి) 1/3

4. ఒక ఆదర్శ అమ్మీటర్ నిరోధం?
ఎ) సున్నా బి) అనంతం సి) 1000 Ω డి) 10 Ω

5. ఓం నియమం అనువర్తించకూడనిది?
ఎ) ఎసి వలయం
బి) అధిక ఉష్ణోగ్రత ఉన్న వాహకాలు
సి) వాహకాలు డి) అర్ధ వాహకాలు

6. ఒక నిరోధం పొడవును రెట్టింపు చేస్తే నిరోధం?
ఎ) సగమవుతుంది బి) రెట్టింపవుతుంది
సి) నాలుగోవంతవుతుంది డి) మారదు

7. ప్రామాణిక నిరోధాలు తయారుచేయడానికి వాడే పదార్థం?
ఎ) రాగి బి) కాన్‌స్టంటన్ సి) వెండి డి) టంగ్‌స్టన్

8. 1 KWH విలువ =
ఎ) 36×10^{5} J బి) 36×10^{5} ev
సి) 36×10^{6} J డి) 36×10^{3} J

9. వివిధ సంయోగాలతో రెండు ఫలిత నిరోధాలు 18 Ω, 4 Ω . అయితే ఆ నిరోధాలు Ω లలో
ఎ) 9, 9 బి) 11, 7 సి) 6, 12 డి) 10, 8

10. ఒక వాహకం ద్వారా 0.5 ఆంపియర్ విద్యుత్ ప్రవహిస్తుంది. అయితే ఒక నిముషంలో దాని ద్వారా ప్రవహించిన ఆవేశం?
ఎ) 3C బి) 0.3C సి) 33C డి) 30C

11. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత ఫలితం కలుగుతుందని కనుగొన్నది?
ఎ) మాక్స్‌వెల్ బి) ఆయిర్‌స్టెడ్ సి) ఫెర్మి డి) ఫ్లెమింగ్

12. ప్రేరిత విద్యుచ్ఛాలక బలం దిశను తెలుసుకోవడానికి ఉపయోగించే నియమం?
ఎ) ఆంపియర్ ఎడమచేతి నిబంధన
బి) మాక్స్‌వెల్ నిబంధన
సి) ఫ్లెమింగ్ ఎడమచేతి నిబంధన
డి) ఫ్లెమింగ్ కుడి చేతి నిబంధన

13. స్వయం ప్రేరణ గుణకానికి, అన్యోన్య ప్రేరణ గుణకానికి ఎస్‌ఐ ప్రమాణాలు వరసగా?
ఎ) హెన్రీ, ఫారడ్ బి) ఫారడ్, ఫారడ్
సి) హెన్రీ, హెన్రీ డి) ఫారడ్ హెన్రీ

14. ఒక తీగచుట్ట నుంచి నిలువుగా వదలిన దండయస్కాంతం తీగచుట్టలో నుంచి కిందికి పడుతోంది. దాని త్వరణం?
ఎ) g కంటే ఎక్కువ బి) g కంటే తక్కువ
సి) g కి సమానం డి) పైవేవీ కావు

15. పాస్పర్ - బ్రాంజ్ ధర్మం?
ఎ) యంగ్ గుణకం ఎక్కువ, దృఢతా గుణకం తక్కువ
బి) యంగ్ గుణకం తక్కువ, దృఢతా గుణకం ఎక్కువ
సి) యంగ్ గుణకం ఎక్కువ, దృఢతా గుణకం ఎక్కువ
డి) యంగ్ గుణకం తక్కువ, దృఢతా గుణకం తక్కువ

16. ఫ్యూజ్ వైర్ ముఖ్య ధర్మాలు
ఎ) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
బి) ఎక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
సి) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
డి) ఎక్కువ నిరోధం, ఎక్కువ ద్రవీభవన స్థానం

17. 'గాస్' కు సమానమైన విలువ?
ఎ) 10^{4} T బి) 10^{3} T సి) 10^{2} T డి) 10T

18. రెండు ఎలక్ట్రానిక్ పుంజాలు సమాంతరంగా ఒకే దిశలో ఉన్నాయి. అవి
ఎ) వికర్షించుకొంటాయి బి) ఆకర్షించుకొంటాయి
సి) వాటి వేగాలు తగ్గుతాయి
డి) ఎటువంటి అన్యోన్య ప్రభావం ఉండదు

19. అయస్కాంత అభివాహంలో మార్పు ఆగిపోయినపుడు ప్రేరిత విద్యుచ్ఛాలక బలం?
ఎ) తగ్గుతుంది బి) స్థిరం
సి) శూన్యం డి) పెరుగుతుంది

20. సమాంతరంగా షంట్ నిరోధాన్ని కలిపిన గాల్వనోమీటర్‌ను వలయంలో శ్రేణిలో కలిపితే ఆ అమరిక పేరు?
ఎ) వోల్టుమీటరు బి) అమ్మీటరు
సి) మల్టిమీటరు డి) ఓం మీటరు

21. B, H, I ల సంబంధం?
ఎ) $B = u_0 H$
బి) $B = u_0 (H + I)$
సి) $B = u_0 I + H$ డి) $B = uH$

22. కండెన్సర్ పలకల మధ్య నిరోధకాన్ని ఉంచితే స్థితి శక్తి?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) మారుతుంది.


23. ఒక కండెన్సర్‌లో నిలువ ఉండే శక్తి?
ఎ) QV బి) QC / 2 సి) QV/2 డి) 1/2 CV/2

24. సబ్బు బుడగను ఆవేశ పరిస్తే?
ఎ) వ్యాకోచిస్తుంది బి) సంకోచిస్తుంది
సి) పేలిపోతుంది
డి) ఎటువంటి మార్పునకు లోను కాదు



శీలం దేవేందర్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్



25. ఎలక్ట్రాన్ల శక్తిని పెంచాలి అంటే వాటిని -------
ఎ) బాగా ఎత్తునుంచి కిందికి పడవేయాలి
బి) సీసం దిమ్మె ద్వారా పంపాలి
సి) విద్యుత్ పొటెన్షియల్ ద్వారా ప్రయాణం చేయించాలి
డి) అధికంగా వేడిచేయాలి.

26. ఒక వస్తువు ఆవేశానికి, పొటెన్షియల్‌కు గల నిష్పత్తి?
ఎ) వాహకత్వం బి) కెపాసిటెన్స్
సి) ప్రేరకత్వం డి) నిరోధం

27. ఒక సర్పిలాకారపు స్ప్రింగ్ ద్వారా ఏకముఖ విద్యుత్ ప్రవాహాన్ని పంపారు. ఆ స్ప్రింగ్ -----
ఎ) సాగుతుంది బి) గుండ్రంగా తిరుగుతుంది
సి) సంకోచిస్తుంది డి) ఏదీకాదు

28. 100 w, 200V బల్బు నిరోధం ------
ఎ) 200 Ω బి) 100Ω సి) 150Ω డి) 400Ω

29. మానవుని నిరోధం సుమారు -------
ఎ) 10^{2} Ω బి) 10^{4} Ω సి) 10^{5} Ω డి) 10^{6} Ω

30. ఒక అర్థ వాహకం ఉష్ణోగ్రతను పెంచినపుడు దాని నిరోధం
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) పైవేవీ కాదు

31. 3Ω నిరోధం గల తీగను మూడు సమాన భాగాలుగా కత్తిరించారు. ఆ తరవాత ఈ మూడు భాగాలను వాటి చివరలు కలిసేటట్లు ముడిపెట్టారు. ఈ అనుసంధాన నిరోధం?
ఎ) 3 Ω బి) 1/3 Ω సి) 2/3 Ω డి) 1Ω

32. శక్మాంతరాన్ని ------తో కొలుస్తారు?
ఎ) అమ్మీటర్ బి) గాల్వనా మీటర్
సి) ఓల్టు మీటర్ డి) కెపాసిటర్

33. మేఘాలలోకి గాలి పటాలను ఎగురవేసి అవి విద్యుదావేశంతో ఉంటాయని నిరూపించిన శాస్త్రవేత్త--------
ఎ) ఆంపియర్ బి) ఆయిర్‌స్టెడ్
సి) ఫ్లెమింగ్ డి) ఫ్రాంక్లిన్

34. రేడియో, టార్చిలైట్, టేపు రికార్డర్లలో ఉపయోగించే ప్రాథమిక ఘటం?
ఎ) వోల్టా ఘటం బి) అనార్ద్ర ఘటం
సి) లెక్లాంచి ఘటం డి) బైక్రోమేట్ ఘటం

35. టెలిగ్రాఫ్‌ల్లో ఉపయోగించే కోడ్?
ఎ) పిన్ బి) BCD సి) మోర్స్ డి) టెలి

36. ఎలక్ట్రిక్ బల్బుల్లో నింపే వాయువు?
ఎ) హైడ్రోజన్ బి) ఆర్గాన్
సి) ఆక్సిజన్ డి) నైట్రోజన్

37. కరెంట్ ప్రయాణించడానికి అది ఏ మార్గాన్ని ఎంచుకొంటుంది?
ఎ) గరిష్ఠ నిరోధం బి) మధ్యస్థ
సి) కనిష్ఠ నిరోధం డి) పైవేవీ కాదు

38. షార్ట్ సర్క్యూట్ అయినపుడు వలయంలో కరెంట్?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది డి) చెప్పలేం

39. విశిష్ట నిరోధానికి ప్రమాణం?
ఎ) ఓం/ మీటర్ బి) మో/ మీటర్
సి) ఓం మీటర్ డి) మీటర్ / మో

40. బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?
ఎ) నిక్రోం బి) టంగ్‌స్టన్
సి) మాంగనీస్ డి) క్రోమియం

41. విద్యుత్ప్రవాహం వల్ల ఉష్ణ ఫలిత అనువర్తనం?
ఎ) విద్యుత్ - ఇస్త్రీ పెట్టె బి) ఇమ్మర్షన్ హీటర్
సి) ఎలక్ట్రిక్ స్టౌ డి) పైవన్నీ

42. విద్యుత్ పని w, కరెంట్ i, నిరోధం R, కాలం t ల మధ్య సంబంధం?
ఎ) $w = iRt$ బి) $w = i^{2} R/t$
సి) $w = i^{2}Rt$ డి) $w = i^{2}t/R$

43. ఒక విద్యుత్ సాధనం వాటేజ్(P)ను తెలిపే సమీకరణం?
ఎ) $p = vi$ బి) $p = v^{2}/R$
సి) $p = i^{2}R$ డి) పైవన్నీ

44. ఇళ్లలోకి సరఫరా చేసే విద్యుత్ పొటెన్షియల్ భేదం?
ఎ) 220v బి) 130v సి) 240v డి) 180v

45. నిత్య జీవితంలో విద్యుత్ శక్తిని కొలిచేందుకు ఉపయోగించే పెద్ద ప్రమాణం
ఎ) వాట్ - గంట బి) కిలోవాట్ - గంట
సి) వాట్ - సెకను డి) జౌల్ / సెకను

46. విద్యుత్ ప్రవాహం వల్ల ఉత్పత్తి అయ్యే ఉష్ణరాశిని కొలిచే సూత్రం?
ఎ) Q = mst బి) Q = ms/t
సి) Q = m/st డి) Q = ms

47. విద్యుత్ రసాయన తుల్యాంకానికి ప్రమాణాలు?
ఎ) గ్రామ్/ కూలూమ్ బి) గ్రామ్ కూలూమ్
సి) కూలూమ్/ గ్రాం డి) గ్రామ్ / ఆంపియర్

48. విద్యుద్విశ్లేషణం వల్ల కాపర్ సల్ఫేట్ ద్రావణం గాఢత-----
ఎ) పెరుగుతుంది బి) మారదు సి) తగ్గుతుంది
డి) పెరిగి తగ్గుతుంది

49. విద్యుత్ప్రవాహం వల్ల ఏదైనా బిందువు వద్ద ఏర్పడిన అయస్కాంత క్షేత్ర (B) దిశ ఆ బిందువు వద్ద గీసిన ------- దిశలో ఉంటుంది.
ఎ) అభిలంబ రేఖ బి) సరళరేఖ
సి) స్పర్శ రేఖ డి) ఏదీకాదు

50. ప్రాంతీయ ట్రాన్స్‌ఫార్మర్లు------
ఎ) స్టెప్ అప్ ట్రాన్స్‌ఫార్మర్
బి) స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
సి) స్టెప్ అప్, స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
డి) ఏదీ కాదు

సమాధానాలు

1) బి	9) సి	17) ఎ	25) సి	34) బి	43) డి
2) సి	10) డి	18) బి	26) బి	35) సి	44) సి
3) బి	11) బి	19) సి	27) సి	36) బి	45) బి
4) ఎ	12) డి	20) బి	28) డి	37) సి	46) ఎ
5) డి	13) సి	21) బి	29) సి	38) ఎ	47) ఎ
6) బి	14) బి	22) బి	30) బి	39) సి	48) బి
7) బి	15) ఎ	23) ఎ	31) బి	40) బి	49) సి
8) ఎ	16) బి	24) ఎ	32) సి	41) డి	50) బి
			33) డి	42) సి	

ఉద్యోగాలు

డిఎంఇ

ఆంధ్రప్రదేశ్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) - **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 198
విభాగాలు: అనాటమీ/ ఫిజియాలజీ/ ఫార్మకాలజీ/ మైక్రోబయాలజీ/ ఎమర్జెన్సీ మెడిసిన్/ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్
అర్హత: (ఎమ్మెస్/ ఎండి)(అనాటమి)/ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (మెడికల్ అనాటమీ) + పిహెచ్‌డి(మెడికల్ అనాటమీ)/ (ఎమ్మెస్సీ + డిఎస్సీ)(మెడికల్ అనాటమీ)/ ఎండి(ఫిజియాలజీ)/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (ఫిజియాలజీ)/ (ఎమ్మెస్సీ+ పిహెచ్‌డి)(మెడికల్ ఫిజియాలజీ)/ ఎండి(బయోటెక్నాలజీ/ మైక్రో బయాలజీ/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ(బ్యాక్టీరియాలజీ/ మెడికల్ బ్యాక్టీరియాలజీ) + పిహెచ్‌డి(మెడికల్ బ్యాక్టీరియాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: జూలై 1 నాటికి 40 ఏళ్లు మించరాదు
ఎంపిక: అకడమిక్ మెరిట్ లిస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1000
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ పర్సనల్‌గా గానీ కింది చిరునామాకు పంపుకోవాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Director of Medical Education, AP, Vijayawada
వెబ్‌సైట్: www.dme.ap.nic.in

అడ్మిషన్స్

టాటా మెమోరియల్ హాస్పిటల్

టాటా మెమోరియల్ హాస్పిటల్ - కేన్సర్ పేషెంట్లకు క్లినికల్ కేర్ & సైకో సోషల్ కేర్ అందించేందుకు ఉద్దేశించిన **'పేషెంట్ నేవిగేటర్ సర్టిఫికెట్ కోర్స్'**కు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు కాల వ్యవధి: ఆరునెలలు
కోర్సు ఫీజు: రూ.18,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: https://tmc.gov.in

యూనివర్సిటీ ఆఫ్ లక్నో

యూనివర్సిటీ ఆఫ్ లక్నో - **ఎంబిఏ** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు విభాగాలు: ఫైనాన్స్ & కంట్రోల్/ హెచ్‌ఆర్& ఐఆర్/ ఇంటర్నేషనల్ బిజినెస్/ మార్కెటింగ్
అర్హత: 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణ.
ఎంపిక: క్యాట్ 2017 స్కోరు ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా క్యాట్ 2017కు దరఖాస్తు చేసుకొని ఆ తరవాత లక్నో యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవాలి.
క్యాట్ రిజిస్ట్రేషన్: సెప్టెంబరు 20 వరకు
క్యాట్ 2017 ఎగ్జామ్: నవంబరు 26
యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ: 2018 జనవరి 31
వెబ్‌సైట్: www.lkouniv.ac.in

ఐఐటిబి - మోనాష్

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిబి), ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మోనాష్ యూనివర్సిటీ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటిబి - మోనాష్ రీసెర్చ్ అకాడమీ - **పిహెచ్‌డి ప్రోగ్రామ్‌**నకు దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సైన్స్/ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ ఐటి/ ఇంజనీరింగ్/ హ్యూమానిటీస్/ సోషల్ సైన్సెస్/ డిజైన్ / మేథమెటిక్స్
అర్హత: ఫస్టు క్లాస్ మార్కులతో పీజీ/ బిఎస్సీ/ బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్/ జిఆర్‌ఇ/ సిఎస్ఐఆర్- నెట్ / జామ్ ఎగ్జామ్స్‌లో అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.iitbmonash.org

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రామయ్యపట్నం (సోంపేట) : రామయ్యపట్నం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిన్మయమిషన్ సభ్యులు పుస్తకాలు, పెన్నులు సోమవారం అందజేశారు. ప్రభుత్వం అందజేసిన ప్లేట్లు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నిట్ట గోపాల్, ఎన్.దుర్యోధన, రుషి, కోదండరావు, ప్రధానోపాధ్యాయుడు రామారావు పాల్గొన్నారు.



పనికోసం వచ్చి మృతి

● వైన్ షాపు వద్ద సృహ తప్పిపోయిన వ్యక్తి

● ఆసుపత్రిలో చేర్పించేలోపే వదిలిన ప్రాణాలు

ఇచ్ఛాపురం: పని కోసం వచ్చిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇచ్ఛాపురం పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం పీఎన్ కాలనీకి చెందిన కొర్ని సత్యం(45) ఇచ్ఛాపురం పుష్కర వైన్స్ షాపులో పని చేసి ఏడాది కిందట మానేశాడు. ఆ తరువాత పని కావాలని తరుచూ శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వచ్చి వైన్ షాపు యజమానిని అడిగే వాడు. ఆయన ఖాళీ లేదని చెప్పడంతో తిరిగి వెళ్లిపోయేవాడు. సోమవారం కూడా పని కోసం వచ్చిన సత్యం మద్యం దుకాణం వద్ద సృహ కోల్పోయాడు. వెంటనే షాపు యజమాని ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా యోగా తరగతులు



యోగా శిక్షణలో పాల్గొన్న యువకులు

ఇచ్ఛాపురం : పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో పతాంజలి ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం అధిక సంఖ్యలో యువకులు యోగా తరగతుల్లో పాల్గొన్నారు. యోగా, ధ్యానం, ప్రాణాయమం, ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ నెల 28 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని యోగా గురువు రామ్‌దేవ్‌బాబా శిష్యుడు భానుదాస్ తెలిపారు. కార్యక్రమంలో పతాంజలి గురువు సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏపీడీ లోకేశ్వరరావు

కవిటి: డ్వామా పీడీ కూర్మారావు ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనుల రికార్డులను తనిఖీ చేస్తున్నట్టు పాలకొండ క్లస్టర్ ఏపీడీ కె.లోకేశ్వరరావు తెలిపారు. సోమవారం కవిటి మండలానికి సంబంధించిన ఉపాధి రికార్డులను ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014 నుం చి ఇప్పటి వరకు చేపట్టిన ఉపాధి పనులను పరిశీ లించేందుకు కేంద్ర బృందం త్వరలో రానుందని తె లిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా రికార్డులను తనిఖీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని క్షేత్ర సాంకేతిక సహాయకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం క్లస్టర్ ఏపీడీ బి.లవరాజు, ఏపీవో కె.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయులదే'

సంతబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయులదేనని రాజీవ్ విద్యా మిషన్ ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ చెప్పారు. సోమవారం ఆయన ఎంఆర్‌సీలో జరిగిన స్కూల్‌కాంప్లెక్స్ కంప్యూటర్ శిక్షణలో మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారు అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు రాజీవ్ విద్యా మిషన్ ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.

మట్టి గణపయ్యనే పూజిద్దాం

● ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉందాం

● పర్యావరణం కాపాడుకుందాం

కవిటి: స్వచ్ఛభారత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది.. మరోవైపు పర్యావరణానికి, పరిసరాల పారిశుధ్యానికి విఘాతం కలిగించే చర్యలు సాగుతున్నాయి. వినాయక చవితి సమీపిస్తోంది. ఈనేపథ్యంలో మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించడం ఎంతో మేలు. కానీ, ఇందుకు భిన్నంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడవాడలా నెలకొల్పడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. రకరకాల రసాయనాల రంగులు పూసిన విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నిమజ్జనం చేసేటప్పుడు నీటిలో కరగవు. రసాయనాల వల్ల జలాలు కాలుష్యమవుతాయి. నీటిలో జీవరాసులు చనిపోతాయి. భూ సారం దెబ్బతింటోంది. ఈ నీటి వల్ల ఆ రోగ్యానికి హాని కలిగే ఆహారోత్పత్తులతో రకరకాల చర్మవ్యాధులు, నాడీ సంబంధ వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అంశాలపై విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నా, ఉత్సవాల నిర్వాహకులు పెడచెవిని పెడుతున్నారు. సులువుగా, అందంగా ఉండే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలపై మోజు చూపుతున్నారు. మండల కేంద్రంలోని కంచ్రవీధిలో గతంలో ఎక్కువగా మట్టి గణపతులు విగ్రహాలు విక్రయాలు జరిగాయి. రానురాను ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల పట్టణాలనుంచి తీసుకువస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు అందమైన డిజైన్లలో రకరకాల సైజ్‌ల్లో తక్కువ శ్రమతో, తయారు చేయవచ్చు. మట్టి విగ్రహాల తయారీకి ఆ పరిస్థితి లేదు.



ఈ బొమ్మలు వద్దు: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు



సిద్ధమైన మట్టి వినాయక విగ్రహం

ప్రజల్లో మార్పు రావాలి



విగ్రహాలు కొనుగోలులో మార్పురావాలి. ఎక్కువ మంది ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌పై మోజు చూపుతున్నారు. మట్టి వినాయకులకు గిరాకీ తగ్గిపోయింది. జీవనోపాధి దెబ్బతిన కూడదని అప్పు చేసి పెట్టుబడి పెట్టి రాజమండ్రి, విశాఖలనుంచి తీసుకువచ్చి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు విక్రయిస్తున్నాం. మట్టి విగ్రహాలతో ఎన్నో ప్రయోజనాలున్నాయి.

-దీపక్ బెహర, కంచ్రవీధి, శిల్పి.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

● సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అవతారం

ఇచ్ఛాపురం: పోలీసుల అనుమతి లేకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.అవతారం అన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఎక్కెడెక్కడ వినాయక మండపాలు ఏర్పాటు చేస్తారో నిర్వాహకులు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని తెలిపారు. మైక్‌ల ఏర్పాటుకు కూడా అనుమతి తీసుకోవాలన్నారు. ఎక్కడ నిమజ్జనం చేస్తారో చెప్పాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చవితి జరుపుకోవాలని సీఐ సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

అందుబాటులో కాల్ అంబులెన్స్ యాప్

ప్రమాదాలు జరిగినపుడు వెంటనే స్పందించే విధంగా కాల్ అంబులెన్స్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు సీఐ తెలిపారు. గూగల్‌లో ఈ యాప్‌ను ఓపెన్ చేసుకొని ప్రమాదం జరిగిన వెంటనే ఈయాప్ క్లిక్ చేస్తే ప్రమాద సంఘనటకు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం వస్తుందని తెలిపారు. పోలీసులు అప్రమత్తమై ఫస్ట్‌ఎయిడ్ చేసి దగ్గర్లో ఉన్న అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు ఆసుపత్రికి కూడా సమాచారం అందజేస్తారని తెలిపారు.



యాప్ పని తీరు వివరిస్తున్న సీఐ అవతారం

● కంచిలి మండలం ఎంఎస్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని మకరాంపురం, మాకన్నపురం, కొత్తఅంపురం, పాతఅంపురం గ్రామాల్లో మంగళవారం చంద్రన్న సంచార వైద్య సేవలు అందించనున్నారు.

గ్యాస్ సమాచారం

● సోంపేట శ్రీ సాయి ఏజెన్సీలో ఈ నెల 22 న గ్యాస్ బుకింగ్ చేసుకునే పట్టణ వినియోగదారులకు 23న, రూరల్ ప్రాంత వినియోగదారులకు 24న సిలిండర్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు.

● కేదారిపురం, ముచ్చింద్ర, బెనుగానిపేట, అరకబద్ర, మండపల్లి గ్రామాలతో పాటు మున్సిపాల్టీ పరిధిలో ఏఎస్‌పేట, పురుషోత్తపురం వార్డుల్లో మంగళవారం గ్యాస్ సరఫరా చేస్తామని ఏజెన్సీ ప్రతినిధి వెంకటేష్ తెలిపారు.

'కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించాలి'

టెక్కలిటౌన్: నందిగాం మండలంలో కొండల ప్రాంతం లో ఉన్న గ్రామాల ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రథజనబొడ్డపాడు సర్పంచ్ బుడ్డ ధనుంజయరావు, తమి రె బలరామస్వామి, ఎన్.రామమూర్తి, ఎల్.విశ్వనాథం కిడ్నీ బాధితులతో కలిసి సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆర్డీవో ఎం. వెంకటేశ్వరరావుకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ నందిగాం మండలంలోని ఆర్‌జేబొడ్డపా డు, కర్లపూడి, మధురామాలపేట, పోతులూరు, బైరిబొడ్డపాడు, బెల్లుకోల, సవరనీలాపురం, పెద్దగురువూరు, హర్షబాడ తదితర గ్రామాలకు చెందిన పలువురు కిడ్నీ వ్యాధి తో బాధపడుతూ శ్రీకాకుళం, విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారికి వైద్యం అందించి ఆర్థికంగా సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే విశాఖపట్నంలో చికిత్స పొందుతూ భుజంగరావు, అంబలి మల్లేసు మృతిచెందారని తెలిపారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సినిమాలు

సోంపేట

శ్రీనివాస.. లై
శివ...... నేనే రాజు..నేనే మంత్రి

ఇచ్ఛాపురం

పూర్ణ ... నేనే రాజు నేనే మంత్రి
శ్రీమణికంఠ.. జయ జానకి నాయక

కవిటి

మహాలక్ష్మి.. నేనే రాజు నేనే మంత్రి
అశోక్..... లై

నగదు రహితం వందశాతం అమలు చేయండి

సోంపేట : నగదు రహిత లావాదేవీలు వందశాతం జరిగేలా చూడాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. సోమ వారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ సరుకులను నగదురహితంగా అందజేయాలన్నారు. డీలర్లు ఈ విధానాన్ని ఎందుకు పూర్తిస్థాయిలో కొనసాగించడం లేదని ఆయన ప్రశ్నించారు.సంబంధిత మంత్రి ప్రకటన మేరకు నగదు తీసుకొని సరుకులు ఇస్తున్నట్టు డీలర్లు తెలియజేశారు. కార్డుదారులందరూ సరుకులు విడిపించుకొనేలా చూడాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సూచించారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కేశపురం(ఇచ్ఛాపురం రూరల్): కేశుపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ నీలాపు చంద్రయ్య ఆధ్వర్యంలో సోమవారం ప్లేట్లు పంపిణీ చేశారు. 48 మంది విద్యార్థులకు వీటిని అందజేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కె.హేమంత్, ప్రధానోపాధ్యాయుడు ఎస్.ధర్మారావు, ఉపాధ్యాయుడు ప్రతాప్ పాల్గొన్నారు.

దాలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న సర్పంచ్ దంపతులు

ప్రగడపుట్టుగ(కవిటి రూరల్):ప్రగడపుట్టుగకు చెందిన రాజమహేంద్రం దాలయ్య కుటుంబానికి సర్పంచ్ శేఖర్, తనూజ దంపతులు రూ.5వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. నిరుపేద అయిన దాలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో దాలయ్య కుటుంబాన్ని సర్పంచ్ దంపతులు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు తేజేశ్వరరావు, ప్రియాసుధ, తులసయ్య పాల్గొన్నారు.

25న అంతర్ రాష్ట్ర నృత్య పోటీలు

కొత్తపుట్టుగ(కవిట రూరల్): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కొత్తపుట్టుగలో ఈ నెల 25న అంతర్ రాష్ట్ర డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహించనున్నట్టు జగద్గురు సంఘ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 23 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9985695926, 9849847782, 995976517 నెంబర్లను సంప్రదించాలని జగద్గురు సంఘ సభ్యులు పేర్కొన్నారు.

వనిత కార్డులను వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న అసిసెంట్ డిపో మేనేజర్

అర్జునాపురం(కంచిలి): ఆర్టీసీ అందిస్తున్న వనిత కార్డులను వినియోగించుకోవాలని పలాస ఆర్టీసీ అసిస్టెంట్ డిపోమేనేజర్ రమేష్ కోరారు. సోమవారం అర్జునాపురంలో వనిత, క్యాట్ కార్డులపై అవగాహన కల్పించారు. వనిత కార్డుతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సమయంలో ప్రమాదం సంభవిస్తే రూ.1.50 లక్షల బీమా సదుపాయ కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యుడు బి.కామేస్‌రెడ్డి, గ్రామ యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు ఆర్థిక సంఘ నిధులు

కవిటి: కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలకు రంగులు వేసేందుకు, కుర్చీలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు 14వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.50 వేలు అందచేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఎస్.చిరంజీవి సూచించారు. అలాగే, వంటపాత్రల నిమిత్తం రూ.5వేలు మంజూరు చేయాలని తెలిపారు. 2010-2016 మధ్యకాలంలో ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

రేపు హోమియో వైద్య శిబిరం

కవిటి : మండలంలోని బి.గొనపపుట్టుగలో బుధవారం ఉదయం 9 గంటలకు హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ) తెలిపారు. ప్రముఖ హోమియో వైద్యుడు కొంగర్ రమేష్ నేతృత్వంలో వైద్యబృందం కిడ్నీ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. కిడ్నీ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.





కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బారువ, గొల్లగండి రైతులు, ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవిబాబు

పశువులతో పంటలు నష్టపోతున్నాం

●వెంటనే వాటిని కట్టడి చేయించండి ●బారువ గోశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సోంపేట: బారువ, గొల్లగండి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలను బారువ గోశాలకు చెందిన ఆవులు నాశనం చేస్తున్నాయని, వెంటనే వాటిని కట్టడి చేసేలా ఆదేశించాలని గొల్లగండి సర్పంచ్ నాగం భాస్కరరావు, తదితరులు కలెక్టర్ ధనుంజయరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఎంతో కష్టపడి ఉడుపులు చేశామని, ఇప్పుడిప్పుడే నాట్లు ఆనుకొని పొలాలు పచ్చగా కనిపిస్తున్నా యని, ఈతరుణంలో గోశాలకు చెందిన ఆవుల మంద వాటిని మేసేస్తున్నాయని వాపోయారు. వాటిని పంట పొలాలవైపు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో జి.పాపారావు, పి.కేశవరావు, వై.తారకేష్, వి.వెంకటేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆవులు పంటపొలాలను నాశనం చేస్తున్న ఫొటోలను కలెక్టర్ చూపించారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఇచ్ఛాపురం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో కె.అప్పారావు సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. తమ గ్రామంలోని పాఠశాలలో 63 మంది విద్యార్థులు చదువుతు న్నారని, కానీ ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో బోధన కుంటుపడుతుందని అయ్యవారిపేట యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శంకర్, పాపాయ్య, గంగాధర్, పి.సుజాత పాల్గొన్నారు.

క్రీడా మైదానం కాపాడాలి

కవిటి : మండల కేంద్రంలోని ఏకైక క్రీడామైదానాన్ని కాపాడాలని స్థానిక క్రీడాకారులు బి.వెంకటపతి, టి.నాగరాజు, వి.జయరాం, జె.భరత్, పి.ప్రశాంత్, తులసి, ఆనంద్, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ విభాగంలో ఎంపీడీవో ఎస్.చిరంజీవి, తహసీల్దార్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామస్థులకు ఎంతగానో ఉపయోగపడే క్రీడామైదానంలో నూతన భవనాలు నిర్మించకుండా చూడాలని క్రీడాకారులు కోరారు. శిథిల భవనాల స్థానంలో కొత్తవి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో పాటు ఎంపీపీ బి.కిరణ్‌కుమారి, జడ్పీటీసీ సభ్యుడు బి.రమేష్‌కు విజ్ఞప్తి చేశారు.



కవిటి గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న క్రీడాకారులు


చెరువుల లీజు నిలిపి వేయండి

ఇచ్ఛాపురం: ఇన్‌లాండ్ ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ పాత పాలకవర్గంలో రూ.17లక్షల అవినీతి చోటుచేసుకుందని, దీనికి సంబంధించి 40 మందిపై కోర్టులో కేసు నడుస్తుందని, ఇది తేలే వరకూ మున్సిపల్ పరిధిలోని చెరువులను లీజుకు ఇవ్వరాదని కండ్రవీధికి చెందిన ఇన్‌లాండ్ ఫిషర్‌మెన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు అంకుల జలంధర్ బెహరా, సభ్యులు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవిబాబు అధ్యక్షతన గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కాలువలు అధ్వానంగా ఉన్నాయని 11వ వార్డు పరిధిలోని కృష్ణసాగర్, మహంతి వీధి వాసులు ఫిర్యాదు చేశారు. రత్తకన్న హైస్కూల్ సమీపంలో రోడ్డు బాగు చేయాలని వార్డు ప్రతినిధి బి.జగన్ వినతిపత్రం సమర్పించారు. వితంతు పింఛన్ మంజూరు చేయాలని రత్తకన్నకు చెందిన సీహెచ్ పార్వతి కోరారు. పంజావీధి పాఠశాలలోని చెట్ల కొమ్మలు తన ఇంటివైపు వాల డంతో ఇబ్బందిగా ఉందని వజ్రం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించండి

ఇచ్ఛాపురం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రగతి, సామర్థ్యం పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ కె.పాండురంగస్వామి, డాక్టర్ టీవీఎస్ రమేష్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. లెర్నింగ్ ఓట్‌కమ్స్, ఎన్ఏఎస్ (నేషనల్ ఎచ్యూమెంట్‌సర్వే)పై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.అప్పారావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కవిటి: విద్యార్థుల సామర్థ్యం మెరుగుపడే విధంగా పాఠ్యంశాలు బోధించాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, జి.శ్రీనివాస్, కె.పాండురంగస్వామి, టీవీఎస్ రమేష్, ఏఎం.జయశ్రీ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కవిటి ఉపాధ్యాయులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలు, ప్రగతిపై వివరించారు. భవిష్యత్‌లో జరిగే సర్వేలపై అప్రమత్తత తెలియజేశారు. పరీక్షల నిర్వహణ, ప్రశ్నలు చదివి విద్యార్థులు జవాబులిచ్చే తీరు, ఉపాధ్యాయుల బోధన అనుభవం, తదితర అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయమజ్జి పాల్గొన్నారు.





కవిటిలో వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్న కవిటి, ఇచ్ఛాపురం ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు

అధికారుల ఫోన్‌నెంబర్లు

తహసీల్దార్:	
ఉమామహేశ్వరరావు	9440971644
ఈవోపీఆర్‌డీ	
డి.సుదర్శనరావు	9490655182
ఎంఈవో	
ధనుంజయ మజ్జి	9849860156
ఏఈ (హౌసింగ్)	
కె.కృష్ణారావు	7093930229
ఏఈ (విద్యుత్‌శాఖ)	
వీర్రాజు	9440812439
ఏవో (వ్యవసాయం)	
పి.నవీన్	8096696702
పశు వైద్యాధికారి	
వి.రమణ	7680830777
ఏఈఈ (ఆర్‌అండ్‌బీ)	
బి.రవికాంత్	9440459129
ఏపీవో (ఎన్‌ఆర్‌జీఎస్)	
కె.భాస్కరరావు	8790007186
ఏపీఎం (వెలుగు)	
ఎం.చక్రపాణి	8008803898
జేఈ (పంచాయతీరాజ్)	
కె.కృష్ణారావు	9400365869

- కవిటి

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 4, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సహోద్యోగులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల కలయిక ఆనందం కలిగిస్తుంది. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లకు అనుకూలం. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు కీలక సమాచారం అందుకుంటారు. బదిలీలు, మార్పులకు అనుకూలం. ఇంటికి అవసరమైన వస్తువులు రవాణా అవుతాయి. విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బోధన, రవాణా, స్టేషనరీ, కమ్యూనికేషన్ల రంగా వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. విలువైన పత్రాలు చేతికి అందుతాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సినీ, రాజకీయ రంగాల వారు కొత్త ప్రాజెక్టులు ప్రారంభిస్తారు. కొంతకాలంగా వెంటాడుతున్న స్తబ్దత తొలగిపోయి మనసు ప్రశాంతంగా ఉంటుంది. విరామ కాలక్షేపాలు ఉల్లాసం కలిగిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): దీర్ఘకాలికి పెట్టుబడులకు అనుకూలం. సినీ రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకంగా ఉంటుంది. ఆడిటింగ్, బ్యాంకింగ్ రంగాల వారికి ప్రోత్సాహకరం. విరాళాలు, చందాలకు వెచ్చిస్తారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బృందకార్యక్రమాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. ఆర్థిక విషయాల్లో లక్ష్య సాధనకు పెద్దల సహకారం లభిస్తుంది. సమావేశాల్లో గౌరవ, మన్ననలు అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): వృత్తి, వ్యాపారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరం. గౌరవ పదవులు అందుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆర్థికపరమైన వ్యూహాలు ఫలిస్తాయి. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి నిధులు సర్దుబాటవుతాయి. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు అందుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): క్రయవిక్రయాలకు అనుకూలం. బీమా, గ్రాట్యుటీ, పన్నుల వ్యవహారాలు పూర్తి చేస్తారు. భాగస్వామి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): భాగస్వామి సహకారంతో వృత్తిపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకల్లో పాల్గొంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్నేహానుబంధాలు బలపడతాయి. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

అక్రమాలకు 'ఆశ్రమం'

(మొదటి పేజీ తరువాయి)

నెలకు మెనూ కింద ఒక్కో విద్యార్థికి 3 నుంచి 8వ తరగతి వరకు రూ.850, తొమ్మిది నుంచి ఇంటర్మీడియట్ వరకు రూ.1050 ఖర్చు చేస్తోంది. 47 ఆశ్రమ పాఠశాలలకు ఏటా రూ.28కోట్ల నిధులు వెచ్చిస్తోంది. వీటి నిర్వహణను పక్కాగా చూడాల్సిన చాలామంది వార్డెన్లు వీటిని పూర్తిగా గాడి తప్పించేశారు. అడ్డగోలు ఆదాయం పెంచుకునేందుకు వీటిని అవినీతి మయంగా మార్చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను ఉన్నదానికంటే ఎక్కువ చూపించి నెలనెలా వేలల్లో మిగుల్చుకుంటున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో 17వేల మందిలో 14వేల మంది వరకు అప్పుడప్పుడు అక్కడ ఉంటారు. మిగిలిన సమయాల్లో రకరకాల కారణాలతో ఇళ్ల వద్దే ఉంటారు. ఇదే అదనుగా పలువురు వార్డెన్లు లేని పిల్లల పేర్లతో నిధులు బొక్కేస్తున్నారు. మందస, సీతంపేట, మెళియాపుట్టి తదితర మండలాల్లో అత్యధికంగా బోగస్ హాజరు కొనసాగుతోంది. వార్డెన్లు నెలనెలా మిగిలే సరుకులు, ఇతరత్రా వస్తువులను బహిరంగ మార్కెట్‌లో విక్రయించి భారీగా సంపాదిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సిన ట్రంకుపెట్టెలు, నోట్‌బుక్స్, కాస్మొటిక్ చార్జీల్లో కూడా భారీగానే మిగుల్చుకుంటున్నారు. వాస్తవానికి ఈ ఆశ్రమపాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కిలో రూపాయికే బియ్యం సరఫరా చేస్తోంది. నిత్యవసర సరుకులు కూడా బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకు లభ్యమయ్యేలా జీసీసీ ద్వారా టెండర్ రూపంలో అధికారులు సమకూర్చుతున్నారు. కూరగాయలు సైతం తక్కువ ధరకు అందజేస్తున్నారు. ఈ అవకాశాలను అక్రమార్జనగా మార్చేసుకుంటున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం విద్యార్థికి 500 గ్రాముల వరకు అన్నం వడ్డించాలి. కానీ వీరిలో మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చాలా మంది పిల్లలు పరిమితి మేరకు భోజనం తినరు. ఒకవేళ తిన్నా వారికి కడుపునిండా అందించడం లేదు. మెనూ సక్రమంగా అమలు చేయడంలేదు. ప్రతి వస్తువును మిగుల్చుకుంటూ బయట మార్కెట్‌కు తరలించేస్తున్నారు. బియ్యం విషయం తీసుకుంటే ప్రభుత్వం కిలో రూపాయికి ఇచ్చే బియ్యాన్ని బయటి మార్కెట్లో 50కేజీల బస్తాను రూ.800వరకు విక్రయిస్తున్నారు. పిల్లలకు గుడ్‌మిల్క్ ప్యాకెట్లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. 12ప్యాకెట్లు ఉండే పాల పెట్టెలను జీసీసీ రూ.570కు కొనుగోలు చేసి ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తోంది. వీటిని అడ్డంగా మిగ్చులకుని చాలా మంది వార్డెన్లు, ఇతర సిబ్బంది ఒక్కో బాక్స్‌కు మార్కెట్లో రూ.350కి అమ్ముకుంటున్నారు. ఇలా పలువురు వార్డెన్లు నెలకు సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు సంపాదిస్తున్నారు. ఏటా రూ.2.50కోట్ల వరకు అడ్డంగా బొక్కేస్తున్నారు.

వారు అక్కడుంటే తనిఖీలెలా?

ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరగాలి. ఇందుకోసం ఒక డిప్యూటీ డైరెక్టర్, ముగ్గురు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు (ఏటీడబ్ల్యూవో) ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి 18 ఆశ్రమ పాఠశాలలను అప్పగించారు. రోజుకో ఆశ్రమ పాఠశాలను తనిఖీచేసి మెనూ అమలు నుంచి బోగస్ హాజరు నివారణ వరకు పక్కాగా పనిచేయాలి. కాని ఇప్పటికీ అది జరగడం లేదు. వీరంతా అసలు తనిఖీల ఊసే మర్చిపోయారు. దీంతో వార్డెన్లు, ఇతర నిర్వాహకులు తమ అవినీతి కార్యక్రమాలను ఎంచక్కా కొనసాగిస్తున్నారు. కొందరు తమ వాటాను ఒకరిద్దరు ఏటీడబ్ల్యూవోలకు అందిస్తుండడంతో వారు సైతం కిమ్మనడం లేదు. బాధ్యతగా తనిఖీలు చేయాల్సిన డీడీ, ఏటీడబ్ల్యూలు కనీసం స్థానికంగా నివసించకపోవడం ఆశ్రమ పాఠశాలలకు శాపంగా మారుతోంది. డిప్యూటీ డైరెక్టర్ రోజూ జిల్లాకేంద్రం శ్రీకాకుళం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఏటీడబ్ల్యూ బి.అప్పారావు శ్రీకాకుళం నుంచి, మరొకాయన మెళియాపుట్టి నుంచి వస్తున్నారు. ఇంకో ఏటీడబ్ల్యూ మల్లికార్జున్ పాలకొండ నుంచి విధులకు వెళ్తున్నారు. మరోపక్క వీరితో సంబంధం లేకుండా ఐటీడీఏ పీవో కూడా ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలి. తద్వారా అప్రమత్తత పెంచాలి. కానీ ఇది జరగడం లేదు. పీవో రావడం లేదనే ధైర్యంతో అధికారులు దూరప్రాంతాల నుంచి విధులకు రావడం, తనిఖీలకు డుమ్మా కొట్టడం చేస్తున్నారు. అటు వార్డెన్లు సైతం స్థానికంగా ఉండకుండా వాచ్‌మెన్‌లకు విధులు అప్పగిస్తు రాత్రివేళల్లో మైదాన ప్రాంతాల్లోని నివాసాలకు చేరుకుంటున్నారు. అలాగే ప్రతి రోజు ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారనే విషయం ఫోన్‌ద్వారా డీడీ కార్యాయలానికి సమాచారం పెట్టాలనే నిబంధన విధించినా అదీ అమలుకావడం లేదు. గతంలో దత్తత అధికారులను (సెక్టోరియల్ అధికారులను) నియమించారు. వీరు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆశ్రమ పాఠశాలలో లోపాలను పరిశీలించి పీవోకు నివేదిక అందజేయాల్సి ఉంది. అది కూడా అమలుకు నోచుకోవడం లేదు.



మూలకు చేరిన బయోమెట్రిక్ యంత్రాలు

అడ్డంగా ఉన్నాయని అడ్డు తొలగించేశారు...

ఆశ్రమ పాఠశాలల్లో బోగస్ హాజరు నివారించి అక్రమాలు అరికట్టడానికి గతేడాది ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు యంత్రాలను సరఫరా చేసింది. ఒక్కో పాఠశాలకు ఆరేసి చొప్పున అందించింది. తద్వారా ఉదయం, రాత్రి విద్యార్థులు బయోమెట్రిక్ యంత్రంలో హాజరు నమోదుచేయాలి. మొదట్లో రోజుకు ఎంతమంది విద్యార్థులుంటున్నారు? వారికి ఖర్చయ్యే సరుకులు ఎంత అనేది లెక్కగట్టేవారు. తద్వారా అక్రమాల నివారణకు అడుగులు పడ్డాయి. ఈ యంత్రాల వలన తమ ఆటలు సాగడం లేదనే కారణంతో ఏకంగా వీటిని చాలా మంది పాఠశాలల నిర్వాహకులు, వార్డెన్లు,ఇతర సిబ్బంది కలిపి అడ్డుతొలగించుకునే పథకం పన్నారు. అందులో భాగంగా ఈ యంత్రాలు అసలే మాత్రం పనిచేయడం లేదని పైఅధికారులకు అదేపనిగా ఫిర్యాదులు చేసి.. చివరకు విజయం సాధించారు. మరోపక్క బయోమెట్రిక్ యంత్రాల అడ్డుతొలగించుకున్న వార్డెన్లు, ఇతర సిబ్బంది యథాతథంగా తప్పుడు రికార్డులతో బోగస్ హాజరు చూపిస్తున్నారు. అధికారులు,లేదా ఏసీబీ తనిఖీలకు వస్తే ఒక రికార్డు, తమ కోసం అసలైన తప్పుడు రికార్డులు నిర్వహిస్తున్నారు.

పోస్ట్‌మెట్రిక్‌లోనూ పాపాలే...

జిల్లాలో ఐటీడీఏ పరిధిలో 18 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలున్నాయి. ఇందులో ఇంటర్ తర్వాత డిగ్రీ, ఇతర వృత్తి విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులకు వసతి అవకాశం కల్పిస్తారు. ఇటువంటివి శ్రీకాకుళం, టెక్కలి, సీతంపేట, పాలకొండ, రాజాం, ఎచ్చెర్ల, పాతపట్నం, పలాసలో ఉన్నాయి. సుమారు మూడువేల మంది ఇందులో ఉంటున్నారు. ఇక్కడ కూడా అక్రమాలు అన్నీఇన్నీ కావు. బోగస్ హాజరు అత్యధికశాతం వీటిలో ఉంటున్నాయి. విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లు రికార్డులు చూపించి ఆయా వార్డెన్లు ఏటా లక్షల్లో బొక్కేస్తున్నారు. ఈ విధంగా 18 వసతి గృహాల్లో ఏటా బోగస్ హాజరుతో రూ.80లక్షల వరకు దారిమళ్లుతున్నట్లు అధికారులే వివరిస్తుండడం విశేషం.

ఇటీవల ఈశాఖ డిప్యూటీ డైరెక్టర్ రోజారాణి శ్రీకాకుళం పోస్టుమెట్రిక్ వసతిగృహంలో తనిఖీ చేస్తే కళ్లుబైర్లు కమ్మే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 110 మంది విద్యార్థులు ఉంటున్నారని సదరు వార్డెన్ రికార్డులు చూపించారు. తీరా తక్కువ మందే ఉన్నట్లు తేలడంతో వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. మల్లి ఆశ్రమ పాఠశాలలో 77 మంది విద్యార్థులు లేనప్పటికి ఉన్నట్టు బోగస్ హాజరు వేశారు. వీటిపై డీడీ ఆగ్రహం వ్యక్తం చేసి బోగస్ హాజరుపై హెచ్‌ఎం, వార్డెన్‌లకు సంజాయిషి కోరారు. దీనిపై ఇచ్చిన సంజాయిషి సంతృప్తికరంగా లేకపోవడంతో తిరిగి మరో వివరణ కోరుతూ లేఖ రాశారు. అటు ముత్యాలు, శంభాం ఆశ్రమ పాఠశాలలను కూడా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇక్కడ కూడా బోగస్ హాజరు ఉన్నట్టు గుర్తించారు.

ఇదే విషయంపై డీడీ రోజారాణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఏ ఆశ్రమ పాఠశాలకు వెళ్లినా బోగస్ హాజరు బయటపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల రికార్డుల నిర్వహణలో లోపాలున్నాయని అంగీకరిం చారు. బోగస్ హాజరు సైతం అధికంగా ఉందని, అక్రమాలను గుర్తించి.. చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రంథాలయాలకు గ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నా ఆయా పంచాయతీలు, నగరపంచాయతీలు, మున్సిపాలిటీలు సెస్ మాత్రం గ్రంథాలయ సంస్థకు కట్టకపోవడంతో గుదిబండగా మారింది. జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు ఇప్పటివరకూ సెస్ రూపేణా రూ.3కోట్ల మేరకు రావాల్సి ఉంది. దీంతో తాము ఇక గ్రంథాలయాలను నిర్వహించలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు.

జిల్లాలో సుమారు 45 గ్రంథాలయాల సంస్థ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 60శాతానికిపైగా సొంత భవనాలు ఉండగా, మిగిలినవి అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలతోపాటు పాఠకులకు కావాల్సిన విజ్ఞాన భాండాగారమంతా ఈ కార్యాలయాల్లో లభిస్తోంది. పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి వచ్చే సెస్ ద్వారా వీటి నిర్వహణ చేపట్టాలి. గ్రంథాలయాధికారులకు జీతభత్యాలు, పుస్తకాల నిర్వహణ, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలన్నీ అందులో నుంచే సమకూర్చుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి గ్రంథాలయ సంస్థలకు ఎటువంటి నిధులు లేకపోవడంతో వసూలు చేసే సెస్ పైనే ఆధారపడాల్సి వస్తోంది. సెస్‌లు సక్రమంగా వసూలు కాకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణ కష్టమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. గ్రంథాలయ సంస్థలను బలోపేతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వం చైర్మన్లను నియమించి వారికి అన్నీ అధికారాలను కట్టబెట్టింది. నిధుల వ్యవహారంలో ఆయా సంస్థలకే బాధ్యతలు అప్పగించడంతో వారు సైతం చేతులెత్తేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలకు సెస్‌ల ద్వారా రూ.200కోట్ల వరకూ రావాల్సి ఉందని అంచనా. జిల్లాకు సంబంధించి.. రూ.3కోట్ల మేర వసూలు చేయాల్సి ఉంది. ఇంత భారీ మొత్తంలో సెస్‌లు వసూలు కాకపోవడంతో గ్రంథాలయాలు ఏ విధంగా నిర్వహించగలమని సాక్షాత్తు గ్రంథాలయ సంస్థ అధికారులే చెబుతున్నారు. వీటిని బలోపేతం చేయాలంటే ప్రభుత్వం గ్రంథాలయ సంస్థలకు సెస్‌లతో సంబంధం లేకుండా ప్రత్యేకనిధులు కేటాయించాలని అభిప్రాయపడుతున్నారు.

ఈ విషయమై.. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా జిల్లాలో రూ.3కోట్ల మేరకు బకాయిలు ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. 'గతంలో రూ.50లక్షలకు మించి సెస్ వసూలయ్యేదికాదు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూ.1.32కోట్లు వసూలు చేశాం. మిగిలిన బకాయిలు వసూలు చేయడానికి ఇటీవలే జాయింట్ కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించాం. జిల్లాలో అన్నీ పంచాయతీ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు సెస్ విషయంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. గడువులోగా సెస్‌ను వసూలు చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నా'మని తెలిపారు.

బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య

(మొదటి పేజీ తరువాయి)

చుట్టాయి. ఇందులో భాగంగా ఈనెల 23న శ్రీకాకుళంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. ఉదయం 9.30నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 6 నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని.. మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయవచ్చు. బహుమతులు అందుకోవచ్చు. చిన్నారులు తమతో పాటు పాత వాటర్ బాటిల్‌ను, పాత వస్త్రాన్ని తీసుకురావాలి. రిజిస్ట్రేషన్ కోసం 9985411066 నంబర్‌కు సంప్రదించాలి. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎటువంటి ప్రవేశరుసుమూ చెల్లించనవసరం లేదు. ఈ కార్యక్రమానికి వసతి సౌకర్యాన్ని శ్రీసాయి డిగ్రీ కళాశాల చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు సమకూరుస్తున్నారు.

టంగ్ ట్విస్టర్స్

1. Farrell's features fablous food 'n' fantastic fountain fantasies for frolicking, fun-filled festive families.
2. Thomas Tattamus took two T's to tie two tots to two tall trees.
3. The Final Fixing of the Foolish Fugitive

సూక్తి

మానవుడు ఎంత గొప్పవాడు అయితే.. అంత కఠినమైన పరీక్షలు దాటవలసి ఉంటుంది.

నవ్వుల్ నవ్వుల్

సాంబా : వాస్తు తెలిసిన డాక్టరు దగ్గరకు వెళ్లడం తప్పైపోయింది.

లింగం : ఏమన్నాడేంటి?

సాంబా : వాస్తు బాగాలేదు. గుండె వేరే ప్రదేశానికి మార్చమంటున్నాడు.

లింగం : !!!!!!!!

ముళ్లతో ఉండే గులాబీలు ఎవరికి ఏ హానీ చేయవు.. బురదలో పుట్టే కమలం సుగంధ పరిమళాల్నే వెదజల్లుతుంది. కానీ విషపూరితమైన పువ్వులను, చెట్లను చూశారా? ఆ చెట్లను ముట్టుకున్నా, వాటి గాలి పీల్చినా ప్రాణాలు పోవాల్సిందే. అలాంటి విష పూరిత చెట్లతో ఇంగ్లాండ్‌లో 'పాయిజన్' అనే ఓ పూదోట ఉంది. ఆ విశేషాలు..



పాయిజన్ ప్లాంట్స్

పాయిజన్ గార్డెన్‌లోని రకరకాల రంగు రంగుల పూలు ఇంగ్లాండ్ వాసుల్ని రారమ్మని స్వాగతం పలుకుతాయి. కానీ ఆ పూదోట గేటుపై 'ఈ చెట్లు మిమ్మల్ని చంపేస్తాయి' అని రాసుంటుంది. అంతేకాదు గేటు దాటి లోపలికి అడుగు పెట్టగానే 'ఈ పూలను తుంచకూడదు, ముట్టుకోకూడదు, ఇక్కడి గాలి కూడా పీల్చకూడదు. పిల్లలు ఈ చెట్లకు వీలైనంత దూరంగా ఉండాలి' అంటూ పుర్రె గుర్తుతో ఉన్న ఓ బోర్డు ' డేంజర్ ' అంటూ మిమ్మల్ని హెచ్చరిస్తుంది. ఈ పాయిజన్ గార్డెన్‌లో అనేక ఆకర్షణలున్నాయి. ట్రీ హౌస్,



అందమైన ఫౌంటెయిన్లు, గులాబీ, టోపీరియ పూల వనాలు అందరిని ఆకట్టుకుంటాయి. పూదోట మధ్యలో ఉండే వాటర్ కాస్కేడ్ మరో ప్రధాన ఆకర్షణ. ప్రతి సంవత్సరం వేలాది మంది సందర్శకులు ఈ పూదోటను చూడటానికి వస్తుంటారు.

మొక్కలయందు విషపు మొక్కలు వేరు..

దాదాపు 100 విషపూరిత మొక్కలు ఈ పూదోటలో ఉన్నాయి. ఈ మొక్కలున్న చోట ప్రమాద హెచ్చరిక బోర్డుతో పాటు వాటి చుట్టూ కంచె ఉంటుంది. వీటి గురించి వివరాలు తెలపడానికి గైడ్లు ఉంటారు. ఈ విషపూరిత మొక్కలపై పరిశోధనలు కూడా చేస్తుంటారు. వీటిని మెడిసిన్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ విషపూరిత మొక్కల గురించి తెలియజేసే పుస్తకాలు ఈ పూదోటలోని బుక్ షాప్‌లో లభిస్తాయి.

ప్రకృతిలో నడక

పూదోటలో వుడ్‌ల్యాండ్ వాక్ బాగుంటుంది. అందమైన ప్రకృతి సాక్షిగా వేవేల వర్ణాల పువ్వుల మధ్యలో వెళ్లడం ఓ మధురానుభూతి. ఈ దారిలోనే ట్రీ హౌస్ ఉంటుంది. ఇది సందర్శకులను ప్రధానంగా ఆకర్షిస్తుంది. చెట్లపై ఉండే ఈ ట్రీహౌస్‌లో ఓ రెస్టారెంట్ ఉంటుంది. చవులూరించే స్థానిక ఆహార పదార్థాలెన్నో ఉంటాయి.





పువ్వుల్లో దాగున్న...

అక్విల్జియా : ఈ మొక్క వేర్లు, విత్తనాలు చాలా విషపూరితమైనవి.

అట్రోపా బెల్లడోన : ఈ మొక్క మరింత విషపూరితమైనది. ఇది చాలా ప్రమాదకరమైన మొక్క. దీని వాసన పీల్చడం వల్ల శ్వాసలో ఇబ్బందులు వస్తాయి. అంతేకాదు హృదయం వేగంగా కొట్టుకుంటుంది.

బ్రగ్స్‌మాన్సియా, డిజిటాలిస్, రిసినస్ కొమ్యునిస్, నక్స్ వొమిక, హెమ్‌లాక్ వంటి మొక్కలు కూడా ప్రమాదకరమైనవే.


పదాలు కనుక్కోండి

w	f	a	k	o	i	x	h	p	k
a	i	b	r	e	l	l	i	m	f
r	z	s	p	i	n	n	i	n	g
t	r	i	c	k	d	l	o	g	q
s	k	s	d	f	p	o	t	k	h

gold
straw
miller
trick
spinning



బొమ్మ గీయండి




జంతర్‌మంతర్


1. సఆక్తి ►
2. డిరాబ ►
3. వియంష ►
4. క్కువఎ ►

జంబ్లింగ్ వర్డ్స్


1. HNTU ►
2. MBOB ►
3. WODO ►
4. DETI ►



దారి కనుక్కోండి



ఔనా!



వాహనాలకు సరైన పార్కింగ్ దొరకాలని అమెరికాలో 7 శాతం మంది ప్రార్థన చేస్తారు.

చెప్పగలరా?

విరిలో ఉన్నా
కానీ పురిలో లేను

లుప్తంలో ఉన్నా
కానీ గుప్తంలో లేను

వరిలో ఉన్నా
కానీ గిరిలో లేను

అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా? : విలువ

జంతర్‌మంతర్
1. ఆసక్తి 2. రాబడి
3. విషయం 4. ఎక్కువ

జంబ్లింగ్ వర్డ్స్ :
1.HUNT 2.BOMB
3.WOOD 4.TIDE

మీకు తెలుసా?



తేనె తిన్న తర్వాత కేవలం 20 నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోతుంది.

మరుగుదొడ్ల సర్వే వేగవంతం

● మండల అధికారులకు కలెక్టర్ ధనంజయరెడ్డి ఆదేశం

కలెక్టరేట్ : మరుగుదొడ్ల వివరాల సేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.ధనంజయరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 సామాజిక సర్వే ప్రకారం జిల్లాలో 2.50 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. 26నాటికి మండలాల వారీ పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు. గతంలో ఉపాధిహామీ, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా కొన్ని మరుగుదొడ్లు నిర్మించామని, అధికారులు పంచాయతీల్లో సర్వే నిర్వహించి వివరాలు తెలియజేయాలన్నారు. పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా నిర్మించిన మరుగుదొడ్ల జాబితాను కూడా తయారు చేయాలన్నారు.

40 వేల మ రుగుదొడ్లను ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేసినప్పటికీ, నిర్మాణాలు ప్రారంభించనందున వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మరుగుదొడ్ల వివరాల సేకరణలో ఎల్ఎన్ పేట, ఆమదాలవలస, భామిని, హిరమండలం, పాలకొండ, ఎచ్చెర్ల, వంగర మండలాలు వెనుకబడి ఉన్నాయని, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

● పనితీరుపైనే అవార్డులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమల్లో ప్రతిభ కనబరిచిన అధికారులకే రిపబ్లిక్‌డే సందర్భంగా అవార్డులు అందించామని చెప్పారు. ఉపాధి హామీ అనుసంధానంతో చేపట్టే పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతీ పైసా ఖర్చు చేసేవిధంగా చూడాలన్నారు.

● రుణ లబ్ధిదారుల ఎంపిక అక్టోబర్ 10కి పూర్తిచేయాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే రాయితీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక అక్టోబర్ 10 నాటికి పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. మండల కమిటీ ఎంపిక జాబితాను 72 గంటల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం బ్యాంక్ అధికారులు రుణం మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ కేవీఎన్ చక్రధర్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ కిషోర్ కుమార్, డ్వామా పీడీ హెచ్.కూర్మారావు, జడ్పీ సీఈవో బి.నగేష్, సాక్షరభారత్ ఉపసంచాలకులు జి.కృష్ణారావు, మార్కెటింగ్ శాఖ ఏడీ వై.శ్యాంకుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కేఎస్ ధనుంజయరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ధనంజయరెడ్డి

ఉపాధి పనులు సకాలంలో పూర్తి చేయకుంటే చర్యలు

● అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ధనంజయరెడ్డి

కలెక్టరేట్ : గ్రామాల్లో ఉపాధి పనులు సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ కె.ధనంజయరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులు సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాలు, గ్రామీణ రహదారులు, గృహనిర్మాణం తదితర పనులు త్వరితగా పూర్తి చేయాలన్నారు. నిధులు శతశాతం ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణకు కేటాయించిన రూ.24.88కోట్లు డిసెంబరు నెలాఖరు నాటికి వినియోగించాలన్నారు. గృహాల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేటట్టు చూడాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా రూపొందించాలని కోరారు. డయల్ యువర్ కలెక్టర్, గ్రీవెన్స్ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జీసీ కిషోర్‌కుమార్, డ్వామా పీడీ హెచ్.కూర్మారావు, జడ్పీ సీఈవో బి.నగేష్, వ్యవసాయ శాఖ జేడీ జి.రామారావు, సాక్షరభారత్ ఉపసంచాలకులు కృష్ణారావు, జిల్లా పంచాయతీ అధికారి బి.కోటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ కె.లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలకు జీఎంఆర్ విద్యార్థి



విజయకుమార్

రాజాంరూరల్: చెన్నైలో ఈ నెల 22 నుంచి 26వరకు జరగనున్న 9వ సౌత్‌జోన్ రైఫిల్ సూటింగ్ పోటీలకు జీఎంఆర్ఐటీ నుంచి వీటీవీఎస్ఎన్ విజయకుమార్ ఎంపికైనట్టు పీడీ అరుణకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తరపున ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఈ పోటీలకు ఎంపిక చేశారన్నారు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రాజామురుగుదాస్, స్టూడెంట్ కోఆర్డినేటర్ శశికుమార్, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

'ఆఫ్‌షోర్'కు నిధుల వెల్లువ

-అదనపు స్టక్చర్లకు రూ.14.08కోట్లు మంజూరు
-వరద కాలువలో భారీ రాళ్ల పేల్చివేతకు రూ.3.26కోట్లు
-ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, శ్రీకాకుళం)

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ఒక్కో సమస్య పరిష్కారం దిశగా కదులుతోంది. మహేంద్రతనయ నదిపై మెళియాపుట్టి మండలంలోని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణం ద్వారా మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం, పలాస మండలాలకు సంబంధించి 24,600 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించడానికి నిర్మిస్తోన్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ఇప్పటికీ నత్తనడక నడుస్తోంది. దీని నిర్మాణం పూర్తికి వచ్చే ఏడాదికి ప్రభుత్వం గడువు విధించింది. అయితే ఇప్పుడు ప్రాజెక్టు పనులకు అడ్డంకిగా ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపుతోంది. అందులోభాగంగా ప్రాజెక్టుకు ప్రతిపాదిత 27స్ట్రక్చర్లకు సంబంధించి కొన్ని విలువల మార్పు జరిగినందున అదనపు నిధులు విడుదల చేయాలని కంపెనీతోపాటు, ఉత్తరాంధ్ర జల వనరుల శాఖ సీఈ ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రూ.14.08 కోట్లను మంజూరు చేస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 13.65 కిలోమీటర్ల మేర నిర్మిస్తోన్న వరద కాలువకు సంబంధించి పలుచోట్ల పెద్ద ఎత్తున రాళ్లు పడ్డాయి. వీటిని పేల్చడానికి అదనపు నిధులు అవసరమని అధికారులు కోరగా, ఈమేరకు సోమవారం రూ.3.26 కోట్లు విడుదల చేసింది. ఇదిలాఉంటే ఈనెల 10న ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.98 లక్షలు మంజూ రు చేసింది. సిమెంట్ ధరలు పెరిగినందున ఆ మేరకు నిధులు విడుదల చేస్తున్నట్టు పేర్కొంది.

క్రికెట్‌లో సిక్కోలుపై అనంతపురం విజయం

నరసరావుపేట టౌన్ : గుంటూరు జిల్లాలోని నరసరావుపేట ఆంధ్రా పబ్లిక్ స్కూల్ ఆవరణలోని ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న అండర్ - 16 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలలో అనంతపురం జట్టు ఇన్నింగ్స్ 170 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. రెండో ఇన్నింగ్స్ సోమవారం ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 102 పరుగులకే ఆల్ అవుట్ అయింది. దీంతో అనంతపురం జిల్లా జట్టు భారీ విజయం సాధించింది. అనంతపురం జట్టుకు బోనస్ పాయింట్లు కలుపుకొని ఏడు పాయింట్లు సాధించింది. పోటీలను అండర్ - 16 స్టేట్ సెలెక్టర్ కె.కృష్ణమోహన్, జిల్లా సెలెక్టర్ టి.అమరనాథ్, సీతాపతిరావు, ఏసీఏ కోచ్ ఈ కృష్ణ, కో-ఆర్డినేటర్ కేవీ పురుషోత్తమరావు పర్యవేక్షించారు.

వంశధార పూర్తి చేయాల్సిందే

● జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, శ్రీకాకుళం)

వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జనవరి 5 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి తీరాల్సిందే నని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ఉత్తరాంధ్ర జల వనరుల శాఖ సీఈ, ఇతర నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టు పనులు ఏవిధంగా జరుగుతున్నాయని అడిగారు. అధికారులు సమాధానమిస్తూ ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయని, గడువులోగా పనులు ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అటు నిర్వాసితులకు ఏవిధంగా న్యాయం చేస్తున్నామనేదానిపైనా వివరించారు. జేసీ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహిస్తూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఆర్అండ్ఆర్ కాలనీల్లో కూడా యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయన్నారు. పునరావాస కాలనీల్లో అదనపు సౌకర్యాల కల్పనపైనా చర్చించారు. ఆర్అండ్ఆర్‌కు సంబంధించి రూ.2కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, తక్షణం విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత చంద్రబాబు మాట్లాడుతూ గడువులోగా ఈసారి ప్రాజెక్టు పూర్తి చేయాలని, జాగ్రత్తగా వ్యవహరించి పనుల్లో వేగంగా పెంచాలని సూచించారు.

ఆసక్తికరంగా గిరి ఒలింపిక్ పోటీలు



పరుగుపందెం పోటీకి సిద్ధంగా ఉన్న విద్యార్థులు

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గిరి ఒలింపిక్ పోటీలు సోమవారం ఆసక్తికరంగా సాగాయి. 27 పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు వివిధ అంశాల్లో పోటీ పడ్డారు. సీనియర్ వాలీబాల్ విభాగంలో దోనుబాయి ఆశ్రమపాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. కబడ్డీలో చినబగ్గ ఆశ్రమపాఠశాల, ఖోఖోలో మల్లి ఆశ్రమపాఠశాల, షటిల్‌లో దోనుబాయి, అర్చరీలో మల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. 100 మీటర్ల పరుగుపందెంలో ఎస్.సురేష్, ఎ.డానియల్, ఎం.సాయిలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. 800 మీటర్ల పరుగుపందెంలో బి.సంతోష్, బి.ఎలియా, సూరన్ని ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో ఎస్.మల్లేష్, ఎం.వంశీ, ఎ.సురేష్, షార్ట్‌పుట్‌లో కె.బాలరాజు, ఎస్.బాలరాజు, డి.మోజేష్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. జూనియర్ వాలీబాల్ విభాగంలో సీతంపేట ఆశ్రమపాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. కబడ్డీలో చినబగ్గ ఆశ్రమపాఠశాల, ఖోఖోలో మల్లి ఆశ్రమ పాఠశాల, షటిల్‌లో సీతంపేట, అర్చరీలో మల్లి ఆశ్రమపాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. 100 మీటర్ల పరుగుపందెంలో సలీం, ఎస్.నల్లయ్య, ఎస్.శ్రీను ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. 800 మీటర్ల పరుగుపందెంలో ఎస్.ఇమానియల్, ఢిల్లేశ్వరి, నల్లయ్యలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో ఎస్.సలీం, కామేష్, ఎస్.శ్రీను షార్ట్‌పుట్‌లో ఎస్.నీలయ్య, ఎం.రాజు, ఎస్.సలీంలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు.

బాలికల సీనియర్ విభాగంలో..

వాలీబాల్‌లో సీతంపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు విజయం సాధించారు. కబడ్డీలో సీతంపేట ఆశ్రమ పాఠశాల, ఖోఖోలో హడ్డుబంగి ఆశ్రమపాఠశాల, షటిల్‌లో పూతికవలస, అర్చరీలో సీతంపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు విజయం సాధించారు. 100 మీటర్ల పరుగుపందెంలో మౌనిక, సునీత, ఎస్మా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 400 మీటర్ల పరుగుపందెంలో ఎ.శాంతి, శిరీష, ప్రశాంతి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. జూనియర్ వాలీబాల్ విభాగంలో సీతంపేట ఆశ్రమపాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. కబడ్డీలో పూతికవలస ఆశ్రమ పాఠశాల, ఖోఖోలో హడ్డుబంగి ఆశ్రమపాఠశాల, షటిల్‌లో హడ్డుబంగి, అర్చరీలో సీతంపేట ఆశ్రమపాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. 100 మీటర్ల పరుగుపందెంలో ఎ.శాంతి, బి.అనసూయ, ఎస్.భారతి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. 400 మీటర్ల పరుగుపందెంలో ఎ.శాంతి, కె.శిరీష, ఎస్.ప్రశాంతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. లాంగ్ జంప్‌లో కె.సుశీల, కె.శౌరి, ఎస్.శాంతి, షార్ట్‌పుట్‌లో ఎ.కావ్య, శిరీష, కె.సుశీల ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. ఈ పోటీలను ఏటీడబ్ల్యూవో మల్లిఖార్జునరావు, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహన్‌రావు, పీడీలు వి.అరుణ్‌భాస్కరరావు, మంతిన వాసుదేవాచారి, మల్లిక, వెంకటరావు, హెచ్ఎం కె.సుబ్బారావు పర్యవేక్షించారు.

23,24 తేదీల్లో రుణమేళా పత్రాల పరిశీలన

ఆమదాలవలస రూరల్ : ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న రుణాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.ఎ.హబీబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న బీసీ, కాపు, 24న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీలలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యతో పాటు పరిశుభ్రత నేర్పాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గీత

ఆమదాలవలస : పాఠశాలలో విద్యతో పాటు పరిశుభ్రత కూడా నేర్పాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణ పరిధిలోని 5వవార్డు పంతులపేట ప్రాథమిక పాఠశాల స్వచ్ఛభారత్ మిషన్‌లో ఉత్తమ పాఠశాలగా ఎంపికకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చిన్నారులకు పరిశుభ్రత అంశాలను వివరిస్తే భవిష్యత్‌లో సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీ ప్రపంచంలో పోటీతత్వం పెరిగి విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సమాజాభివృద్ధికి అనుకూలించే అంశాలను బోధించేలా గురువులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, తమ్మినేని విద్యాసాగర్, కౌన్సిలర్ చెంచెల భారతి, చెంచెల భాస్కరరావు, తంగి గురయ్య, వి.మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల కార్యవర్గ సంఘ ఎన్నికలు

సరుబుజ్జిలి : మండలంలో గల 21 పంచాయతీల గ్రామ రెవెన్యూ సహాయకులతో సోమవారం మండల తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో కార్యవర్గ సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశంలో సరుబుజ్జిలి మండలానికి సంబంధించిన 35 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు హాజరై సంఘ అధ్యక్షుని కొరకు సహాయకులు అందరూ చర్చించి, వారి ఆమోదంతో నూతన సంఘ అధ్యక్షుడిగా యండ మోహనరావును ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. ఉప అధ్యక్షుడుగా యజ్జల బోడెయ్యను, కార్యదర్శిగా చింతాడ రామరాజు, ఉప కార్యదర్శిగా పుచ్చ మల్లేశ్వరరావును, కోశాదికారిగా పుచ్చ రాంబాబు ఎన్నికోవడం జరిగిందని మండల గ్రామ రెవెన్యూ సహాయకులు తెలియ జేసారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



హెచ్‌ఎంలకు ప్లేట్లు అందిస్తున్న ఎంఈవో

పొందూరు: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆర్‌వీఎం ద్వారా విద్యార్థులకు స్టీలు ప్లేట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ ఆర్. రామ్మోహనరావు తెలిపారు. సోమవారం ప్రభుత్వ పాఠశాలలకు ఎంఆర్‌సీ కార్యాలయంలో ఈ ప్లేట్లను అందించారు. 2016లో జిల్లాను కేంద్ర ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించినందున విద్యార్థులకు ఎండీఎం ప్లేట్లను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వీటిని అందజేయాలని హెచ్‌ఎంలకు ఆయన తెలిపారు.

బూర్జ: కె.కె.రాజపురం ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు సోమవారం భోజనప్లేట్లు అందజేశారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు స్నేహితుడు ముంబయికి చెందిన డి.శిరీష సమకూర్చిన ఈ ప్లేట్లను హెచ్‌ఎం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూఎన్ ఉమెన్ కార్యక్రమానికి సిద్ధం కండి

పొందూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే యూఎన్ ఉమెన్ కార్యక్రమానికి మండలం నుంచి అధికారులు సిద్ధం కావాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం చెప్పారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మాట్లాడారు. నియోజక వర్గ స్థాయిలో నిర్వహించే యూఎన్ ఉమెన్ కార్యక్రమానికి మండలం నుంచి మహిళా అధికారులు పాల్గొనాలని సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, సీడీపీఓ రాధామాదవి, కింతలి వైద్యాదికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించేదెప్పుడో..!

● మున్సిపాల్టీలో నిండుకున్న కాలువలు ● పట్టించుకోని అధికారులు



రోడ్డుపైనే నిల్వ ఉన్న మట్టి దిబ్బలు

ఆమదాలవలస : పురపాలకసంఘంలో కాలువలలో పూడికలు తొలగించకపోవడంతో మురుగునీటి కాలువలన్నీ చెత్తాచెదారంతో నిండుకున్నాయి. వర్షాకాలంలో పూర్తిస్థాయిలో కాలువలు పూడికలు తొలగించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కాలువలలో చెత్తనిల్వలు పేరుకుపోయాయి. దీంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాగా అధికారులు పూడికలు ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పారిశుధ్య సిబ్బంది తూతూ మంత్రంగా పూడికలు తొలగించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తగినంత సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బంది పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. మెట్టక్కివలస, సంతోషిమాత గుడి సమీపంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. అలాగే కుసుమంచివారి వీధి, డాబాలవారి వీధులలో పారిశుధ్య లోపం తలెత్తింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఒక్క దోమలపై సమరం అంటున్న అధికారులు మురికి కాలువలు పూడికలు తొలగించే విషయం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలలో పూడికలు తొలగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మెట్టక్కివలసలో కాలువల దుస్థితి



సంతోషిమాత గుడి వద్ద నిండుకున్న మురికి కాలువ

మహరాజా మార్కెట్ వ్యాపారుల్లో ఆందోళన

● స్థలాలు విక్రయించేందుకు రాజవంశీకుల నిర్ణయం ● చేతులు మారుతున్న స్థలాలు ● వ్యాపారులు మల్లగుల్లాలు

పొందూరు: స్థానిక మహరాజా మార్కెట్ వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. దశాబ్దాలుగా విజయనగరం మహరాజులకు చెందిన ఈ స్థలంలో వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ స్థలంపై సంపూర్ణ హక్కులు రాజవంశీకులదే. అయితే ఈ మార్కెట్‌లో ఖాళీస్థలంలో వ్యాపారం సాగించడమేకాని ఎటువంటి నిర్మాణాలు చేయరాదు. అయితే మూడేళ్లకొకసారి మార్కెట్‌ను దివానులకు ఆసీలు వసూలు ఇచ్చే వారు. వీరు మార్కెట్‌లో ఖాళీస్థలాల్లో చిరు వ్యాపారులనుంచి, తాత్కాలిక దుకాణాలు నిర్మించుకున్న వారినుంచి, రోజువారి, వారంకొకసారి వసూలు చేయడం ఆనవాయితీ. ఇటీవల మార్కెట్‌లో మహరాజా వంశీకులకు, దివానులనుంచి ఎటువంటి అనుమతులు రాలేదు. శాశ్వత భవనాలు నిర్మిస్తున్నారని, దుకాణాలు సైతం భారీ ధరలకు చేతులు మారుతున్నాయని ఆరోపణలున్నాయి. ఆసీలు వసూలుదారులకు రూ. లక్షల్లో దుకాణదారులు ముట్టచెబుతున్నారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో మహరాజా వంశీకులు రహస్యంగా విచారణ చేపట్టారు. ఈ విచారణలో వాస్తవాలు బయట పడడంతో తాము ఆశించినది జరగడం లేదని నిర్ధారణకు రాజ వంశీకులు వచ్చారు. దీంతో మార్కెట్‌ను, దుకాణాలను విక్రయించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈమేరకు తరచుగా దివానులు, మహరాజా సంస్థానం ఉద్యోగులు మార్కెట్‌పై సర్వే జరిపారు. ఇటీవల కేంద్రమంత్రి, మహరాజ వంశీకుడు అశోకగజపతి రాజు కుమార్తె, సోదరి మార్కెట్‌ను పరిశీలించారు. ఈసందర్భంలో కొంతమంది వ్యాపారులు స్థలాలను, దుకాణాలను భారీ ధరకు అడగడం వారిని విస్మయానికి గురిచే సింది. ఇక్కడ ఇంత ధర ఉందని వారికి తెలియదని వారు బహిరంగా పేర్కొన్నారు. దుకాణాలను ఉన్న వారికే వారు సూచించిన ధరకు తీసుకుంటే వారికే ఇవ్వడానికి వారు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

ఖాళీ స్థలాన్ని బహిరంగ వే లంలో విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు స మాచారం. దీంతో మార్కెట్‌లో దుకాణదారుల్లో ఆం దోళన ప్రారంభమైంది. ఇప్పటికే చాలా దుకాణాలు భారీ ధరలకు ఒకరినుంచి వేరొకరికి చేతులు మారా యి. వీరి పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటికే భారీ ధరకు తీసుకున్న దుకాణాన్ని మళ్లీ సం స్థానానికి మరోమారు సొమ్ము చెల్లించాల్సి వస్తుండం తో వారికి కష్టంగా అనిపిస్తోంది. అయితే మరి కొం దరు మాత్రం మార్కెట్ స్థలాన్ని విక్రయిస్తే మంచి దని అభిప్రాయ పడుతున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సర్వశిక్ష అభియాన్ కమిటీ

బూర్జ: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సర్వశిక్ష అభియాన్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. సైన్స్, గణిత పండిట్‌లు విద్యార్థులకు ఏయే రంగాల్లో ఆసక్తి ఉందో గమనించి ఆ విధంగా బోధన చేపట్టాలన్నారు. విద్యాబోధన చేసే సమయంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. వివిధ రకాల పాఠాలకు సంబంధించిన టీచింగ్ మెటీరియల్‌ను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఐ.వెంకటరావు, ఎస్జీటీ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి



మిలియన్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బూర్జ: రాష్ట్రస్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సమస్యల పరిష్కారానికి విజయవాడలో సెప్టెంబర్ 1న చేపడుతున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గురుగుబిల్లి భాస్కరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిలియన్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్క రించి మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఈవిధానాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పాత విధానాన్ని కొనసాగించేందుకు మార్చ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి అందరూ హాజరై విజ యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రబాబు, అమర్‌నాథ్, మోహన్ కృష్ణచౌదరి, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలి


గుడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

కొండములగాం (రణస్థలం): చిన్నారులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని ఎంఈవో త్రినాధరావు అన్నారు. సోమవారం కొండములగాం ఎంపీపీ స్కూల్, రణస్థలం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పప్పు, కూరగాయలు, గుడ్డు అందివ్వాలన్నారు. పెండింగ్ బిల్లులు త్వరలో వచ్చేస్తాయన్నారు. భోజనాన్ని ప్రతిరోజూ పరిశీలించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

రణస్థలం: మత్స్యకారుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనను చూసి మత్స్యకార నాయకుడు మైలపల్లి వెంకటేష్ టీడీపీలోకి చేరడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీకి నూకలు చెల్లాయని అన్నారు.

అగ్ని ప్రమదాలపై అవగాహన ఉండాలి


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోష్ట (రణస్థలం): అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ఎస్ఎఫ్‌వో కె.అన్నాజీరావు విద్యార్థులకు వివరించారు. సోమవారం కోష్ట నారాయణ స్కూల్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగహన కల్పించారు. గ్యాస్ వినియోగించినపుడు మంటలు రేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంధన ప్రమాదాలు జరిగినపుడు సీవోటు, డీసీపీని ఏవిధంగా వినియోగించాలో వివరించారు. ఫూమ్ ద్వారా మంటలు ఎలా అదుపు చేయాలో చెప్పారు. డి.రవికుమార్, ఎ.సత్యనారాయణ, వై.ఉమామహేశ్వరావు, పి.రమేష్‌కుమార్, కె.నారాయణరావు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు


పరిశీలిస్తున్న ఎస్ఐ రామచంద్రరావు

ఎచ్చెర్ల: జాతీయ రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా జాతీయ రహదారుల విభాగం ఆధ్వర్యంలో వాటిని తొలగించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ రామచంద్రరావు సోమవారం పరిశీలించారు.

ఆటపాటలతో విద్య నేర్పాలి


టెలికాన్ఫరెన్స్‌కు హాజరైన ఉపాధ్యాయులు

రణస్థలం: విద్యార్థులకు ఆటపాటలతో విద్యను అందించాలని ఎంఈవో త్రినాధరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో జాతీయ అభివృద్ధి గననపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలుగు, గణితం, పరిసరాలవిజ్ఞానం పై పొందిన శిక్షణలో విద్యార్థులకు మెలకువలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బండిపాలేం పాఠశాల

రణస్థలం: మండలంలోని బండిపాలేం పాఠశాల శిథిలావస్థలో ఉందని, ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నట్టు ఉపాధ్యాయులు శంకరరావు, రామారావు ఎంఈవో త్రినాధరావు దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పటికప్పుడు పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయని, వర్షాకాలంలో భవనం పూర్తిగా కారిపోతోందని తలిపారు. అదనపు భవనం మంజూరు చేయాలని కోరారు.

ప్రారంభించి రెండేళ్లు... రోడ్డుకి ఇంకెన్నాళ్లు?

(ఎచ్చెర్ల)

సుమారు పదిహేను గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డు అది. ఎచ్చెర్ల, పొందూరు మండలాలను కలుపుతున్న అత్యంత ప్రధాన రహదారి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు శంకుస్థాపన జరిగి రెండేళ్లు అయినా నేటికీ పూర్తికాని పరిస్థితి నెలకొంది. సాక్షాత్తూ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు శంకుస్థాపన చేసిన ఈ రోడ్డు పనులు పూర్తి చేయడానికి ఇంకెన్నాళ్లు కావాలని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులు ఇక్కడి ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. కేశవరావుపేట పంచాయతీ కింతలి మిల్లు జంక్షన్ నుంచి ఎస్ఎంపురం, పిల్లలవలస, బురిడి కంచరాం తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు పునరుద్ధరణ పనులను పీఎంసడక్ యోజనా పథకం కింద 6.4 కోట్ల రూపాయలతో చేపట్టారు. 2015 జూన్ 28న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు, జడ్పీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి తదితరులు హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని బ్రహ్మండంగా నిర్వహించారు. గ్రామాలున్న చోట సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఎస్ఎంపురం గ్రామానికి వెళ్లే తోవలో కల్వర్టు నిర్మాణం కూడా పూర్తి చేశారు. గ్రామాలను కలుపుతూ తారు రోడ్డు నిర్మాణం జరగక పోవడంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి అశోక్ (ఫైల్)


కేశవరావుపేట వద్ద రోడ్డు దుస్థితి

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. రోడ్డు పనులు పూర్తి చేయడంలో తాత్సారం చేస్తుండటం పట్ల ప్రజలు నిరసన వ్యక్తంచేస్తున్నారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కావడంలేదని ప్రజలు చెబుతున్నారు.

రెండు నెలల్లో పూర్తి

వర్షాల కారణంగా రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతోంది. వర్షాకాలంలో బీటీ రోడ్డు వేయడం వల్ల ఇబ్బంది తలెత్తుతుంది. రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తిచేస్తాం.

- కృష్ణమూర్తి, జేఈ, పీఆర్ఐ

ఈ గ్రామాలకు ప్రయోజనం

రోడ్డు నిర్మాణం పూర్తైతే కేశవరావుపేట, ఎస్ఎంపురం, బానోజీరావుపేట, ధర్మపురం, పిల్లలవలస, బురిడికంచ రాం, కోటిపల్లి, మజ్జిలపేట తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుంది. రోడ్డు పాడవడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పాలకులు రోడ్డు మంజూరు చేసినప్పటికీ, నిర్మాణ పనులు పూర్తి చేయడంలో కనీస శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సేవా దృక్పథం అలవరచుకోండి

ఎచ్చెర్ల: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవాలని కాల్ అంబులెన్స్ ప్రతినిధి (హైదరాబాద్) హరిప్రియ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో రోడ్డు ప్రమాదాలు, ఆపత్కాల సమయాల్లో విద్యార్థులు అందించాల్సిన సేవలపై ఏపీ ప్రభుత్వం, కాల్ అంబులెన్స్ సంస్థ సంయుక్తంగా సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక యాప్ ద్వారా సేవలను అందించే వీలుందన్నారు. ఈ జిల్లాలో ఈ నెల తొలి వారంలో 48 రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. జాతీయ రహదారిపైనే ప్రమాదాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. వీటిని నివారించడంలో శిక్షణ పొందిన యువత కీలక భూమిక వహించాలన్నారు. యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చిరంజీవులు మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులు తమ సేవలు, కార్యక్రమాల ద్వారా యూనివర్సిటీ పేరును ఇనుమడింపజేయాలన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అనూరాధ మాట్లాడుతూ కాల్ అంబులెన్స్ ద్వారా పొందిన శిక్షణను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జేఎల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. వర్సిటీలోని వివిధ కోర్సుల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు.


మాట్లాడుతున్న కాల్ అంబులెన్స్ ప్రతినిధి హరిప్రియ

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు

రాజాంఅర్బన్: ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనాన్ని విరమించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు ఇస్తోందని సీఐటీయూ రాజాం డివిజన్ కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు తెలిపారు. సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మోదీ ప్రభుత్వం సరళీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేయాలని చూస్తోం దని, ఇందులో భాగంగానే బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడుతోందన్నారు. దీనివల్ల బ్యాంకు ఉద్యోగులు ఇబ్బందులుపడతారన్నారు. బ్యాంకు ఉద్యోగులకు న్యాయం జరిగేలా, ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే బ్యాంకులు ప్రభుత్వరంగంలోనే ఉండాలన్నారు. సమావేశంలో కె.సత్యనారాయణ, శంకరరావు, సత్యారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన అప్రోచ్ రోడ్డుకు భూ సేకరణ

సంతకవిటి: మండలంలోని పోతులజగ్గపేట, బూర్జ మండలం లాబాం గ్రామాల మధ్య నాగావళి నదిపై జరుగుతున్న వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూ సేకరణకు సోమవారం పరిశీలించారు. భూసేకరణ త్వరితగతిన చేపట్టాలని రెవెన్యూ అధికారులను జేసీ చక్రధరబాబు ఆదేశించడంతో సర్వేయర్ భాస్కరరావు, వీఆర్వో రామకృష్ణ వంతెన నిర్మిస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. వంతెన నుంచి పోతులజగ్గపేట వరకు రహదారి నిర్మాణానికి 1.56 ఎకరాలు భూమి అవసరం ఉంటుందని, తొమ్మిది మంది రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఈ మేరకు జెండాలను పాతి రహదారి ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టామని సర్వేయర్ భాస్కరరావు చెప్పారు. స్థలాన్ని పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్ వస్తున్నట్లు ముం దుగా సమాచారం వచ్చిందని తరువాత వాయిదా పడగా వెనుదిరిగారు.

5న అమరావతిలో వీఆర్ఏల దీక్ష

సంతకవిటి: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యల పరిష్కారానికి గాను సెప్టెంబర్ 5న అమరావతిలో దీక్ష చేపడుతున్నా మని, వీఆర్ఏలంతా తరలిరావాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నీలయ్య కోరారు.

విద్యాభివృద్ధికి యాజమాన్యాల కృషి

పైడిభీమవరం (రణస్థలం): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారి విద్యాభివృద్ధి కోసం స్థానిక పరిశ్రమలు కృషి చేస్తున్నాయని అరబిందో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ పి.గోపాలకృష్ణ అన్నారు. ఇందులో భాగంగా రణస్థలం, పైడిభీమవరం, నారువా హైస్కూల్‌లో చదివిన విద్యార్థులకు ఇటీవల వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. సోమవారం 100 మంది విద్యార్థులకుఅరబిందో యాజమాన్యం రూ.లక్ష ఖర్చుతో కళ్ళద్దాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులనుఅరబిందో యాజమాన్యం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందని , సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా బ్యాగులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీజీఎం సుధాకర్‌రెడ్డి, మేనేజర్ అరుణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పద్మావతి, పాణి, పి.శీరాము పాల్గొన్నారు.



విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

50 శాతం పూర్తయిన ఇంటింటి సర్వే

సారవకోట : మండలంలో ప్రతి ఇంటికి సర్వే చేసి జియోట్యాగింగ్ చేయడంలో 50శాతం వరకు జరిగిందని ఎంపీడీవో ఎం. ఈశ్వరరావు తెలిపారు. సోమవారం సారవకోటలో హౌస్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇళ్ళు పూర్తి కొలతలతో ఆన్‌లైన్ చేస్తున్నారని చెప్పారు. మండలంలో 12,600 ఇళ్లు ఉన్నట్టు గుర్తించామని అన్నారు. ఇప్పటికే అంగూరు, ధర్మలక్ష్మీపురం, అన్నుపురం, మాళువ జమచక్రం గ్రామ పంచాయతీలు సర్వే కార్యక్రమం పూర్తయిందని వివరించారు. పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈయనతో పంచాయతీ కార్యదర్శి ఎ. ప్రభాకరరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక మండల పరిషత్ కా ర్యాలయంలో నిర్వ హించిన గ్రీవెన్స్‌లో పలువురు అర్జీదారులు వినతులు అందజేశారు. జమ్ము గ్రామానికి చెందిన గెడ్డు రాజేశ్వరి వితంతు పింఛన్ మంజూరు చేయాలని ఈవోపీఆర్డీ మధుసూదనరావుకు ఫిర్యాదు చేశారు. మేజర్ పంచాయతీలో మద్యం దుకాణాల వద్ద చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ గొద్దు చిట్టిబాబు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జల్లేపల్లి రామారావు, విద్యుత్ శాఖ ఏఈలు చంద్రమౌళి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రేడియో పాఠాలు

అంబీరుపేట(పోలాకి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'విందాం... నేర్చుకుందాం' పేరుతో నిర్వహించే రేడియో పాఠాల బోధనా కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత అంబీరుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గొద్దు గోవిందరావు విద్యార్థులకు రేడియో పాఠాలను విన్పించారు. సుసరాం, దీర్ఘాశి, ప్రియాగ్రహారం, ఈదులవలస, తలసముద్రం, మగతపాడు, బొద్దాం పాఠశాలల్లో రేడియో పాఠాలు ప్రారంభయ్యాయి.

అంగన్‌వాడీలు పరిశుభ్రంగా ఉంచండి

ప్రియాగ్రహారం(పోలాకి) : అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి కె.సూర్యనారాయణ ఆదేశించారు. సోమవారం మండలంలోని ప్రియాగ్రహారం వన్, టూ, కాకినాడపేట, సంగమయ్యపేట, కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆరోగ్య నియమాలను తెలియచేశారు. అనంతరం దస్త్రాలను పరిశీలించారు. పరిశీలనలో కార్యకర్తలు ఎస్. నాగరత్నం, డి.పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

సుందర పట్టణంగా నరసన్నపేట

నరసన్నపేట: సర్వాంగ సుందర పట్టణంగా నరసన్నపేటను తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నిధులు మంజూరు చేస్తున్నారని సర్పంచ్ గొద్దుచిట్టిబాబు అన్నారు. సోమవారం స్థానిక జ్ఞానజ్యోతి కళాశాల మార్గంలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణానికి సుమారు రూ.4.6కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలతో పాటు జాతీయ రహదారిపై సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ కింజరాపు చిన్నవాడు, టీడీపీ నాయకులు జామి కామేశ్వరరావు, టి. సీతారామరాజు, జి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉరజాంలో సివిల్ రైట్స్‌డే

పోలాకి: మండలంలోని ఉరజాం గ్రామంలో మంగళవారం సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జెన్ని రామారావు సోమవారం తెలియజేశారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. దళితుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం సివిల్ రైట్స్‌డే నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలు మంగమ్మ, పంచాయతీ అధికారి రవికుమార్, ఐసీడీఎస్ ఎస్‌వో జయ, గృహనిర్మాణ ఏఈ రమేష్, ఏపీవో సీతారాం, సబ్ ఇంజినీర్ తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం విజయానికి కీలకం

● రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి మహాలక్ష్మీ

నరసన్నపేట: విద్యార్థులు తమ లక్ష్యసాధనకోసం సానుకూల దృకథం అలవర్చుకోవాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి ఎం. మహాలక్ష్మీ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిరంతర పరిశోధకునిగా ప్రతి విద్యార్థి నిరంతరం మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. తార్కికంగా ఆలోచించే సామర్థ్యం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ విభాగం ప్రతినిధి జయకృష్ణ, భాగ్యశ్రీ, ఢిల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న పంటపొలాలు

● ఆందోళనలో రైతులు



నీట మునిగిన వరిపంట

పోలాకి: గత కొద్దిరోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు పోలాకి ప్రాంతంలో పంటపొలాలు జలంతో నిండుకుని చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు కాలువలు, చెరువుల ద్వారా ప్రవహించి పొలాల మీదుగా వెళ్లడంతో పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. వెదుళ్లవలస, గంటపేట, మొగివిల్లిపేట, ఉరజాం, నర్సాపురం, డోల రోడ్డు, గొల్లలవలస, తోటాడ, సంతలక్ష్మిపురం ప్రాంతాల్లో పంటపొలాలు వర్షం నీటిలో మునిగిపోయాయి. వరినాట్లు వేసే సమయంలో విస్తారంగా వర్షాలు కురవడంతో పంట నాశనమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20వేల ఎకరాల్లో పంట సాగుచేస్తుండగా ఇందులో ఎదలు 8వేల ఎకరాలు మిగతా 12వేల ఎకరాల వరినాట్లు ద్వారా సాగుచేస్తున్నారు. వర్షాలతో వరినాట్లు వేసే పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు లుకలాపు రాంబాబు, మిరియప్పల్లి వెంకటప్పల నాయుడు, రోణంకి సూరన్నాయుడు తాడేల కన్నబాబు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్త సంపద తయారీ కేంద్ర పరిశీలనకు ప్రత్యేక బృందం



నాడెప్ కంపోస్టు పిట్స్ పరిశీలిస్తున్న జిల్లా రిసోర్స్‌పర్సన్ వెంకటరాజు

సారవకోట : మండలం అవలంగి గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించడానికి ఈనెలాఖరుకు ప్రత్యేక బృందం వస్తుందని జిల్లా రిసోర్స్ పర్సన్ పి. వెంకటరాజు తెలిపారు. మండలం అవలంగి ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కేంద్రంలో 18 పేరా మీటర్లు ఉన్నట్లు గుర్తిస్తే ఇక్కడ శిక్షణా కేంద్రాన్ని మంజూరీ చేస్తారని చెప్పారు. ఇప్పటికే అవలంగి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద నాడెప్ యూనిట్లు ఏర్పాటు చేశామని, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందని, మరుగు దొడ్డి నిర్మాణంలో ఉందని అన్నారు. వర్మీ కంపోస్టు యూనిట్లు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పొడిచెత్త, తడి చెత్తను వేరు చేయడానికి కుండీలు నిర్మించామని చెప్పారు. జిల్లాలో పొగిరి, పోలాకి, వీరఘట్టాం, సంతబొమ్మాళి, కొత్తూరు మండలాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పొడి చెత్త అమ్మకాలు ద్వారా లక్ష రూపాయలు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కేంద్రాల్లో 15వేల కేజీల వరకు వర్మీ కంపోస్టు ఎరువు అమ్మకాలకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈయనతో సర్పంచ్ కింజరాపు ధర్మారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంశధార నదికి కర్పూర హారతి

శ్రీముఖలింగం (జలుమూరు): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంవద్ద గల వంశధారనదికి సోమవారం దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులు కర్పూర హారతిని అందించి పూజలు చేశారు. తొలుత వంశధారనదికి సంకల్పం చెప్పి గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించి అనంతరం హారతిని అందించి దీవించారు. ఈ కార్యక్రమంరలో అర్చకులు సంఘం అధ్యక్షుడు పెద్దలింగన్న, అర్చకులు సింహాచలం, శ్రీకృష్ణ, నారాయణమూర్తి, అచ్యుత, అప్పారావు దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు వీఆర్వోలు నియామకం

నరసన్నపేట: దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిన ముగ్గురు వీఆర్వోలకు డీఆర్వో పోస్టింగ్‌లు ఇచ్చారు. బి.శ్యామ్‌కుమార్‌కు మడపాంకు, జమ్ము వీఆర్వోగా టి.లక్ష్మణరావు, సత్యవరంకు డి. రాజేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వారు విధుల్లో చేరినట్లు తహసీల్దార్ జల్లేపల్లి రామారావు చెప్పారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

గంటపేట(పోలాకి) : ఆదివారం రాత్రి గంటపేట గ్రామానికి చెందిన పొల్ల చెవులమ్మ (54) పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ సందర్భంగా సోమవారం మృతురాలి కుటుంబసభ్యులను మాజీ ఎంపీపీ కరిమి రాజేశ్వరరావు, రాజులరెడ్డిలు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు మజ్జిలక్ష్మీనారాయణ, రెంటికోట త్రినాధరావు, సంపతిరావు రామన్న, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

దివ్యదర్శనం యాత్ర తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

● స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా ఏర్పాట్లపై అసహనం

● 3 గ్రామాలకే పరిమితం చేయడమేంటి? ● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



బస్సుయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీముఖలింగం (జలుమూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత దివ్యదర్శనం యాత్రకు భక్తులను ఎంపిక చేయడంలో దేవాదాయశాఖ అధికారులు చేపట్టిన పనితీరుపై స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలం నుంచి దివ్యదర్శనానికి వెళ్తున్న 160 మంది భక్తుల దివ్యదర్శన బస్సుయాత్ర శ్రీముఖలింగంలో జెండాఊపి సోమవారం ప్రారంభించారు. దివ్యదర్శన భాగ్యం ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ మూడు గ్రామాలకే పరిమితం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం స్థానికంగానున్న ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకుండా బస్సుయాత్ర ఏర్పాటు చేయడం వెనుక ఆంతర్యమేమిటని ఈవోను నిలదీశారు. దివ్యదర్శనం యాత్రకు ఎస్సీలు, ఎస్టీకు ప్రాధాన్యమిచ్చి ఆ తరువాతనే బీసీలకు చోటు కల్పించాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పాటించలేదని అసహనం వ్యక్తం చేశారు. దివ్యదర్శనానికి వెళ్తున్న భక్తులు బైరాగిపేట, అంధవరం, పాగోడు మూడు గ్రామాలకే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని బస్సుయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న దేవాదాయశాఖ అసిస్టెంటు కమీషనర్ శ్యామలాదేవి దృష్టికి తీసుకెళ్లారు. దివ్యదర్శన బస్సుయాత్రకు భక్తులను ఎంపిక చేయడంలో అక్రమాలకు పాల్పడిన ఈవోపై చర్యలు తీసుకోవాలని ఏసీని కోరారు. శ్రీముఖలింగంనుండి దివ్వదర్శనానికి బస్సులు బయలుదేరినప్పటికీ కనీసం సమాచారం లేదని సర్పంచ్ ప్రతినిధి తర్ర బలరాం, కరకవలస సర్పంచ్ ప్రతినిధి పొన్నాడ దాలయ్య అసహనం వ్యక్తం చేసారు. ముందుగా ఎంఎల్ఏ బగ్గు రమణమూర్తి శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏసీ వి.శ్యామలాదేవి, ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు నారాయణరావు, రెవిన్యూ పరిశీలకులు చిన్నారావు, ట్రస్టుబోర్డు చైర్మన్ బైరి బలరాం, సర్పంచ్ తర్ర మాణిక్యం, సర్పంచ్ ప్రతినిధి తర్ర బలరాం, అర్చకులు సంఘం అధ్యక్షుడు పెద్దలింగన్న, ఏఎంసీ చైర్మన్ వెలమల చంద్రభూషణరావు, టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యన్నారాయణ, దుబ్బ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సముదాయ సమావేశాలు ప్రారంభం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న విద్యాశాఖ డైరెక్టర్

సుసరాం(పోలాకి) : మండలంలోని సుసరాం, అంపలాం గ్రామాల్లో సోమవారం పాఠశాల సముదాయ (స్కూల్‌కాంప్లెక్స్) సమావేశాలు నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులకు ఈ సమావేశాలు నిర్వహించడం ఇదే తొలిసారి. మండలంలో 12 స్కూల్ కాంప్లెక్స్‌లున్నాయి. వీటిలో 12 పాఠశాలల ఉపాధ్యాయులు సముదాయంగా ఏర్పడి సమావేశాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సుసరాం, అంపలాం గ్రామాల్లో సంబంధిత ప్రధానోపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్స్‌గా ఉంటారు. సోమవారం సుసరాంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

గ్యాస్ సమాచారం

నరసన్నపేట: స్థానిక హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈనెల 20న బుక్‌చేసిన వారికి, ఈనెల 19న బుక్ చేసిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు మంగళవారం గ్యాస్ పంపిణీ చేయనున్నారు.

నరసన్నపేటలో సినిమాలు

శ్రీదేవి - నేనే రాజు.. నేనే మంత్రి
రాజేశ్వరి - లై
శ్రీవెంకటేశ్వర - జయ జానకి నాయక

బార్నాల వీధిలో సీసీ రోడ్డు పనులు

వీరఘట్టం: పట్టణంలోని బార్నాల వీధిలో సోమవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.2.50 లక్షలతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులను ఏఈలు శ్రీరాములు, శంకరరావు పరిశీలించారు. నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పనులను పరిశీలిస్తున్న ఏఈలు →



కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వీరఘట్టం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు చెత్తాచెదారాలను తీసి దూరంగా వేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎంషణ్ముఖరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

డాక్ సేవక్ యూనియన్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

వీరఘట్టం: అఖిలభారత డాక్ సేవక్ యూనియన్ పిలుపు మేరకు మండల కేంద్రంలో సోమవారం స్థానిక పోస్టల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ సిబ్బంది సమస్యలపై కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సిఫారసులు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్.బాబూరావు, రాములు, పలువురు గ్రామీణ పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

24న 'వనం-మనం'



మాట్లాడుతున్న సీఎంవో

వీరఘట్టం: జిల్లా వ్యాప్తంగా ఈనెల 24న అన్ని కేజీబీవీ పాఠశాలల్లో వనం-మనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్వీఎం సీఎంవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ.. అన్ని కేజీబీవీ పాఠశాలల ఆవరణల్లో మూడు వరుసల్లో నీలగిరి, జీలుగు తదితర మొక్కలను నాటాలన్నారు. డిసెంబర్ ఒకటి నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాలయ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కేజీబీవీ ఉపాధ్యాయులు దాతల నుంచి విరాళాలు సేకరించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయనతోపాటు అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.గోవిందరావు, ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి ఎస్.రమ్య ఉన్నారు.

ఆసుపత్రి నిర్మాణాల్లో నాణ్యత పాటించండి



పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

పాలకొండ టౌన్: ఆసుపత్రి పునర్నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వైద్య విధాన పరిషత్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ కె.రాంబాబు ఆదేశించారు. ఏరియా ఆసుపత్రిలో చేపడుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో లోపాలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఒక పక్క ఆసుపత్రిని నిర్వహిస్తూనే పునర్నిర్మాణ పనులు జరుగుతున్నందున పనుల వల్ల ఇతరులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన పూర్తిచేసి అన్ని విభాగాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు 50 శాతం మేర పనులు పూర్తయ్యాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పది రోజుల్లో ఆయా గదులను వినియోగించేలా చూడాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెన్నపు శ్రీనివాస రావు మాట్లాడుతూ.. కొన్ని పాత నిర్మాణాలు పటిష్టంగా ఉన్నాయని, వాటిని తొలగించకుండా ఆ నిధులతో ఇతర పనులు చేపట్టాలని ఈఈని కోరారు. భవనాలకు ఇతర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఆసుపత్రి వెనుక భాగంలో పాడైన ప్రహరీని తొలగించి మరలా నిర్మించాలన్నారు. అపడమిక్ సీజన్ కావడంతో ఆసుపత్రికి అతిసార వ్యాధిగ్రస్థుల ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆ విభాగం త్వరిత గతిన పూర్తి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ జె.భాస్కరరావు, చిన్న పిల్లల వైద్యనిపుణుడు రవీంద్రకుమార్ కోరారు. వారితో పాటు డీఈఈ శ్రీనివాస రావు, సైట్ ఇంజినీర్ పవన్, ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ చంద్రరావు తదితరులున్నారు.


గిరిజన దర్బార్‌లో అన్నీ వ్యక్తిగత సమస్యలే..!



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో శివశంకర్

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌కు వ్యక్తిగత సమస్యల పైనే గిరిజనులు వినతిపత్రాలను అందించారు.. పీవో ఎల్.శివశంకర్ దర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు.. వచ్చిన వినతుల్లో కొన్ని ఇలా.. సీఆర్టీ పోస్టులు ఇప్పించాలని సీహెచ్ కృష్ణారావు (సిలగాం), ఎస్.లీలాసరిత (సీతంపేట), పవన్‌కుమార్(రాజన్నగూడ), సీహెచ్ వాసుదేవరావు, జి.ప్రసాద్ (బాణాపురం) వినతిపత్రాలను ఇచ్చారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వలంటీర్‌గా నియమించాలని పాలకొండ మండలం జంపరకోటకు చెందిన ఆరిక బాబూరావు కోరారు. మెట్టుగూడ జలపాతం వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా నియమించాలని పనసగూడకు చెందిన సవర మంగయ్య కోరారు. అంగన్‌వాడీ పోస్టు ఇప్పించాలని సన్నాయికాలనీకి చెందిన పాలక సునామీ, ఏదైనా ఉపాధి కల్పించాలని మెళియాపుట్టి మండలం పెద్ద మడి కాలనీకి చెందిన ఎస్.అప్పారావు విన్నవించారు. కుక్ పోస్టు ఇప్పించాలని సవర రామారావు (కొత్తగూడ), ట్రాక్టర్ కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని వీరఘట్టం మండలం చినగోరకాలనీకి చెందిన బి.రమణమూర్తి విన్నవించారు. స్టాఫ్ నర్సు పోస్టు ఇప్పించాలని నవతలకు చెందిన జె.బృందారాణి, జీఎన్ఎం పోస్టు నిమిత్తం జిల్లేడుపాడుకు చెందిన ఎ.కల్యాణి, ఏఎన్ఎం పోస్టు నిమిత్తం బి.సుజాత (కొత్తూరు మండలం లబ్బ), ఆర్.పద్మ (గురండి) వినతిపత్రాలను అందించారు. వాచ్‌మేన్ పోస్టు ఇప్పించాలని హైగ్రీవరావు (సామరెల్లి), కోడూరు గ్రామానికి చెందిన సీతారాములు హెల్త్ వలంటీర్‌గా నియమించాలని కోరగా, వెంకటాపురానికి చెందిన రవి కుక్, కమాటీ పోస్టు ఇప్పించాలని, 9వ తరగతిలో చదువుకునేందుకు సీటు ఇప్పించాలని ఘనసరకు చెందిన గంటా మనోజ్ కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రోజారాణి, ఈఈ కె.అశోక్, డీఈఈ వి.సింహాచలం, ఏపీడీలు జి.రమణమ్మ, విజయ్‌కుమార్, డోల లక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాధాకృష్ణన్, సీడీపీవోలు నాగరాణి, బాలామణి, పీఆర్ ఏఈ కల్యాణి దుర్గ, ఐటీడీఏ మేనేజర్ నాగేశ్వరరావు, పశువైద్యాధికారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు నాణ్యమైన సరుకులు ఇవ్వండి



టెండర్ ప్రక్రియలో పాల్గొన్న పీవో శివశంకర్

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ వసతి గృహాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని ఐటీడీఏ పీఓ ఎల్.శివశంకర్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆశ్రమ వసతి గృహాలకు సరుకుల సరఫరాకు టెండరు ప్రక్రియ చేపట్టారు. కందిపప్పు, పెసరపప్పు, బన్సీరవ్వ, చోడిపిండి, పామా యిల్, పచ్చ బఠానీ, విశాఖ డెయిరీ మిల్క్ ప్యాకెట్లు తదితర సరుకులు సరఫరాకు టెండర్లు నిర్వహించారు. టెండర్ల సమయంలో ఖరారైన సరుకులను పక్కాగా సరఫరా చేయాలన్నారు. నాణ్యత లేని సరుకులు అందిస్తే టెండర్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు జీసీసీ ద్వారా ఆశ్రమ వసతిగృహాలకు సరఫరా చేస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించాలని పర్యవేక్షణాధికారులను ఆదేశించారు. సరుకుల సరఫరాకు రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కాంట్రాక్టర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రోజారాణి, జీసీసీ డివిజనల్ మేనేజర్ సీహెచ్ మధు, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహన్‌రావు, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ఐటీడీఏ మేనేజర్ నాగేశ్వరరావు, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, వార్డెన్‌లు పాల్గొన్నారు.

పారదర్శకంగా డీలర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



అభ్యర్థికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఆర్డీవో

పాలకొండ రూరల్: వంగర మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులకు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఆర్డీవో ఆర్.గున్నయ్య తెలిపారు. వంగర మండలం బంగారువలస, పటువర్ధనం, దేవకివాడ, మరువాడ, శ్రీహరిపురం గ్రామాల డీలర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 14 మంది హాజరయ్యారన్నారు. అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారి జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వంగర తహసీల్దార్ టి.అప్పారావు, డీఎస్‌వో లిల్లీపుష్పనాథం, సివిల్‌సప్లై అధికారి ఐటీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోండి



లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న పీవో

సీతంపేట: ఐటీడీఏ ద్వారా వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు అందజేస్తున్న ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ అన్నారు. అక్కన్నగూడ గ్రామ గిరిజనులకు సీసీడీపీ పథకం కింద రూ.13 వేలు విలువ చేసే వేయింగ్ మిషన్, రాజాంకి చెందిన కిరసాల అరుణకు వ్యాపారం చేసుకునేందుకు వెలుగు ద్వారా రూ.లక్ష రుణాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈమె ప్రతినెల రూ.3 వేలు చొప్పున వెలుగు సంస్థకు చెల్లించాలని తీర్మానించామన్నారు. వీరఘట్టం మండలం మూలలంకకు చెందిన నిమ్మక రమేష్‌కు కిరణా వ్యాపారం నిమిత్తం రూ.40 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనాధికారి ఆనందరావు, మేనేజర్ నాగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ సోమేశ్వరరావు, ఏపీవో కసవయ్య, వెలుగు ఏపీడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న గోడలు

● భయాందోళనలో విద్యార్థినులు

హడ్డుబంగి (సీతంపేట రూరల్): ఇటీవల కురిసిన వర్షాలకు హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాల గోడలు నాని కూలిపోయే పరిస్థితి ఉండడంతో విద్యార్థినులను వేరే గదులకు మార్చినట్టు హెచ్ఎం లిల్లీరాణి తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో శ్లాబ్‌పై నుంచి వర్షపు నీరు గోడలపై పడి గోడలు నాని కదులుతున్నాయని, ముందస్తుగా విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.



నానిపోయి ఉన్న గోడ

‘ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు’

హిరమండలం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ ఏడీ విజయకుమార్ చెప్పారు. సోమవారం ఆయన అంతకాపల్లిలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వరి సాగులో రసాయన ఎరువులు, పురుగు మందు బదులు సేంద్రీయ ఎరువులు వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాడెప్, సేంద్రీయ ఎరువుల యూనిట్లను సబ్సిటీపై అందిస్తోందని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి గాయత్రి ఉన్నారు.

‘పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత’



మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థులు

తురకపేట జంక్షన్(ఎల్.ఎన్.పేట): పర్యావరణాన్ని పరిరక్షణను అంతా బాధ్యతగా తీసుకోవాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. సోమవారం ఆయన తురకపేట జంక్షన్‌లోని శ్రీవెంకటేశ్వర పాఠశాల విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలను తయారుచేయించి మాట్లాడారు. రంగులు వినియోగించి ప్లాస్టరాఫ్ పారిస్‌తో చేసే వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడంతో కాలుష్యం పెరిగి వివిధ రకాల జీవులు అంతరించిపోయి భూమిలో మార్పులు వచ్చి పంటలు దెబ్బతింటాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.సుజాత, ఆర్. వాణిశ్రీ, సంతోష్‌కుమార్, శేఖర్, లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

‘హామీలు నెరవేర్చని ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి’

దబ్బపాడు(ఎల్.ఎన్.పేట): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంకావాలని వైసీపీ జిల్లా శాఖ అధ్యక్షురాలు రెడ్డి శాంతి కోరారు. సోమవారం ఆమె మండలంలోని దబ్బపాడులో గడప గడపకు వైసీపీ నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ పథకాల పేరుతో మాయమాటలు చెప్పి చంద్రబాబు ప్రజల్ని మోసగించారని ఆరోపించారు. అందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలన్నారు. ఆమె వెంట ఆ పార్టీ నాయకులు కె.త్రినాథరావు, వై.జనార్ధనరావు, పి.విష్ణు, కె.కృష్ణారావు, ఎల్.మల్లేశ్వరరావు, జియోగీశ్వరరావు తదితరులు ఉన్నారు.

‘సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందే’



మిలియన్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. సెప్టెంబరు 1న నిర్వహించనున్న మిలియన్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, పాత విధానం అమలు చేస్తే వారందరికీ లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.లక్ష్మీనారాయణ, బర్రి పురుషోత్తం, ఆర్.ఆర్.మహంతి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘మిలియన్ మార్చ్ విజయవంతం చేయండి’

హిరమండలం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించనున్న మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఎం.వేణుగోపాలరావు ప్రభుత్వాన్ని కోరారు. దీనికి సంబంధించిన గోడపత్రికను సోమవారం మండల విద్యాశాఖాధికారి రాంబాబు ఆవిష్కరించారు. ఈ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.చిన్నబాబు, పైల శివరామకృష్ణ ప్రసాద్, వాసుదేవరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ, ఖోఖో విజేతలు పీఎల్‌పురం, పెద్దమడి

పెద్దమడి(మెళియాపుట్టి): స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో రెండు రోజులు నిర్వహించిన ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. సీనియర్ బాలుర విభాగం కబడ్డీలో పీఎల్‌పురం గెలుపొందగా, పెద్దమడి రన్నర్‌గా, ఖోఖోలో పెద్దమడి గురుకులం విజయం సాధించగా, మర్రిగూడ రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో పెద్దమడి, పీఎల్‌పురం, షార్ట్‌పుట్‌లో పెద్దమడి, లాబర విద్యార్థులు వరుసగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. 100 మీటర్ల పరుగుపందెంలో దివాకర్, బి.ఎం.శీలం, ఎస్.రవికుమార్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, 800 మీటర్లలో జి.బింద, సాయి, సిహెచ్.రవితేజకు మొదటి మూడు స్థానాలు లభించాయి. లాంగ్‌జంప్‌లో దినకర్, రవికుమార్, సిహెచ్.చంటి, షార్ట్‌పుట్‌లో జి.రమేష్, జి.చంటి, సిహెచ్.సుమ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. సీనియర్ బాలికల విభాగం కబడ్డీలో పెద్దమడి బాలికల పాఠశాల గెలుపొందగా, ఒంద్రుజోల రన్నర్‌గా, ఖోఖోలో పెద్దమడి బాలికల పాఠశాల విజయం సాధించగా, సారవకోట బాలికల పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో సవరబొంతు గెలుపొందింది. వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన వారు సీతంపేటలో జరిగే ఫైనల్ పోటీలకు ఎంపికైనట్లు కేర్‌టేకర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు పాల్గొన్నారు.



గుండు విసురుతున్న విద్యార్థిని



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

‘పర్యావరణ పరిరక్షణ సామాజిక అవసరం’

సూర్యనారాయణపురం(పాతపట్నం): పర్యావరణ పరిరక్షణ సామాజిక అవసరమని కోదూరు ఉప సర్పంచ్ లింగుమహంతి నీలేశ్వరరావు అన్నారు. సోమవారం కోదూరు పంచాయతీ పరిధిలోని సూర్యనారాయణపురంలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించి యువత స్వచ్ఛందంగా పెరటి చెట్ల పెంపకానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మిస్తునన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన ప్రాంగణంలోను, సూర్యనారాయణపురం చెరువుగట్టుపైనా కొబ్బరిచెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు విశ్వనాథం, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఉప సర్పంచ్ నీలేశ్వరరావు

‘పెండింగ్ బిల్లులు చెల్లించండి’

కొత్తూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పనుల బిల్లులు చెల్లించాలని కోరుతూ మండల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. పనులు చేసి మూడు నెలలు అవుతున్నా బిల్లులు చెల్లించకపోవడంపై వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు నిర్మించిన వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలో సంఘం జిల్లా కార్యదర్శి శిర్ల ప్రసాద్, టొంపల వెంకటరావు, లోతుగెడ్డ వాసు, జి.బాబూరావు, దూళి ప్రమీల, ఎల్.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వేతనదారులు

‘పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి’

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో రాంబాబు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన సిబ్బంది విద్యా బోధనలో మెలకువలు, సీసీ విధానం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు →





మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మరమ్మతులతో వాహనచోదకులకు ఊరట

ఎల్.ఎన్.పేట: రావిచెంద్రి, చింతలబడవంజ గ్రామాల మధ్య వున్న ఖానాకు మరమ్మతులు చేయడంతో వాహనచోదకులకు ఊరట లభించింది. రోడ్డు విస్తరణ పనులు జరిగినప్పటి నుంచి ఈ ఖానా వద్ద గోతులు పూడ్చకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనచోదకులు ఆందోళన చెందేవారు. మరమ్మతులు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఉచితంగా జింక్ పంపిణీ

హిరమండలం: ఖరీఫ్ సాగుకు మండలంలోని రైతులకు జింక్ ఉచితంగా అందజేస్తున్నట్టు వ్యవసాయాధికారి గాయత్రి చెప్పారు. మండలానికి 10 టన్నుల జింకు వచ్చిందని, బయోమెట్రిక్ విధానంలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. 1001 వరి వేసిన రైతులకు, పొలాల్లో జింకు లోపం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

చంద్రన్న బీమా అందజేత

గొప్పిలి(మెళియాపుట్టి): మండల పరిధి గొప్పిలి గ్రామానికి చెందిన కోట జగన్నాథం ఇటీవల మృతిచెందడంతో ఆయన భార్య బాలమ్మకు సోమవారం ఏఎంసీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి, సర్పంచ్ మాలతి జయరాం చేతుల మీదుగా చంద్రన్న బీమా తక్షణ సహాయంగా రూ.5 వేలు అందజేశారు. అలాగే మాకనాపల్లిలో ఇప్పిలి మాధవరావు మృతిచెందడంతో ఆయన భార్య అమరావతికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మాలతి రుషికేంద్రమణి, బమ్మిడి శ్రీనివాసరావు, పడాల భాస్కరరావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

‘చంద్రన్న బీమాతో ధీమా’

ఎల్.ఎన్.పేట: చంద్రన్న బీమాతో పేదలకు ధీమా లభిస్తోందని మండల ప్రత్యేకాహ్వానితుడు ఒమ్మి ఆనందరావు అన్నారు. సోమవారం ఆయన మండల కార్యాలయంలో ఎస్.పాపమ్మ, పి.రాజారావు, సిహెచ్.భుజంగరావు, కె.నాగయ్యకు చంద్రన్న బీమా మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎల్.మల్లేశ్వరరావు, జి.రాము, ఐకేపీ ఏపీఎం ఎన్.ధనలక్ష్మి, వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, సిహెచ్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో సినిమాలు

ఉమామహల్: జయ జానకి నాయక

హిరమండలంలో..

వరలక్ష్మి : లై

కొత్తూరులో..

గౌరీశంకర : జయ జానకి నాయక

ఉమాశంకర: లై

ఉపాధి వేతన బకాయిలు విడుదల

శ్రీకాకుళం సిటీ : ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వేతనబకాయిలు విడుదలచే స్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ. 270కోట్ల వేతనబకాయిలు విడుదల చేయగా, జిల్లాకు సంబంధించి రూ. 28.24 కోట్ల బకాయిలను విడుదల చేసింది. ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో కోట్లలో బకాయి... ఇచ్చేదెపుడోయ్ శీర్షిక ప్రచురితమైన కథనానికి జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రభుత్వానికి నివేదించింది. ఈ క్రమంలోనే బకాయిలను విడుదలచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.

సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సంతకవిటి: మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

సంతకవిటి: రైతులు, ప్రజలు, విద్యార్థులకు సేవలు అందించడంలో వీఆర్వోలు, ఆర్ఐలు ఇతర సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తహసీల్దార్ జి.సురేష్ హెచ్చరించారు. సోమవారం వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో రైతులను ఇబ్బందులను గురిచేసినా, డబ్బులు వసూలు చేసినా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ యూకే గౌడ్, ఆర్ఐ రుద్రప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విలేజ్‌మాల్ ద్వారా సరుకుల పంపిణీ

రేగిడి: ప్రభుత్వం చౌక దుకాణాలను విలేజ్ మాల్స్‌గా తయారు చేస్తున్నందున సరుకుల పంపిణీకి సిద్ధం కావాలని తహసీల్దార్ బి. సూరమ్మ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం నూతన విధానంలో అన్ని రకాల వస్తువులు విక్రయించే దుకాణాలుగా విలేజ్ మాల్స్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతి డీలర్ డిపోకు సంబంధించి కొలతలు, ఫోటోలు కార్యాలయానికి అందజేయాలన్నారు. తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీ సూరి నర్సింహమూర్తి, డీలర్ల సంఘ అధ్యక్షుడు సింగంవలస రామ్మూర్తినాయుడు, కార్యదర్శి సత్యంనాయుడు, పి.సత్యం నాయుడు, పాల్గొన్నారు.

వీఆర్వోలదే పర్యవేక్షణ బాధ్యత

వంగర: విలేజ్ మాల్స్‌ను పర్యవేక్షించే బాధ్యత వీఆర్వోలదేనని డీటీ గోవిందరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విలేజ్‌మాల్స్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసిందని, అందుకు డీలర్లు సిద్ధం కావాలన్నారు. ప్రతి డీలర్ మాల్ ఏర్పాటుకు వసతి, గోదాం సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో వీఆర్వోలు, డీలర్ల సంఘ అధ్యక్షుడు పసుమర్తి గౌరీశంకర్, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నిర్మాణానికి రూ. 30 లక్షల మంజూరు

రాజాంరూరల్: పట్టణ పరిధిలోని పాలకొండ రోడ్డులో ప్రధాన కాలువలు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు ఎట్టకేలకు రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో పనులు చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. రూ.30 లక్షలకు సంబంధించి అంచనాలకు కలెక్టర్ ఆమోదించడంతో టెండర్లు పిలిచేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. రోడ్డు దుస్థితిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కావలి ప్రతిభాభారతి, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కావలి గ్రీష్మాప్రసాద్ కలెక్టర్‌ను కలిసి వివరించడంతో ఆయన స్పందించి నిధులు మంజూరుకు చర్యలు చేపట్టారు. త్వరలో కాలువల నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నగరపంచాయతీ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. కాలువలు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా నిధులు మంజూరు చేశారని మాజీ స్పీకర్ ప్రతిభాభారతి పేర్కొన్నారు. ఈ నిధులతో కాలువ పనులు చేపట్టేందుకు నగరపంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



కాలువలు నిర్మించాల్సిన పాలకొండ రోడ్డు ఇదే...

భయం..భయంగా.!

- అర్ధంతరంగా నిలిచిన కరకట్ట పనులు
- ఆందోళనలో బొడ్డవలస గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

ఆ గ్రామంలో సుమారు 85 కుటుంబాల్లో 200 మందికి పైగా ప్రజలు జీవనం సాగిస్తున్నారు.. నాగావళి నది ఒడ్డున ఉండడంతో వర్షాకాలంలో వారంతా భయం..భయంగా ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు.. ఎప్పుడు వరదలు వచ్చి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాం దోళన వ్యక్తంచేస్తున్నారు.. వరదల నుంచి రక్షించేందుకు కరకట్టల నిర్మాణం ప్రారంభించడంతో వారిలో ఆనందం వ్యక్తం కాగా అవి అర్ధంతరంగా నిలిచి పోవడంతో షరామామూలుగానే తమ పరిస్థితి తయారైందని ఆవేదన చెందుతున్నారు.. ఇదీ సంకిలి పంచాయతీ బొడ్డవలస గ్రామ దుస్థితి... దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం...

బొడ్డవలస(రేగిడి): నాగావళి నదీ పరీవాహక గ్రామం బొడ్డవలసలో వర్షాకాలం వస్తే గ్రామస్థులు కంటి మీదకునుకు లేకుండా రాత్రులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.. ఎప్పుడు నదికి వరద పోటు వచ్చినా ఏ ప్రమాదం జరుగుతుందోనని వారి భయాందోళన.. తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేస్తే ఊరు పక్కనుంచే వరద నీరు వెళ్తుంది. అయితే 70 వేల నుంచి లక్ష లోపు క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే గ్రామంలోకి చొచ్చుకొని వచ్చేస్తుంది.. శివాలయం నుంచి పెద్దపుర్లి వరకు 1200 మీటర్లు కాంగ్రెస్ హయాంలో కరకట్ట ప్రారంభించగా గ్రామం వద్ద సుమారు 200 మీటర్లు నిర్మాణం చేపట్టకుండా అర్ధంతరంగా నిలిచిపోయింది.. దీంతో ఎప్పుడూ ముంచుకొస్తు ఒదోనని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల నాగావళి నదికి వచ్చిన వరదల్లో లక్షలోపు క్యూసెక్కుల ప్రవహించడంతో అధికారులు స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



అర్ధంతరంగా నిలిచిన కరకట్ట పనులు



బొడ్డవలస గ్రామం

ఇదే మాదిరిగా పెద్దపుర్లి, కొమిరి వెంకటాపురం గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కరకట్టల నిర్మాణం పూర్తి చేసి వరదల ముంపు నుంచి గ్రామాన్ని కాపాడాలని వారు వేడుకుంటున్నారు.

కరకట్టలను నిర్మించాలి



మా గ్రామం వద్ద 200 మీటర్ల మేర కరకట్ట పనులు నిలిపివేశారు. నదిలో నీటి ప్రవాహం పెరిగితే గ్రామంలోకి నీరు ప్రవేశిస్తుంది. కాంగ్రెస్ హయాంలో సంకిలి శివాలయం నుంచి పెద్దపుర్లి వరకు 1200 మీటర్లు కరకట్ట నిర్మించారు. కాని మా గ్రామం వద్ద విడిచిపెట్టేయడంతో ముంపునకు గురవుతున్నాం.

-సాకేటి అప్పలనాయుడు, బొడ్డవలస

వరదలు వస్తే భయమే..



వర్షాకాలంలో నాగావళి నదికి వరదలు వస్తే గ్రామంలోకి నీరు చేరిపోతోంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

-కెంబూరి ఈశ్వరరావు, విద్యార్థి, బొడ్డవలస

ఏ ప్రమాదం జరుగుతుందో..?



నది ఒడ్డున మా గ్రామం ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్లతో పాటు వేగావతి, జంఝావతి నదుల నుంచి నీరు వస్తే గ్రామంలోకి నీరు చేరుతుంది. దీంతో ఇబ్బందిపడుతున్నాం. కరకట్టను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

-సాకేటి రాజేష్, బొడ్డవలస

చదువు సంగతి సరే... సమస్యల మాటేమిటి?

- హెచ్‌డబ్ల్యూవోను ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులు

సిరిపురం(సంతకవిటి): మా పిల్లల చదువు సంగతి సరే.. వసతి గృహంలోని సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారు.. ఎప్పుడైనా పిల్లలను చూసేందుకు రావాలంటేనే భయమేస్తోందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాని హెచ్‌డబ్ల్యూవో యశోదనరావు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... గ్రామానికి శివారున బూత్‌బంగ్లాలా ఉన్న ఈ వసతి గృహంలో తమ పిల్లలను ఎందుకు ఉంచుతున్నామోనన్న బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. వసతి గృహంలో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయనను ప్రశ్నించారు. మరుగుదొడ్లు చాలడం లేదని, 137 మంది విద్యార్థులుండగా ఒక్కో గదిలో 30 మంది విద్యార్థులు ఉండడం వల్ల ఇబ్బంది కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సర్పంచ్ మొయ్యి అరుణకుమారి మాట్లాడుతూ.. పక్కా భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, మీసాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హాస్టల్ అధికారి

ఎస్‌బీఐ ఎదుట ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం సిటీ: యూఎఫ్‌బీయూ పిలుపుమేరకు శ్రీకాకుళం ఎస్‌బీఐ ప్రధానశాఖ ఆవరణలో ఉద్యోగులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ శ్రీకాకుళం కన్వీనర్, ఎన్‌సీబీఈ నాయకుడు రమణ, ఎఐబీఈఏ నాయకుడు బి.శ్రీనివాసులు, బీఈఎఫ్ఐ నాయకుడు ఎం.శ్రీనివాసరావు, ఏపీబీఓసీ నాయకుడు రాంజీ మాట్లాడుతూ... 22న మంగళవారం ఉదయం 9 గంటలకు ఆంధ్రాబ్యాంక్ మహిళాశాఖ నుంచి స్థానిక ఎస్‌బీఐ ప్రధాన శాఖవరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. స్థానిక సూర్యమహల్ కూడలి వద్ద మానవహారం, ఎస్‌బీఐ ప్రధానశాఖ వద్ద నినాదాలతో నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం వద్ద భోజనవిరామ సమయంలో జరిగిన ఈ నిరసనలో ఉద్యోగులు, అధికారులు నినాదాలు చేశారు.



బ్యాంకు ఎదుట ధర్నాచేస్తున్న సిబ్బంది

5న అమరావతిలో వీఆర్ఏల దీక్ష

సంతకవిటి: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యల పరిష్కారానికి గాను సెప్టెంబర్ 5న అమరావతిలో దీక్ష చేపడుతున్నామని, వీఆర్ఏలంతా తరలిరావాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నీలయ్య కోరారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వీఆర్ఏల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల కమిటీ అధ్యక్షుడు లాస రాములు, ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాములు

సమాచారమ్

● నేడు మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ

రాజాంరూరల్: పట్టణ పరిధిలోని వీధిలో మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు 1990-91 పదో తరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యు.నీలకంఠేశ్వర యాదవ్, కలిశెట్టి శ్రీనివాసకుమార్, పురిపండ వెంకటేష్, చిప్పాడ జనార్ధనరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 500 విగ్రహాల వరకు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● నేడు జన్మభూమి కమిటీ సమావేశం

రాజాంరూరల్: నగరపంచాయతీ పరిధిలోని 20 వార్డుల జన్మభూమి కమిటీ సభ్యులు, పార్టీ నాయకులతో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి కావలి ప్రతిబాభారతి సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షురాలు కావలి గ్రీష్మాప్రసాద్, కార్యదర్శి దుప్పలపూడి శ్రీనివాసరావు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగు సమావేశానికి కమిటీ సభ్యులు, నాయకులు విధిగా హాజరుకావాలన్నారు. పార్టీ కార్యక్రమాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఫైనల్ జాబితా ఎంపిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

● రేపు హుండీ లెక్కింపు

రాజాంఅర్బన్: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న నవదుర్గాలయ హుండీ లెక్కింపు ఈనెల 23న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి పి.శ్యామలరావు, ధర్మకర్త వి.నర్సింగరావు, కమిటీ సభ్యుడు కూరాడ వెంకటరావు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించడం జరుగుతుందని ఆసక్తి గల భక్తులు హాజరుకావచ్చని వారు ఆ ప్రకటనలో సూచించారు.

● 30న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించండి

రేగిడి: మండలంలో ప్రాథమిక పాఠశాలల్లో ఈనెల 30న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామని ఎంఈవో ప్రసాదరావు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా తయారుచేసి పాఠశాల నోటీసు బోర్డులో ఉంచాలని కోరారు.

గ్యాస్ సమాచారం

లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఉన్న వినియోగదారులు ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మంగళవారం గ్యాస్ సరఫరా చేస్తామని నిర్వాహకుడు సాయి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఏవైనా గ్యాస్ సమస్యలుంటే 08941- 251016, 251160, 94905 96519 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సినిమాలు

రాజాం

అప్సర (ఎ.సి)- ఫిదా
సీతారామా (ఎ.సి)- జయ జానకి నాయక
సీతారామా (మినీ)- నేనేరాజు..నేనేమంత్రి

విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి

రేగిడి: విద్యార్థుల విద్యా సామర్థ్యం మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఆదేశించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యసన ఫలితాలను ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవాలని సూచించారు. సృజనాత్మకత విద్యతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంగర: నూతన విద్యావిధానంలో భాగంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించాలని ఎస్ఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించే విధంగా బోధన సాగించాలని సూచించారు. టీఎల్ఎం పరికరాలు ఉపయోగిస్తే విద్యార్థి సులువుగా గ్రహించగలడని సూచించారు. ఎంఈవో వై.దుర్గారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజాంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంమ్మార్సీలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించిన నాడే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు మక్కువ చూపుతారన్నారు. ఎటువంటి సమస్యలున్నా మండల, జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆర్వీఆర్‌జే రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేగిడి: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ





రేగిడి, వంగరల్లో బీమా చెక్కులు అందిస్తున్న నాయకులు, అధికారులు

రేగిడి: సాధారణ, ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం ప్రవేశపెట్టిందని టీడీపీ మండల అధ్యక్షుడు కిమిడి వినయ్‌కుమార్, ఏపీఎం బి.గోవిందరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో రూ. 6.56 లక్షల చంద్రన్నబీమా చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్నేన మహేశ్వరరావు, టంకాల గోవిందరావు, బొత్స రమేష్‌నాయుడు, పొట్నూరు మన్మథరావు బీమామిత్రలు ఎస్.మోహిని, బి.అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంగర: చంద్రన్నబీమా పథకం పేదలపాలిట వరమని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్టీవీ ప్రసాద్, టీడీపీ నాయకుడు వై.రమేష్ అన్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో తొమ్మిది మందికి చంద్రన్నబీమా చెక్కులను పంపిణీచేశారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.త్రినాథ, ఏపీఎం రజనీ, వైస్ ఎంపీపీ బౌరోతు రాంబాబు, నాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వీరింతే..!

- అధికారుల గైర్హాజరు షరా మామూలే..
- ప్రతి సోమవారం ఖాళీగానే గ్రీవెన్స్ సెల్
- ఉసూరుమని వెళ్తున్న ఫిర్యాదుదారులు

సంతకవిటి: ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్‌కు అధికారుల గైర్హాజరు షరా మామూలుగానే తయారవుతోంది.. దీంతో సమస్యలపై వినతులిచ్చేందుకు వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ సోమవారం కూడా పలు శాఖల అధికారులు రాకపోవడంతో గ్రీవెన్స్ సెల్ వెలవెల బోయింది.. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు విధిగా అన్ని శాఖల అధికారుల విధిగా ఉండి ఫిర్యాదుదారులనుంచి వినతులు స్వీకరించాల్సి ఉంది. అయితే అధికారులు రాక కుర్చీలు ఖాళీగా కని పించాయి.

వేతన సొమ్ము చెల్లించాలని వినతి

రాజాంరూరల్: ఉపాధి వేతన మొత్తం చెల్లించాలని అంతకాపల్లికి చెందిన మక్క తిరుపతిరావు గ్రీవెన్స్‌లో ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. 2016 జూన్ నుంచి ఉపాధి వేతనం డబ్బులు అందడం లేదని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా వికలాంగుడినైన నాలాంటి వారిని ఇబ్బందులు పెట్ట డం సమంజసంగా ఉందని ప్రశ్నించారు. ఐరిస్ ద్వారా ఉపాధి కూలి డబ్బులు చెల్లించేందుకు ఎంత ప్రయత్నిం చినా ఫలితం కనిపించలేదని ఏపీవో ఆర్.ఈశ్వరమ్మ ఎంపీడీవోకి వివరించారు. వచ్చే సోమవారం నాటికి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. పింఛన్లు మంజూరుచేయాలని కంచరాం, గడిముడిదాం తదితర గ్రామాల నుంచి పలువురు దరఖాస్తులు చేశారు. కార్యక్రమంలో ఒమ్మి సర్పంచ్ వంగా వెంకటరావు, హౌసింగ్ ఏఈ మహేష్, ఈవోపీఆర్డీ బి.కుమారస్వామి పాల్గొన్నారు.





సంతకవిటిలో ఖాళీగా ఉన్న కుర్చీలు (ఇన్‌సెట్) రాజాంలో వినతి స్వీకరిస్తున్న ఎంపీడీవో

సకాలంలో బిల్లులిచ్చేందుకు చర్యలు



సీసీలు, సీఎఫ్‌లతో మాట్లాడుతున్న ఏపీఎం

సంతకవిటి: ఉపాధి హామీ పథకం ద్వారా ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనులకు సంబంధించి లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని దదికుమార్ సూచించారు. సోమవారం స్త్రీనిధి భవనంలో సీసీలు, సీఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లకిరువైపులా మొక్కలు నాటే సంఘాలకు, హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటలు పెంచుతున్న లబ్ధిదారులను ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలన్నారు. ఎం బుక్‌లు నిర్వహణ సీఎఫ్‌లు, సీసీలదేనన్నారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, సీసీలు మల్లీశ్వరి, రమాదేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన అప్రోచ్ రోడ్డుకు భూ సేకరణ

పోతులజగ్గుపేట(సంతకవిటి): మండలంలోని పోతులజగ్గుపేట, బూర్జ మండలం లాబాం గ్రామాల మధ్య నాగావళి నదిపై జరుగుతున్న వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూ సేకరణకు సోమవారం పరిశీలించారు. భూసేకరణ త్వరితగతిన చేపట్టాలని రెవెన్యూ అధికారులను జేసీ చక్రధరబాబు ఆదేశించడంతో సర్వేయర్ భాస్కరరావు, వీఆర్వో రామకృష్ణ వంతెన నిర్మిస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. వంతెన నుంచి పోతులజగ్గుపేట వరకు రహదారి నిర్మాణానికి 1.56 ఎకరాలు భూమి అవసరం ఉంటుందని, తొమ్మిది మంది రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఈ మేరకు జెండాలను పాతి రహదారి ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టామని సర్వేయర్ భాస్కరరావు చెప్పారు. స్థలాన్ని పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్ వస్తున్నట్లు ముం దుగా సమాచారం వచ్చిందని తరువాత వాయిదా పడగా వెనుదిరిగారు.

తట్టు, రూబెల్లా వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

ఆడవరం (రేగిడి): తట్టు, రూబెల్లా వ్యాక్సిన్‌తో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.పవన్‌కుమార్ అన్నారు. సోమవారం ఆడవరం, లక్షింపురం, గోపెంపేట, దేవుదల, మజ్జిరాముడుపేట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. మండలంలోని 7,150 మంది 15 ఏళ్ల లోపు వారిని గుర్తించగా ఇంతవరకు సుమారు 5 వేలు మందికి వ్యాక్సిన్ వేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ తవిటమ్మ, పార్వతి, హెల్త్ సూపర్‌వైజర్ వై.జనార్ధన, పీహెచ్ఎన్ సూర్యకాంతం, సీహెచ్‌వో రాంప్రసాద్, హెచ్ఏ రుంకు శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, ఎన్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు

రాజాంఅర్బన్: ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనాన్ని విరమించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు ఇస్తోందని సీఐటీయూ రాజాం డివిజన్ కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు తెలిపారు. సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మోదీ ప్రభుత్వం సరళీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేయాలని చూస్తోందని, ఇందులో భాగంగానే బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడుతోందన్నారు. దీనివల్ల బ్యాంకు ఉద్యోగులు ఇబ్బందులుపడతారన్నారు. బ్యాంకు ఉద్యోగులకు న్యాయం జరిగేలా, ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే బ్యాంకులు ప్రభుత్వరంగంలోనే ఉండాలన్నారు. సమావేశంలో కె.సత్యనారాయణ, శంకరరావు, సత్యారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ రామ్మూర్తినాయుడు

దాడుల నియంత్రణ కమిటీ సభ్యుడిగా షేక్ బషీర్‌బాబు

కలెక్టరేట్ : జర్నలిస్టు ఫొటో, వీడియోగ్రాఫర్లపై దాడుల నియంత్రణ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా జిల్లాకు చెందిన షేక్ బషీర్‌బాబు ఎంపికయ్యారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఫొటోగ్రాఫర్ దాడుల నియంత్రణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.సాంబశివరావు(ఆంధ్రజ్యోతి) ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు సోమవారం జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డిని కలిసి ఎంపిక పత్రాన్ని అందించారు.



షేక్ బషీర్‌బాబు





అదే నిర్లక్ష్యం..!

రహదారి నిబంధనలు పట్టించుకోని వాహనచోదకులు

నిష్ఫలంగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రమాదం... ఇద్దరు ప్రాణాలనే కాదు.... రెండు కుటుంబాలను వీధిన పడేస్తోంది. ఇటు ప్రమాద బాధిత కుటుంబం... అటు కారణమైన వ్యక్తి కుటుంబం ఇబ్బందుల్లో పడుతుంది. ఈ తరహా ప్రయాణాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా.. స్పందన కరువవుతోంది. ఈ ఈరోజుకు ఏమీ జరగదులే అన్న ధీమా సమస్యలను తెచ్చిపెడుతోంది. శ్రీకాకుళం నగరంలో అయితే...పరిస్థితి దారుణంగా ఉంది. ఇష్టారాజ్యంగా వాహనచోదకులు వ్యవహరిస్తున్నారు. పోలీసులు నిత్యం తనిఖీలు చేపడుతున్నా.. వారి ఆలోచనా విధానంలో మార్పు రావడంలేదు. పోలీసుల కన్ను కప్పి రాకపోకలు సాగిస్తునే ఉన్నారు. పోలీసులను త్వరగా దాటాలనే ఉద్దేశంతో ప్రమాదాలను ఆహ్వానిస్తున్నారు. ఎప్పటికప్పుడు పోలీసులు తనిఖీలు చేస్తున్నా.. వాహనదారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. కాగా.. పరిమితికి మించి వాహనం పైకి ప్రయాణాలు సాగించడం పరిపాటిగా మారింది. నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ వారి నిర్లక్ష్యాన్ని చాటుతున్నారు.

-కలెక్టరేట్



గడ్డి వ్యానుపై ప్రమాదకరంగా ప్రయాణం



కె. మత్స్యలేశం బీచ్‌లో స్వచ్ఛభారత్ రేపు

గార: కె.మత్స్యలేశం బీచ్‌లో 23న మధ్యాహ్నం 3 గంటలకు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎ.సింహాచలం ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ఉద్యోగులు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి

గార: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో పక్కి కాంతారావు, ఈవోఆర్డీ ఎస్.రామ్మోహనరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. తాగునీటి వనరుల చెంత శుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇళ్లకు జియో ట్యాగింగ్ తప్పనిసరి అని గుర్తుచేశారు.

శుభ్రతపై రెడ్‌క్రాస్ అవగాహన



విద్యార్థులతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం సిటీ: బొందిలీపురం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పరిశుభ్రత, గ్లోబల్ వార్మింగ్, చేతులు శుభ్రపరుచుకునే విధానం, స్వచ్ఛభారత్, మొక్కలు నాటే కార్యక్రమం, నీటి సంరక్షణ, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రబ౦మం జరిగింది. నిత్యం పరిశుభ్రత పాటిస్తే.. రోగాలకు దూరంగా ఉండవచ్చునని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బి.ఈశ్వరమ్మ, జి.పరమేశ్వరరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది సీహెచ్ జగన్నాథరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా ఈ-క్రాప్ బుకింగ్



ఈ-క్రాప్ నమోదులో వ్యవసాయాధికారి

అంపోలు (గార): ప్రస్తుత ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ పంటలపై ఈ-క్రాప్ బుకింగ్ ముమ్మరంగా చేస్తున్నారు. ప్రభుత్వం ఈ-క్రాప్ ప్రతిపంటకు సర్వే నెంబర్ వారీగా నమోదు చేయాలంటూ ట్యాబ్‌లను సమకూర్చిన నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి పైల నవీన్ ఆధ్వర్యంలో ఏఈవోలు, ఎంపీఈవోలు ఈ-క్రాప్ బుకింగ్‌ను ముమ్మరంగా చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నవీన్ మాట్లాడుతూ... మండలంలో 8,714 హెక్టార్లలో పంటలసాగు జరుగుతుండగా ఇందులో 6,500 హెక్టార్లలో వరిపంట, వంద హెక్టార్లలో చెరకు, 50హెక్టార్లలో గంటి, వేరుసెనగ మొదలైన పంటలను సాగుచేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నామని సర్వే నెంబర్ వారీగా ట్యాబ్‌లలో పంటల నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 5200 హెక్టార్లలో తమ సిబ్బంది పంటలు నమోదుచేయడం జరిగిందన్నారు. క్రాప్ డేటా ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటలబీమా కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రతిభకు 'ఆశాదీపిక' తోడు



ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

డేఅండ్‌నైట్ జంక్షన్: ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో ఆశాదీపిక ఫౌండేషన్ ముందడుగు వేయడం హర్షణీయమని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. ఆశాదీపిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని సముద్రాల దివ్యకు రూ.5 వేలు పురస్కారాన్ని ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పోస్టర్ ఫ్రీ శ్రీకాకుళం, వైద్యశిబిరాలు, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు చేపడుతూ అనతి కాలంలోనే ఆశాదీపిక ఫౌండేషన్ అందరి మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎ.ప్రభాకరరావు, డీఎంహెచ్‌వో డా.ఎస్.తిరుపతిరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ దవళ భాస్కరరావు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు ఆశాదీపిక మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, తెలివితేటలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

రెండో డిపో యాజమాన్యం

'మొండివైఖరి విడనాడాలి'



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

శ్రీకాకుళం సిటీ: ఆర్టీసీ శ్రీకాకుళం-2 డిపో మేనేజర్ మొండివైఖరి విడనాడి కార్మిక సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి. లేనిపక్షంలో జిల్లాలోని ఐదు డిపోల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని శ్రీకాకుళం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు పి.రమేష్ హెచ్చరించారు. శ్రీకాకుళం డిపో ఆవరణలో ఈయూ ఆధ్వర్యంలో మూడోరోజూ దీక్షలు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... రెండో డిపో యాజమాన్యం కార్మికులను రెచ్చగొట్టేవిధంగా చర్యలు చేపడుతోందని ఆరోపించారు. అనంతరం డివిజనల్ ఇన్‌చార్జ్ కొర్లాం గణేశ్వరరావు, రీజనల్ ఉపాధ్యక్షుడు పి.నానాజీ తదితరులు మాట్లాడారు. శిబిరంలో ఎస్.గోవిందరావు, కె.జగదీశ్వరరావు, డి.రాజు, జి.భాస్కరరావు, కె.అక్కులు దీక్ష చేపట్టారు. శిబిరానికి డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, బీఆర్ కృష్ణ, 1వ డిపో కార్యదర్శి ఎస్వీ రమణ, జి.త్రినాథ్, పాలకొండ, టెక్కలి డిపోల ఈయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయిలు విడుదల

శ్రీకాకుళం సిటీ : ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వేతనబకాయిలు విడుదలచేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ. 270కోట్ల వేతనబకాయిలు విడుదల చేయగా, జిల్లాకు సంబంధించి రూ. 28.24 కోట్ల బకాయిలను విడుదల చేసింది. ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో కోట్లలో బకాయి... ఇచ్చేదెపుడోయి శీర్షిక ప్రచురితమైన కథనానికి జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రభుత్వానికి నివేదించింది. ఈ క్రమంలోనే బకాయిలను విడుదలచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.

మట్టి గణపతిని పూజించడం..

నగరంలో పలుచోట్ల విగ్రహాల పంపిణీ

పవిత్రం.. పర్యావరణ హితం





విగ్రహాలను పంపిణీ చేస్తున్న కమిషనర్ శోభ తదితరులు.. ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

డేఅండ్‌నైట్ జంక్షన్: మట్టి గణపతి విగ్రహాలను పూజించడం ద్వారా పవిత్రతతో పాటు పర్యావరణానికి మేలు చేకూర్చేవారమవుతామని నగరపాలక సంస్థ కమిషనర్ పీఏ శోభ అన్నారు. గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గీతాశ్రీకాంత్ ఆధ్వర్యంలో పీఎస్ఎన్‌ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మట్టివినాయకుల విగ్రహాలు పంపిణీ సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కమిషనర్ శోభ మాట్లాడుతూ... చిన్నారులు మట్టివినాయకుడిని వాడాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అనే బాధ్యతను చేపట్టాలని సూచించారు. మట్టిగణపతిని పూజించడం మన భారతీయ సంస్కృతిలో ఒక భాగమని, ప్రజలంతా మట్టి గణపతిని పూజించాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకురాలు గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ... ప్రతి ఏడాది ఈ కార్యక్రమం తమ ఫౌండేషన్‌ద్వారా చేపడుతున్నామని, మట్టిగణపతి మహాగణపతి అని, పుడమి తల్లి మెచ్చేలా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టిగణపతిని పూజించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.శంకరరావు, ఉపాధ్యాయులు శతపతి, రాధాకృష్ణవేణి, శ్రీపూర్ణిమ, రమాకుమారి, జీవరత్నం, కె.ధనుంజయ పాల్గొన్నారు.

నగరంలో ఎన్‌సీసీ కేడెట్లతో ర్యాలీ

పాతశ్రీకాకుళం : నగరంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్టించి పూజించాలి.. కాలుష్యాన్ని నివారించాలని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.బాబురావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఉదయం నగరంలో మట్టి వినాయకులు ప్రతిమల వినియోగం, కాలుష్యానివారణపై ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లతో ర్యాలీ నిర్వహించారు. రంగు వినాయకులు వద్దు.. మట్టి వినాయకులే ముద్దు అంటూ నినదించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు. ఈ ర్యాలీ కళాశాల నుంచి ఏడురోడ్లు కూడలి వరకు కొనసాగింది. ర్యాలీలో ఎన్‌సీసీ అధికారి డా. వై. పోలినాయుడు పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ..

ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ మూర్తి, మహిళా కన్వీనర్ సుధారాణి ఆధ్వర్యంలో మొలకెత్తిన గింజలను మట్టి వినాయకునిలో పెట్టి పర్యావరణ హిత (గ్రీన్) విగ్రహాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దీపామహల్ వెనుక శ్రీశ్రీ మెడిటేషన్ హాల్‌లో నిర్వహించారు. కా ర్యక్రమంలో కల్పన, గౌరి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



మట్టి గణపతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

డేఅండ్‌నైట్ జంక్షన్: మట్టివినాయకుని పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్‌ను కలెక్టర్ కె.ధనంజయరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయక విగ్రహాలు విష రసాయనాలతో కూడినవని వివరించారు. వీటివల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. మట్టి విగ్రహాన్ని పూజించాలని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిషోర్‌కుమార్, డ్వామా పీడీ హెచ్.కూర్మారావు, జడ్పీ సీఈవో నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వరం స్కూల్‌లో విగ్రహాల పంపిణీ

అరసవల్లి: నగరంలోని అందవరపు వర హానరసింహం (వరం స్కూల్) నగరపాలక సంస్థ పాఠశాలలో ఉచితంగా 23న మట్టి వినాయక విగ్రహాలకు పంపిణీ చేస్తున్నట్లు హెచ్‌ఎం ఇందిరామణి తెలిపారు. మట్టితో తయారు చేసిన 500 గణపతి విగ్రహాలను అందుబాటులో ఉంచామన్నారు. పర్యావరణాన్ని కాపాడడంతో పాటు, విద్యార్థులకు మట్టి విగ్రహాల ఆవశ్యకత తెలిసేలా ఉపా ధ్యాయులంతా సమష్టి కృషి చేస్తున్నా మన్నారు. అలాగే నగరపాలక సంస్థలో ఉపాధ్యాయుడు ఉప్పు త్రినాథరావు సౌజన్యంతో ఈ విగ్రహాలను తయారు చేయించినట్లు ఆమె తెలిపారు. వీటిని నగర ప్రజలకు అందజేస్తామన్నారు.



ఏసీపీ ప్రభాకర్‌కు ఆత్మీయసత్కారం



ఏసీపీ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం సిటీ: ఇండియన్ పోలీస్‌మెడల్ సాధించిన సిక్కోలు ముద్దుబిడ్డ, విశాఖపట్నం ఏసీపీ కింజరాపు ప్రభాకర్‌కు జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు సోమవారం విశాఖలోని ఆయన కార్యాలయంలో ఆత్మీయంగా సత్కరించారు. దివంగత కింజరాపు ఎర్రంనాయుడు స్వచ్ఛరాజకీయాలతో దేశంలోనే ముఖ్యనేతగా ఎదిగారని, ఆయన సోదరుడు కింజరాపు ప్రభాకర్ పోలీస్‌శాఖలో ఆణిముత్యంగా వెలుగొందుతున్నారని ఉత్తరాంధ్ర టీడీపీ కార్యకర్తల శిక్షణాశిబిరం డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను పుష్పగుచ్ఛాలు అందజేశారు. దుశ్శాలువలతో ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన కె.భాస్కరనాయుడు, చెల్లంనాయుడు, జె.అప్పలనాయుడు, వెంకటీ, విశ్వనాథం పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం సిటీ: యూఎఫ్‌బీయూ పిలుపుమేరకు శ్రీకాకుళం ఎస్‌బీఐ ప్రధానశాఖ ఆవరణలో ఉద్యోగులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ శ్రీకాకుళం కన్వీనర్, ఎన్‌సీబీఈ నాయకుడు రమణ, ఎఐబీఈఏ నాయకుడు బి.శ్రీనివాసులు, బీఈఎఫ్ఐ నాయకుడు ఎం.శ్రీనివాసరావు, ఏపీబీఓసీ నాయకుడు రాంజీ మాట్లాడుతూ... 22న మంగళవారం ఉదయం 9 గంటలకు ఆంధ్రాబ్యాంక్ మహిళాశాఖ నుంచి స్థానిక ఎస్‌బీఐ ప్రధాన శాఖవరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. స్థానిక సూర్యమహల్ కూడలివద్ద మానవహారం, ఎస్‌బీఐ ప్రధానశాఖ వద్ద నినాదాలతో నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. రూ. 6లక్షల కోట్లు మొండిబకాయిలు వసూలు విషయంలో పార్లమెంటరీ కమిటీ నివేదికను అమలుచేయడంలో ఉదాసీనత వహించి కార్పొరేట్ రుణ ఎగవేతదారుల కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఖాతాదారులపై భారమైన సర్వీస్‌చార్జీలు వేయడం అమానుషమన్నారు. స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం వద్ద భోజనవిరామ సమయంలో జరిగిన ఈ నిరసనలో ఉద్యోగులు, అధికారులు నినాదాలు చేశారు.



ఎస్‌బీఐ ప్రధానకార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

విస్తృతంగా ఆహార నియంత్రణ తనిఖీలు



చికెన్ నమూనాలు సేకరిస్తున్న అధికారులు

అరసవల్లి: నగరంలో సోమవారం విస్తృతంగా ఆహార నియంత్రణ అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా ఆహార నియంత్రణాధికారి జీఏబీ నందాజీ ఆధ్వర్యంలోని బృందం పాల ప్యాకెట్లను తొలుత తనిఖీలు చేశారు. వివిధ కంపెనీల నుంచి వచ్చే పాల నమూనాలు సేకరించారు. వాటిపై ముద్రించిన తేదీ తదితర వివరాలను నిశితంగా పరిశీలించారు. అలాగే రామలక్ష్మణ జంక్షన్‌లోని డీఎఫ్‌సీలో తనిఖీలు చేసారు. చికెన్, వండే ముడి పదార్థాలపై తీసుకుంటున్న జాగ్రత్తలు పరిశీలించారు. వాటి నమూనాలు సేకరించారు. రైతుబజార్‌లోని పంతంజరి స్టోర్స్‌లోని లభించే వివిధ రకాల వస్తువులను కూడా పరిశీలించారు. తనిఖీల్లో ఆహార తనిఖీఅధికారి ఎస్. ఈశ్వరీ, సిబ్బంది లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

'పీవీఆర్‌కె ప్రసాద్ మృతి తీరనిలోటు'

పాతశ్రీకాకుళం : సనాతన భారతీయ సంస్కృతికి వెన్నుదన్నుగా నిలిచిన మాజీ టీడీపీ చైర్మన్, ప్రస్తుత హిందూ ధర్మపరిషత్ రక్షణ ట్రస్టు చైర్మన్‌గా వ్యవహరించిన పీవీఆర్‌కె ప్రసాద్ మృతి తీరనిలోటని సనాతన భారతీయ సంస్కృతికి జిల్లా కన్వీనర్ టీపీవీ జగన్నాథరావు ప్రకటనలో సంతాపం తెలిపారు. హిందూధార్మిక సంస్థలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో సి.బాలమురళీకృష్ణ, యోగా చంద్రశేఖర్, కెవీ రమణమూర్తి, మురపాక సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

రెండు ఎల్‌ఈడీ టీవీల చోరీ

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఓ షాపులో రెండు ఎల్‌ఈడీ టీవీలు చోరీకి గురైనట్లు షాపు యజమాని రెండో నగర పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని పాలకొండ రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే రోడ్డులోని బాలాజీ ఎలక్ట్రానిక్స్‌లోని రెండు ఎల్‌ఈడీ టీవీలు ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయి. సోమవారం ఉదయం చోరీ విషయం గుర్తించిన షాపు యజమాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసును నమోదు చేశారు.

ఇచ్ఛాపురంలో శ్రీకాకుళం వాసి మృతి

ఇచ్ఛాపురం: శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీకి చెందిన కొర్ని సత్యం(45) అనారోగ్యంతో బాధపడుతూ ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రిలో సోమవారం మృతి చెందాడని హెచ్‌సీ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళానికి చెందిన సత్యం ఏడాది కిందట ఇచ్ఛాపురం పుష్కర వైన్స్ షాపులో పనిచేసి మానేశాడు. తర్వాత పనికావాలని తరుచూ శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వచ్చి వైన్ షాపు యజమానికి అడుగు తుండేవాడనీ.. పని లేదని చెబుతుండటంతో తిరిగి వెళ్లిపోయేవాడని తెలిపారు. సోమవారం కూడా పని కోసం వచ్చి వైన్‌షాపు దగ్గర స్పృహ కోల్పోవటంతో వైన్ షాపు యజమాని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ చికిత్స అందించేలోపు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ని హెచ్‌సీ తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

శ్రీకాకుళం లీగల్ : ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి అధికారులకు సూచించారు. ఈమేరకు సోమవారం సంస్థ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణాకు గురైన మహిళలకు, చిన్నారులకు తక్షణసాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడినవారిపై పోలీసుశాఖవారు కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో న్యాయసలహాకేంద్రాలను ఏర్పాటు చేశామని వీటి ద్వారా గ్రామీణులకు కూడా ఉచిత న్యాయం అందే అవకాశం ఉందన్నారు. వీటిని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతం మహిళల చట్టాల అమలుపై సమీక్ష జరిపారు. సమావేశంలో పలువురు ప్రభుత్వఅధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో చురుగ్గా వ్యాక్సినేషన్

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే సోమవారం కూడా వివిధ పాఠశాలల్లో వ్యాక్సినేషన్ కార్యక్ర మాన్ని వైద్యఆరోగ్యశాఖ నిర్వహించింది. నగరపాలక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేపట్టారు. అలాగే నగరంలోని కాకివీధిలోని మహర్షి విద్యామందిర్‌లో పూర్వప్రాథమిక విద్యార్థుల నుంచి పై తరగతి విద్యార్థులకు వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానికులు ఉన్నారు.

గార మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎ.సింహాచలం	తహసీల్దారు	8499886055
పక్కి కాంతారావు	ఎంపీడీవో	8790007906
బి.గణేష్	సబ్ ఇన్‌స్పెక్టర్	9440795821
పైల నవీన్	వ్యవసాయాధికారి	8886612700
రామ్మోహనరావు	ఈవోపీఆర్డీ	8978914770
జి.శ్రీధర్	వెలుగు ఏపీఎం	8008803885
సీహెచ్ నారాయణరావు	ఏపీవో	8790007882
ఎం.భాస్కరరావు	ఎంఈవో	9502599890
ఫణీంద్రకుమార్	ట్రాన్స్‌కో ఏఈ	9440812431
శంకరరావు	హౌసింగ్ ఏఈ	7093930244
పి.గోవిందరావు	మండల ఇంజనీర్	9441478870
సీహెచ్ గోవిందరావు	ఆర్అండ్‌బీ ఏఈ	9440416921
కె.నారాయణమూర్తి	పశు వైద్యాధికారి	9985109363
డాక్టర్ పి.జగదీష్	ఆయుష్ వైద్యులు	9493764553

యోగాభ్యాసంలోనూ మేటే..

ఆదర్శంగా వమరవెల్లి గురుకులం విద్యార్థినులు
ప్రోత్సహిస్తున్న యాజమాన్యం
ఆసక్తి చూపుతున్న బాలికలు
ప్రభుత్వ ఆశయం దిశగా అడుగులు



యోగాభ్యాసం చేస్తున్న బాలికలు

వమరవిల్లి (గార): వమరవెల్లి గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు చదువులోనే కాదు.. యోగాభ్యాసంలోనూ రాణిస్తున్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. యోగా సాధన ద్వారా జ్ఞాపకశక్తి, ఆరోగ్యం మెరుగుపరచుకోవాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యోగా తప్పనిసరి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఆయన ఆశయ సాధన దిశగా ఇక్కడ బాలికలు అడుగులు వేస్తున్నారు. ఇందుకు పాఠశాల యాజమాన్యం సైతం సహకరిస్తోంది.

● గురుకులంలో ఉదయాన్నే..

ఇక్కడి గురుకులంలో ప్రధానాచార్యుడు ఎం.మోహనరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.కామయ్య ఇతర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉదయాన్నే విద్యార్థినులతో యోగా చేస్తున్నారు. రోజూ ప్రార్థన సమయంలో 50 మంది బాలికల వంతున యోగాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ వ్యాయామ ఉపాధ్యాయుడు కామయ్య యోగాలో శిక్షణ పొంది జిల్లాలో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదే గురుకులానికి చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థిని పెద్దిన శ్రీజ భీమునిపట్నంలో గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పదిరోజుల యోగాశిక్షణ తరగతుల్లో శిక్షణ పొందారు.

ప్రతిరోజు ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థినులకు 5:15 నుంచి 6:15 గంటలవరకు యోగా చేయిస్తున్నారు. ఇందులో ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామంలో భాగంగా చక్రాసనం, త్రికోణాసనం, పశ్చిమోత్తర ఆసనం, తాడాసనం, వృక్షాసనం, సర్వాంగాసనం, హలాసనం, పాదహస్తాసనం, భద్రాసనం మొదలైన ఆసనాలు నేర్పిస్తున్నారు. విద్యార్థినులు కూడా ఎంతో ఆసక్తిగా యోగా శిక్షణ సద్వినియోగం చేసుకుంటూ... చదువులోనూ బాగా రాణిస్తున్నారు. ఈ పాఠశాల బాలికలు పదోతరగతిలో శతశాతం ఫలితాలు సాధిస్తూ రాష్ట్రస్థాయిలో గురుకులానికి మంచి గుర్తింపు తీసుకువస్తున్నారు. ఈ గురుకులంలో ఐదు నుంచి పదో తరగతి వరకు 480 మంది బాలికలు వసతి పొందుతూ.. చదువుతున్నారు.

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు...



గురుకులంలో తమ సొసైటీ కార్యదర్శి ఇతర అధికారుల ఆదేశాలమేరకు టైంటేబుల్‌లో భాగంగా యోగాను ఉదయాన్నే ప్రార్థనలో ఆభ్యాసం చేయిస్తున్నాం. విద్యార్థినులు కూడా ఎంతో ఆసక్తిగా యోగాను నేర్చుకుంటున్నారు.

-ఎం. మోహనరావు, ప్రధానాచార్యుడు

ప్రతిరోజు యోగాభ్యాసం..



గురుకుల బాలికలకు ప్రార్థనలో ప్రతిరోజు యోగాను కొంతసేపు ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ఆసనాలు, సూర్యనమస్కారాలు మొదలైనవాటిలో తర్ఫీదు ఇస్తున్నాం. బాలికలు కూడా ఎంతో ఆసక్తిగా యోగాభ్యాసం చేస్తున్నారు.

-ఎం. కామయ్య, వ్యాయామోపాధ్యాయుడు

జ్ఞాపకశక్తి పెరుగుతోంది..



ఉదయాన్నే ప్రార్థన సమయంలో యోగాభ్యాసం వల్ల మాలో జ్ఞాపకశక్తి, చదువుపైో ఏకాగ్రత పెరుగుతోంది. యోగా వల్ల ఒత్తిడికి దూరంగా ఉంటుంన్నాం. రోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అలవాటుగా మారింది.

పెద్దిన శ్రీజ, యోగా శిక్షణ పొందిన విద్యార్థిని

ఏకాగ్రత కలుగుతోంది..



రోజూ యోగాభ్యాసం వల్ల చదువుపై ఏకాగ్రత కలగడంతోపాటు ఆరోగ్యం బాగుంటోంది. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగుపడి ఒత్తిడికి దూరంగా ఉండేందుకు వీలుంది. యోగా వల్ల ఆరోగ్యంగానూ ఉంటున్నా.

వడగ లోకేశ్వరి, పదో తరగతి విద్యార్థిని

మూడోవిడత
రుణమాఫీ విడుదల చేయండి

శ్రీకాకుళం సిటీ: మూడోవిడత రుణమాఫీ తక్షణమే విడుదల చేయాలని అఖిలభారత కూలీసంఘం డిమాండ్ చేసింది. కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతినిధులు చాపర సుందరలాల్, బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ తోటపల్లి ఆధునికీకరణ పనులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌లు ప్రదర్శిస్తున్న నాయకులు

పర్వతారోహకులకు ఘన స్వాగతం

విజయనగరం రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికిన నేతలు, క్రీడాభిమానులు



స్వాగతం పలుకుతున్న నేతలు, క్రీడాభిమానులు

మెంటాడ: ఆఫ్రికా ఖండం టాంజానియా దేశంలో ఉన్న కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన జిల్లాకు చెందిన ఇద్దనవలస గ్రామస్థుడు జి.రమణ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.చిన్నమ్మలకు జిల్లా వాసులు సోమవారం సాధరంగా ఆహ్వా నించారు. కిలిమంజారో పర్వతాన్ని ఈనెల 15న వారు అధిరోహించిన విషయం తెలిసిందే. 19,341 కిలోమీటర్లు ప్రయాణించాక 600 చదరపు అడుగుల జాతీయ పతాకాన్ని వారు ఎగుర వేశారు. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని జిల్లాకు సోమవారం విచ్చేశారు. విజయనగరం రైల్వేస్టేషన్‌లో గిరిజన, మైదాన ప్రాంత నేతలు, క్రీడాభిమానులు వారికి ఆహ్వానం పలికారు. జిల్లా ఖ్యాతిని ఖండాంతరాల్లో చాటారని అభినందించారు. భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరం కూడా అధిరోహించి ప్రపంచ రికార్డు నెలకొల్పాలని ప్రోత్సహించారు. విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు పి.భగవాన్, మైదాన ప్రాంత గిరిజన సంఘం విద్యార్థి కన్వీనర్ ఆర్.శశిభూషన్, జిల్లా కార్యదర్శి గేదెల లక్ష్మణ, జిల్లా అధ్యక్షుడు పేకేటి చంద్రరావు, గిరిజన సమాఖ్య టి.అప్పల రాజుదొర, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సింహాచలం, నేతలు దాసరి సత్యం, పి.రఘు వారిని అభినందించారు.

'నవరత్నాల సభ విజయవంతం చేయండి'

టెక్కలిటౌన్: స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిచే నియోజకవర్గ స్థాయి నవరత్నాల సభను విజయవంతం చేయాలని బూత్‌కమిటీ సభ్యులకు వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేడాడ తిలక్ సూచించారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక పథకం అందేటట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను రూపకల్పన చేశారని, వాటిని ఇంటింటికి ప్రచారం చేసే క్రమంలో బూత్‌కమిటీలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అందువల్ల ప్రతి బూత్‌కమిటీ సభ్యుడు తప్పక హాజరు కావాలని కోరారు.

'మట్టి ప్రతిమలనే పూజించండి'



రావివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, టీచర్లు

టెక్కలి: పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతూ మట్టి ప్రతిమలనే వినాయక చవితి ఉత్సవాల్లో పూజలు చేయాలని కోరుతూ రావివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని బి.మాధురి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకొని పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం.పద్మనాభం, కమలకుమారి, భాస్కరరావు, నారాయణమూర్తి, త్రినాథరావు, మోహిని, అలివేణి తదితరులు పాల్గొన్నారు.

'బెల్టు షాపులు, సారాపై సమాచారం ఇవ్వండి'



సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్ ఎస్ఐ కళ్యాణి, తదితరులు

నందిగాం: గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచినా, సారా తయారుచేసినా సమాచారం అందించాలని నందిగాం, టెక్కలి ఎక్సైజ్ ఎస్ఐలు కె.కళ్యాణి, టి.రామకృష్ణారావు కోరారు. సోమవారం వారు మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం బెల్టు షాపులపై ప్రత్యేక నిఘా పెట్టినందున వీఆర్‌వోలు, కార్యదర్శులు తమ గ్రామాల పరిధిలో ఎక్కడైనా బెల్టు షాపులు తెరిచినా, తయారుచేస్తున్నా సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. బెల్టుషాపులు తెరిచే అవకాశాలు ప్రస్తుతం లేవని, అయితే ఎక్కడైనా తెరిస్తే చర్యలు తీసుకోవడానికి ఎక్సైజ్‌శాఖ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీలకు అన్యాయం జరిగితే భూ పోరాటం'

కోటబొమ్మాళి: ఎస్సీలకు అన్యాయం జరిగితే కోటబొమ్మాళిలోనూ భూ పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చాపర సుందర్‌లాల్ చెప్పారు. సోమవారం ఆయన ఎస్సీల సాగులో ఉన్న భూములను పరిశీలించి మాట్లాడారు. సర్వే నెం.124లో సుమారు ఏడు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన దేవాది మల్లేసు తదితరులు 35 ఏళ్లుగా సాగుచేస్తున్నారని, అయితే దీన్ని కొంతమంది పెత్తందార్లు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ భూములను అనుభవంలో ఉన్న రైతులకు అప్పగించకపోతే భూ పోరాటం చేపడతామని హెచ్చరించారు. 1999లో రైతులకు పట్టాలు ఇచ్చారని, అప్పటి నుంచి వారు శిస్తు కూడా చెల్లిస్తున్నారని అన్నారు. ఎస్సీల ఉద్ధరణకు ఎన్నో పథకాలు చేపడుతున్నామని చెప్పే రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇలాంటి ఆక్రమణలపై ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆయన వెంట కుప్పిలి భూషయ్య, కుప్పిలి రమణయ్య, కూన అప్పమ్మ తదితరులు ఉన్నారు.



ఆక్రమణ భూములను పరిశీలిస్తున్న సుందర్‌లాల్

సెప్టెంబరు మొదటి వారానికి విస్తరణ పనులు పూర్తి

● ఆర్‌అండ్‌బీ డీఈఈ రామినాయుడు

కోటబొమ్మాళి: వచ్చే నెల మొదటి వారానికల్లా కోటబొమ్మాళి రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ రామినాయుడు తెలిపారు. సోమవారం ఆయన కోటబొమ్మాళిలో పనులు పరిశీలించి ట్రాన్స్‌కో ఏడీఈ ఆర్.రామునాయుడుతో కలిసి విద్యుత్ స్తంభాల మార్పిడి, కొత్తలైన్ల కోసం ప్రణాళిక వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పనులు తీవ్రంగా జాప్యమయ్యాయని, ఇటీవలే అన్ని పనులకు పూర్తిస్థాయిలో అనుమతులు, నిధులు విడుదల అయ్యాయని చెప్పారు. అందుకోసం త్వరితగతిన పనులు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలను కూడా వారం రోజుల్లో తొలగించి కొత్తలైన్లు ఏర్పాటు చేస్తామని విద్యుత్ ఏడీఈ రామునాయుడు పేర్కొన్నారు.



కోటబొమ్మాళిలో పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ జేఈ ఎస్.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ మారం చంద్రశేఖర్‌కు అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సమష్టిగా అభివృద్ధి చేసుకోండి

● ఆర్డీవో వెంకటేశ్వరరావు

జీయన్నపేట(కోటబొమ్మాళి): తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారుల కాలాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామాలను సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలని టెక్కలి ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన జీయన్నపేటలో అంటరానితనం పేరిట వచ్చిన వచ్చిన ఒక ఫిర్యాదుపై దర్యాప్తు నిర్వహించారు. పూర్వం నిర్మించిన గోడలే నేడు అడ్డుగోడలుగా మారాయని కొంతమంది ఎస్సీ నేతలు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు నిర్వహించిన ఆర్డీవో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పనులు నిర్వహించి ఇటువంటి అవసరం లేని గోడలను తొలగించి పారిశుధ్య పనులు చేసుకొని సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తప్పుడు ఫిర్యాదుల వలన అందరికీ నష్టం వాటిల్లుతుందని, కులాలు పేరిట ఇటువంటి వ్యత్యాసాలు రానీయొద్దని హితవుపలికారు. కార్యక్రమంలో తహసీల్దార్



మాట్లాడుతున్న ఆర్డీవో

వి.శివబ్రహ్మానంద్, మండల సర్వేయర్ సిహెచ్.నాగేశ్వరరావు, ఆర్ఐ బి.ప్రకాశరావు, వీఆర్వో జబీనా, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'జియోట్యాగింగ్ పూర్తి చేయండి'

కోటబొమ్మాళి: మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి జాబితాలు త్వరితగతిన అందజేయాలని, అలాగే గృహాల జియోట్యాగింగ్ త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఎం.రేణుక తెలిపారు. సోమవారం ఆమె గ్రీవెన్స్ సెల్ అనంతరం పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్ల జాబితాల తయారీలో జాప్యం జరుగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. జాబితాలు కలెక్టర్‌కు పంపించాల్సి ఉన్నందున వెంటనే అందజేయాలన్నారు. ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.అనూరాధ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మంగరాణి, వ్యవసాయ శాఖ అధికారి



గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీనివాసరావు, పశువైద్యాధికారి ఎ.రాంకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకేశ్వరరావు, ట్రాన్స్‌కో ఏఈ ఎం.చంద్రశేఖర్, గృహ నిర్మాణశాఖ ఏఈ మాధవరావు, ఆర్‌అండ్‌బీ జేఈ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'శౌచాలయాల నిర్మాణం వేగవంతం చేయాలి'

కొత్తూరు: మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులు చొరవచూపాలని ఎంపీడీవో పి.రాజేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన గ్రీవెన్స్ సెల్ అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని చెప్పారు. మరుగుదొడ్లు నిర్మించిన వారం రోజుల్లోనే బిల్లులు చెల్లిస్తామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణమూర్తి, జేఈ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సామర్థ్యం పెంపొందాలి'

ఎల్.ఎన్.పేట: నాణ్యమైన విద్య అందించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మండల కార్యా లయంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందించి మెలకువలు నేర్పాలని చెప్పారు. సమయ పాలన పాటిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఎం.సింహచలం, శ్రీధర్, అచ్చుతరావు, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో

వృద్ధుడికి గాయాలు

టెక్కలిటౌన్: స్థానిక డిగ్రీ కళాశాల ఎదురుగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి సిహెచ్.అప్పడు సోమవారం స్పృహతప్పి పడిపోవడంతో గాయపడ్డారు. అయితే ఆయన్ను ఎవరూ పట్టించుకోలేదు. అదే మార్గంలో వస్తున్న ఓ ద్విచక్రవాహనదారుడు 108 వాహనంకు సమాచారం ఇచ్చి అప్పడును ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ లక్ష్మణరావు ప్రథమ చికిత్స అందించారు.



గాయపడిన అప్పడు

'అలసత్వం వహిస్తే చర్యలు'

ఎల్.ఎన్.పేట: విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో సిహెచ్.మోహన్‌ప్రసాద్ హెచ్చరించారు. పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవుపై వెళ్లిపోవాలన్నారు. సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు ఉదయం 10 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని, కారదర్శులందరు తమ టూర్ షెడ్యూలు ఇవ్వాలని చెప్పారు. పంచాయతీల ఆస్తుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులు పరిశీలనకు వచ్చినపుడు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీవిశ్వేశ్వరరావు ఉన్నారు.

చురుగ్గా 'ప్రెస్' సర్వే

హిరమండలం: మండలంలో పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూటషన్(ప్రెస్) సర్వే చురుగ్గా సాగుతోందని ఎంపీడీవో జి.కాశీ విశ్వనాథరావు చెప్పారు. సోమవారం ఆయన అక్కరాపల్లిలో సర్వేను పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఇంటికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ఆ ఇంటికి ఎంత మేర పన్ను విధించవచ్చు, పరిసరాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తెలుసుకునే వీలుంటుందన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి ఉన్నారు.

నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

పాతపట్నం: స్థానిక నీలకంఠేశ్వర ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పాతపట్నం పరిసర ప్రాంతాలతోపాటు ఒడిశా నుంచి కూడా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహేంద్రతనయ నదీ జలాలు పెరిగితే నీలకంఠేశ్వరుని ఆలయ గర్భగుడిలో నీటిమట్టం పెరిగే విశిష్టత ఉంది. ఈ వారం నీరు ఎక్కువగా రావడంతో ఆలయంలోనూ నీరు పెరిగింది.



నీలకంఠేశ్వరుడు

'వినాయక ఉత్సవాలకు మైక్ అనుమతి తప్పనిసరి'

నందిగాం: ఈనెల 25 నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి మైక్ అనుమతి విధిగా పొందాలని నందిగాం ఎస్‌ఐ వి.సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మండపాల్లో మైక్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే దాని వినియోగానికి మీసేవ కేంద్రాల్లో రుసుం చెల్లించి కాశీబుగ్గ డీఎస్పీ అనుమతితో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవ కమిటీలు తమ సమాచారాన్ని స్పష్టంగా ఇవ్వాలని కోరారు. అలాగే వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో బాణసంచా నిషేధించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉత్సవ కమిటీల సభ్యులు గమనించాలన్నారు. ఎవరైనా బాణసంచా కాలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఆవులతో ట్రాఫిక్ ఇబ్బందులు

టెక్కలిటౌన్: రెవెన్యూ డివిజన్ కేంద్రం టెక్కలిలోని రోడ్లపై ఆవుల సంచారంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొడాలి జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఇందిరాగాంధీ జంక్షన్, జడ్పీ రోడ్డు, చిన్నబజారు, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఆవులు సంచరిస్తున్నాయి. ఆవులు రోడ్డుపై అడ్డంగా పడుకోవడం, రోడ్డుపై సంచరిస్తూ వాహనాలకు అడ్డంగా రావడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందిరాగాంధీ కూడలిలో అయితే పాతబస్టాండ్ నుంచి వచ్చే లారీలు, ఇతర వాహనాల కిందపడి ఆవులు మృతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. సమీపంలో రైల్వేగేటు ఉన్నందున బరువుతో వచ్చే లారీలకు అడ్డంగా ఆవులు నిలిచిపోవడంతో వాహనం సడన్ బ్రేక్ వేస్తే వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే కూరగాయాలు, కిరాణా దుకాణాల్లోకి దూరి సామగ్రిని చిందరవందర చేస్తుండడంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా కవర్లతో సామాన్లు పట్టుకొని నడుచుకుంటూ వెళ్తే వాటిని లాగేసి నాశనం చేస్తున్నాయి. ఆవుల సంచారంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి రావడంపై పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఆవుల సంచారాన్ని నిర్మూలించాలని పట్టణ ప్రజలంతా విజ్ఞప్తి చేస్తున్నారు.



చిన్నబజారు జంక్షన్‌లో సంచరిస్తున్న ఆవులు

'పోస్టల్ సమ్మె ఉధృతం చేస్తాం'



కోటబొమ్మాళి పోస్టాఫీస్ వద్ద నినాదాలు చేస్తున్న పోస్టుమాస్టర్లు

కోటబొమ్మాళి: కమలేష్‌చంద్ర కమిటీ నివేదికను అమలు చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని పలువురు పోస్టుమాస్టర్లు చెప్పారు. సోమవారం స్థానిక సబ్‌పోస్టాఫీస్ వద్ద 12 పోస్టాఫీసులకు చెందిన అధికారులు, సిబ్బంది నినాదాలు చేశారు. సమ్మె ఆరో రోజుకు చేరిందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం కానరాకవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

'ప్రతి ఇంటికీ శౌచాలయం'

సంతబొమ్మాళి: మండలంలోని ప్రతి ఇంటికి మరుగుదొడ్డి మంజూరు చేయాల్సిందేనని ఎంపీడీవో ఎం.ప్రభావతి చెప్పారు. సోమవారం ఆమె మరుగుదొడ్ల మంజూరుపై ఇంతవరకు పూర్తి వివరాలు రాకపోవడంపై పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో ప్రభావతి

ఈ విషయంలో కమిషనర్, కలెక్టర్ ఆగ్రహంతో ఉన్నారన్నారు. ప్రతి పంచాయతీలోను ఎన్ని గృహాలు ఉన్నాయి, మరుగుదొడ్లు లేనివారి వివరాలు సేకరించి వారి పేర మరుగుదొడ్డి మంజూరు చేయాలని చెప్పారు. మంజూరైన వెంటనే మరుగుదొడ్డి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆమె ఆదేశించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా మండలంలో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు నిర్మాణం పూర్తిచేయాల్సిన అవసరముందన్నారు.

'విద్యాభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయులదే'



మాట్లాడుతున్న ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

సంతబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయులదేనని రాజీవ్ విద్యా మిషన్ ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ చెప్పారు. సోమవారం ఆయన ఎంఆర్సీలో జరిగిన స్కూల్‌కాంప్లెక్స్ కంప్యూటర్ శిక్షణలో మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారు అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు రాజీవ్ విద్యా మిషన్ ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జె.చిన్నవాడు, తదితరులు పాల్గొన్నారు.

వినపడని 'విందాం... నేర్చుకుందాం'

టెక్కలిటౌన్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు విందాం... నేర్చుకుందాం ద్వారా సోమవారం ప్రవేశపెట్టిన రేడియో పాఠాలు ఎక్కడా వినపడిన దాఖలాలు లేదు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే పాఠాలతో పాటు మరింత నైపుణ్యాన్ని కల్పించే విధంగా విందాం... నేర్చుకుందాం అనే కార్యక్రమం ద్వారా రేడియో పాఠాలు వినిపించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం నవంబర్ 21తో ముగుస్తుంది. 53 రోజులు రేడియో పాఠాలు ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులకు వినిపించాలి. ఇందుకు అవసరమైన షెడ్యూల్‌ను రూపొందించారు. తెలుగు, ఇంగ్లిష్, పరిసరాల విజ్ఞానం, గణితంతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు అందించే కథలను కూడా పొందుపరుస్తూ ప్రణాళికను రూపొందించారు. అయితే సోమవారం ఇది అమలైన జాడ ఎక్కడా కనపడలేదు.

'వాల్టా చట్టంపై అవగాహన ఉండాలి'

నందిగాం: వాల్టా చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పి.రాంబాబు అన్నారు. సోమవారం ఆయన వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సీసీలు, ఎంపీఈవోలతో నిర్వహించన సమావేశంలో మాట్లాడారు. వాల్టా చట్టం పటిష్టంగా అమలుచేయాలని, గ్రామాల్లో ఎక్కడైనా బోర్లు తవ్వాలనుకుంటే తహసీల్దార్ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు అక్టోబరు నాటికి పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు.

పందుల నిర్మూలనకు చర్యలు

టెక్కలిటౌన్: రెవెన్యూ డివిజన్ కేంద్రం టెక్కలిలో పందుల నిర్మూలనకు సోమవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు చర్యలు చేపట్టారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'పందుల స్వైరవిహారంతో ప్రజలు బెంబే లు' శీర్షికన ప్రచురించిన కథనంపై స్పందించిన పంచాయతీ యంత్రాంగం వాటి నివారణ చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా పంచాయతీలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న పందులను పంచాయతీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వాణీ బెహరా మాట్లాడుతూ పట్టణంలో పందులు సంచరిస్తే జరిమానా విధిస్తామని పందుల పెంపకందారులకు తెలియజేశామని, అయినా వారు స్పందించకపోవడంతో వాటిని పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా పందుల పెంపకందారులు వాటిని పట్టణానికి దూరంగా తీసుకువెళ్లి పెంచుకోవాలని సూచించారు. ఇకపై పట్టణంలో పందులు సంచరిస్తే పెంపకందారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పందులను పట్టుకుంటున్న పారిశుధ్య సిబ్బంది

చెరువు కాదు... రోడ్డే!

బోరుభద్ర(సంతబొమ్మాళి): మండలంలోని డీపీఎన్ రోడ్డులో బోరుభద్ర వద్ద రోడ్డు చెరువును తలపిస్తుంది. సుమారు వందమీటర్లు మేర వంశధార నీరు రోడ్డుపై నుంచే ప్రవహిస్తోంది. అడుగున్నర మేర వంశధార నీరు రోడ్డు మీద ప్రవహించడంతో ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడే గతంలో కురిసిన వర్షాలకు రోడ్డుకు గండిపడి సగానికి పైగా కొట్టుకుపోయింది. నిత్యం రోడ్డుపై వంశధార నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గండిపూడ్చి రహదారిపై నీటి ప్రవాహం లేకుండా చూడాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బోరుభద్ర వద్ద దుస్థితి

'కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించాలి'

టెక్కలిటౌన్: నందిగాం మండలంలో కొండల ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రథజనబొడ్డపాడు సర్పంచ్ బుడ్డ ధనుంజయరావు, తమిరె బలరామస్వామి, ఎన్.రామమూర్తి, ఎల్.విశ్వనాథం కిడ్నీ బాధితులతో కలిసి సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావుకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందిగాం మండలంలోని ఆర్‌జేబొడ్డపాడు, కర్లపూడి, మధురామాలపేట, పోతులూరు, బైరిబొడ్డపాడు, బెల్లుకోల, సవరనీలాపురం, పెద్దగురువూరు, హర్షబాడ తదితర గ్రామాలకు చెందిన పలువురు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళం, విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారికి వైద్యం అందించి ఆర్థికంగా సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే విశాఖపట్నంలో చికిత్స పొందుతూ మురపాల భుజంగరావు, అంబలి మల్లేసు మృతిచెందారని తెలిపారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి పంపిణీ

టెక్కలిటౌన్: టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. కేంద్రాల్లోనున్న చిన్నారుల ఎత్తు, బరువు కొలిచే పరికరాలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకులకు సంబంధించిన యూనిఫారాలను పీవో జె.భవాని చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గోవిందరాజులమ్మ, జలజాక్షి, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.